అక్టోబర్
2019

162

సంపుటి : 14 సంచిక : 6

వెల రు. 10/-

## ఈ సంచికలో........

భారత దేశంలో ఆర్థిక మాంద్యం: కారణాలు, నివారణా మార్గాలు

సోషలిస్టు వ్యవస్థ: చిన్న ఉత్పత్తిదారులు

కంచు యుగం వైపుగా

భారత దేశంలో రోగిష్టి నియంతృత్వం

వ్యవసాయేతర పనుల్లోకి వ్యవసాయకార్మికులు

గృహశ్రమ నుండి మహిళ విముక్తి కావాలి

తొలి కార్మిక వర్గ రాజ్యం ఇచ్చిన స్ఫూర్తితో భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావం

# తొలి కార్మికవర్గ రాజ్యం ఇచ్చిన స్ఫూర్తితో భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావం



రచయిత సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు

**ఆర్. రఘు**

"స్వాతంత్రోద్యమం ఆవిష్కరించిన యుగం ముగుస్తున్నట్లనిపిస్తున్నది. పూర్తిగా బద్ధలయిపోతున్న దేశాన్ని నేటి తరం వారసత్వంగా పొందనుంది. మరల కిందినుండి దేశాన్ని పునర్నిర్మించుకోవడం తప్ప మరో మార్గం లేదు" అన్న ప్రముఖ మార్క్సిస్టు విశ్లేషకులు ఐజాజ్ అహ్మద్ (ఫ్రంట్‌లైన్ 23.2019) వ్యాఖ్యానం సరైనదే. బిజెపి 2014లో పూర్తి మెజారిటీతో అధికారం లోకి రావడం, 2019లో మరిన్ని ఎక్కువ పార్లమెంటు స్థానాలను గెలుచుకొని తిరిగి అధికారంలోకి రావడంతో భారతదేశ రాజకీయాలు, వీటితో పాటు సమాజ గమనమే పచ్చి మితవాదం వైపు తిరిగింది. నేడు దేశం ఒక కీలకమైన మూల మలుపులోకి వచ్చింది. మధ్యేవాద పార్టీలు బలహీనపడి వాటిస్థానంలోకి మతోన్మాద ఫాసిస్టు తరహా బిజెపి చొరబడింది. దీనికి వ్యతిరేకంగా వామ పక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయం నిర్మించడం తప్ప మరో మార్గం లేదు. అందుకు వామపక్ష శక్తులనే గాదు, ప్రగతిశీల, హేతువాద, సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న అణగారిన శక్తులన్నింటినీ కూడదీయాల్సిన చారిత్రక బాధ్యత భారత కమ్యూనిస్టు ఉద్యమం మీద పడింది. అందువలన మన దేశంలో ఆర్థిక, సాంఘీక, సాంస్కృతిక అణచివేతలన్నింటికీ వ్యతిరేకంగా పోరాడిన, పోరాడుతున్న ఉద్యమాలను, సంస్థలనూ, వ్యక్తులనూ నూతన సమాజ నిర్మాణం కోసం జరిగే పోరాటంలోకి సమీకరించాలి. ఇటువంటి ఉద్యమాలు, పోరాటాలన్నింటికీ నిజమైన వారసురాలు భారత కమ్యూనిస్టు ఉద్యమం.

ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమాల ఉత్పాదకం భారత కమ్యూనిస్టు ఉద్యమం. అందువలన భారత కమ్యూనిస్టు ఉద్యమం గురించి తెలుసుకోవాలన్నా, అందులో క్రియాశీలకంగా పనిచేయాలన్నా, అన్నింటికన్నా మించి ఈ



రోజు హిందూత్వ శక్తులు ప్రయత్నిస్తున్న తిరోగమన భారత నిర్మాణానికి భిన్నంగా ప్రగతిశీల నవభారత నిర్మాణం చేయాలన్నా భారత స్వాతంత్ర్యోద్యమం, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమాను గురించి తెలుసుకోవాల్సి ఉంటుంది. ఆ రెండు ఘనమైన చరిత్రల సారాంశం అంటే అందులోని ఒడిదుడుకులూ, జయాపజయాలు, అంతరంగిక ఘర్షణలూ, ప్రజల ప్రతిస్పందనలూ, నాయకుల పాత్రలూ, వర్గ స్వభావాలు వంటి వాటి ప్రభావం భారత కమ్యూనిస్టు ఉద్యమం మీద సహజంగానే ఎంతో ఉంది.

### చరిత్ర ఒక ఆయుధం

పాలకుల చేతుల్లోనైనా, పీడితుల చేతుల్లోనైనా చరిత్ర ఒక ఆయుధంగా ఉంటుంది. అందుకే పాలకులు చరిత్రను వ్యక్తుల చుట్టూ పరిమితం చేయడానికి తాపత్రయ పడతారు. తమ వర్గ ప్రయోజనాలకు అనుగుణంగా విధానాలు రూపొందించి వాటిని ప్రజలతో ఒప్పించడానికి చరిత్రను తిరగరాయడం వారికి అవసరం. ఇక బిజెపి వంటి ఫాసిస్టు తరహా పార్టీలకైతే చరిత్రను వక్రీకరించడం, పుక్కిటి పురాణాల్ని, అబద్ధాల్ని చరిత్రగా చిత్రించడం వారి విధానాల్లో అంతర్భాగం. ఆర్ఎస్ఎస్, దాని తోకసంస్థలూ, వారి మేధావులూ మన దేశం వేలాది సంవత్సరాలు పరాయి పాలన కింద వుందనీ, బ్రిటిష్ పాలకులు వెళ్లిపోయినా, మొగల్ పాలకుల వారసులు, అంటే ముస్లిం మతస్థులు మిగిలిపోయారని, వారిని కూడా వెళ్లగొట్టాలని వాదిస్తున్నారు. ఆ వాదన నిజమైతే మొగలులకు ముందు కూడా క్రీ.పూ 1500 సంవత్సరాల నుండి ఆర్యులు మొదలుకొని అనేక జాతులు మనదేశం మీదకు వచ్చాయి. మరి ఆర్ఎస్ఎస్ గొప్పగా చెప్పుకునే ఆర్యులను, వారి వారసులను తరిమివేయాలి కదా! వారి పూజ్యులైన ఆర్యులు వచ్చిందీ, ముస్లిం చక్రవర్తులు వచ్చింది మధ్యఆసియా ప్రాంతం నుండేనన్నది తెలిసినా ఆర్ఎస్ఎస్ తెలియనట్లు నటిస్తున్నది. వాస్తవానికి బ్రిటీష్ వారు ఒక్కరే పరాయి పాలకులుగా వచ్చారు. పరాయి పాలకుల్లాగానే పాలించారు. సాధ్యం కానప్పుడు పరాయి వారుగానే వెళ్లిపోయారు. మిగిలిన జాతుల నుండి వచ్చిన చక్రవర్తులూ పాలించారు. ఇక్కడే జనజీవనంలో కలిసిపోయారు. దాదాపు 3000 సంవత్సరాలు సాగిన వివిధ జాతులు, మత భేదాల కలయిక పర్యవసానంగా భారతీయత, భారత సంస్కృతి, నాగరికత వంటివి ఆవిర్భవించాయి. 190 సంవత్సరాలు సాగిన బ్రిటిష్ పాలకుల పరాయిపాలనకు వ్యతిరేకంగా సాగిన చరిత్ర ఈ భారతీయతకు మరింత స్పష్టమైన అర్థాన్ని సమకూర్చింది. దురదృష్ట వశాత్తు స్వాతంత్ర్యానంతరం సాగిన బడాపెట్టుబడిదారీ పాలన పుణ్యమా అని సామ్రాజ్యవాద వ్యతిరేకత ప్రాధాన్యత తగ్గించబడే కొద్దీ భారతీయతలోకి హిందూత్వం చొరబడడం వేగం పుంజుకున్నది.

## ఈ సంచికలో...


**1. తొలి కార్మిక వర్గ రాజ్యం ఇచ్చిన స్ఫూర్తితో భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావం**
ఆర్ రఘు ............... 2

**2. భారత దేశంలో ఆర్థిక మాంద్యం: కారణాలు, నివారణా మార్గాలు**
ప్రొ॥ కె. నాగేశ్వర్ ........ 4

**3. సోషలిస్టు వ్యవస్థ: చిన్న ఉత్పత్తిదారులు**
ప్రభాత్ పట్నాయక్ ....... 7

**4. కంచు యుగం వైపుగా**
ఎం.వి.ఎస్. శర్మ ....... 14

**5. భారత దేశంలో రోగిష్టి నియంతృత్వం**
అఖీల్ బిల్గ్రామి ........ 17

**6. వ్యవసాయేతర పనుల్లోకి వ్యవసాయకార్మికులు**
సి. సాంబిరెడ్డి ........... 22

**7. గృహశ్రమ నుండి మహిళ విముక్తి కావాలి**
మార్గరెట్ బెన్‌స్టన్ ..... 28



**సంపాదకుడు:**
**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**
పాటూరు రామయ్య
బి.వి. రాఘవులు
తమ్మినేని వీరభద్రం
ఎస్. వీరయ్య
తెలకపల్లి రవి



**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**ఫోన్: ఎడిటర్ : 9490099333**
**మేనేజర్: కె.హరికిషోర్: 9490098977, 9494101091**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org


# వాతావరణం

వాతావరణ మార్పుల వల్ల భూగోళానికి వస్తున్న ముప్పును నివారించడంలో ప్రపంచ దేశాల నాయకులు విఫలమైనారని 16 ఏళ్ల స్వీడిష్ బాలిక గ్రెటా థన్‌బెర్గ్ సెప్టెంబర్ 23న ఐక్యరాజ్య సమితి ప్రత్యేక సమావేశంలో ఒక వైపు గర్జిస్తుంటే మరోవైపు ఆమెకు మద్దతుగా ప్రపంచ దేశాలన్నిటా విద్యార్థులు, యువకులు, కార్మికులు పెద్దఎత్తున ప్రదర్శనలు చేయడం ప్రస్తుత ప్రపంచ రాజకీయాల్లో ఈ అంశం యొక్క ప్రాధాన్యతను ప్రతిబింబిస్తోంది. సెప్టెంబర్ 20న 161 దేశాల్లో జరిగిన ప్రపంచ వాతావరణ సమ్మెలో మొత్తం 5,800 ప్రదేశాల్లో 40 లక్షల మంది ప్రజలు ముఖ్యంగా యువకులు, కార్మికులు పాల్గొన్నారు. భూగోళ తాపాన్ని నివారించడానికి తగిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు విఫలం అయినాయని వీరంతా ఎలుగెత్తి చాటారు. రెండు రోజుల తరువాత ఐక్యరాజ్య సమితిలో వాతావరణ కార్యకర్త గ్రెటా చేయబోయే ప్రసంగానికి మద్దతుగా జరిగిన ఈ ప్రదర్శనలు వివిధ దేశాల్లోని యువతలో వాతావరణ విపత్తులపై పెరుగుతున్న జాగృతిని తెలియజేస్తున్నాయి.

ఐక్యరాజ్యసమిలో వాతావరణ మార్పులపై జరిగిన చర్చలో ఇద్దరి ప్రసంగాలు విశేషంగా ఆకర్షించాయి. ఒకటి గ్రెటా థన్‌బెర్గ్‌ది కాగా మరొకటి బొలీవియా అధ్యక్షుడు ఇవో మొరెల్స్‌ది. అయితే గ్రెటా ప్రసంగానికిచ్చిన ప్రచారం మొరెల్స్‌కు కార్పొరేట్ మీడియా ఇవ్వలేదు. కారణం... గ్రెటా వాతావరణ మార్పులు అరికట్టడంలో ప్రపంచ ప్రభుత్వాల వైఫల్యాలపై ప్రజాగ్రహాన్ని తన ప్రసంగంలో వెళ్లగక్కింది. ఆమె దర్మాగ్రహంతో తమకు వచ్చే ప్రమాదం లేదని కాలుష్య కారకులు భావిస్తుండవచ్చు. వాతావరణ మార్పుల ప్రమాదం గురించి ఈ ప్రపంచంలో మాట్లాడని వారు లేరు. దాన్ని అరికట్టాలని చెప్పని నాయకుడు లేడు. తగిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పని దేశాధినేత లేడు. చివరికి పారిస్ వాతావరణ ఒప్పందం నుండి బయటకు వచ్చేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా మేం వాతావరణంలోకి వదిలే ఉద్గారాలు తగ్గించడానికి అందరికన్నా ఎక్కువ చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నారు.

కాని భూ తాపాన్ని ఎందుకు అరికట్టలేకపోతున్నామో, దానికి అడ్డువస్తున్న అసలైన దోషి ఎవరో చెబితేనే వీరికి సమస్య వచ్చి పడుతుంది. కార్పొరేట్ మీడియాకు మరింత సమస్య వస్తుంది. బొలీవియా అధ్యక్షుడు ఆ పని చేశాడు కనుకనే ఆయన ప్రసంగానికి ప్రచారం రాలేదు. కానీ ఆయన గతంలో మాదిరిగానే ఈ సారికూడా ఐక్యరాజ్య సమితిలో చేసిన ప్రసంగాన్ని వాతావరణ మార్పుల పట్ల ఆందోళన చేస్తున్న ప్రజానీకం, ముఖ్యంగా యువత వినాల్సి ఉంది.

వాతావరణ మార్పుల నివారణ కోసం "పారిస్ ఒప్పందం వంటి ప్రపంచ వ్యాపిత కృషి అవసరమే కానీ ఈ సంక్షోభానికి సంబంధించిన వ్యవస్థాగత కారణాలను మనం పరిష్కరించకుండా దీనికి స్వస్తి పలకలేం. వాతావరణ మార్పు అనేది పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క అనివార్య పర్యవసానం" అని ఆయన సూటిగా చెప్పారు. ఇతర దేశాల్లో జోక్యం చేసుకోడానికీ, సైనిక స్థావరాలు నిర్మించడానికీ ప్రభుత్వాలు విపరీతంగా ఖర్చు చేస్తున్నాయి, స్థావరాలు నిర్మిండం నిలిపివేసి వాతావరణ మార్పులను నివారించడానికీ, పేదరికం నిర్మూలించ డానికీ, ప్రపంచ శాంతి నెలకొల్పడానికి ఆ డబ్బు ఖర్చు చేస్తే పని జరుగుతుంది అని ఆయన సలహా ఇచ్చారు.

వాస్తవానికి వాతావరణంలోకి కర్బన ఉద్గారాలు వదలడం అనేది రెండున్నర శతాబ్దాల క్రితం ప్రారంభమైన పెట్టుబడిదారీ పారిశ్రామిక విప్లవంతోనే ప్రారంభమైంది. పెట్టుబడిదారుల లాభాపేక్ష వాతావరణాన్ని రోజురోజుకీ మరింత కలుషితం చేస్తోంది. భూగోళాన్ని మరింత వేడెక్కిస్తోంది. ప్రపంచ ప్రజలకు, ముఖ్యంగా పేద దేశాల పేద ప్రజలకు ప్రమాదాన్ని పెంచుతోంది. ఈ ప్రమాదం అంతం కావాలంటే అంతులేని లాభాపేక్ష అంతం కావాలి. అది అంతం కావాలంటే దాన్ని తీసుకువచ్చిన పెట్టుబడిదారీ వ్యవస్థ అంతం కావాలి.

వాతావరణ మార్పుల నివారణ కోసం ప్రపంచమంతటా జరుగుతున్న ప్రజా కార్యాచరణలకు ఈ సైద్ధాంతిక అంశం తోడైతేనే నిజమైన మార్పు సాధ్యమవుతుంది.


**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ.10**, సంవత్సర చందా: **రూ.100**, పోస్టు ద్వారా **రూ. 120**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

**ఈ మాసం ముఖ్యాంశం**

# భారత దేశంలో ఆర్థిక మాంద్యం: కారణాలు, నివారణా మార్గాలు

**ప్రొ॥ కె. నాగేశ్వర్**



రచయిత ప్రముఖ రాజకీయ విశ్లేషకులు

**భా**రతదేశ ఆర్థికవ్యవస్థ ప్రస్తుతం మాంద్యంలోకి దిగజారింది. క్రమక్రమంగా అన్ని రంగాలపైనా మాంద్యం ప్రభావం చూపుతోంది. ప్రభుత్వానికి వచ్చే ఆదాయంపైనా మాంద్యం ప్రభావం ఉంది. తెలంగాణ ప్రభుత్వం ఇటీవలే బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. అందులో దాదాపు 36 వేల కోట్ల రూపాయల ఆదాయం పడిపోయినట్లు చూపించారు. ప్రజలు చేసే ఖర్చు వల్ల పన్నుల ద్వారా ప్రభుత్వానికొచ్చే ఆదాయమే ఇంత స్థాయిలో పడిపోతే ఇక ప్రజల ఆదాయాలు ఎంత భారీ స్థాయిలో పడిపోయాయో అర్థం చేసుకోండి. మాంద్యం ప్రభావం రోజురోజుకూ పెరుగుతున్నా దీని వల్ల ప్రజలకు కలిగే ఇబ్బందులపై తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం కానీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గానీ మాట్లాడడం లేదు. మరోవైపు రెండు రాష్ట్రాల్లో ఉన్న ప్రధాన రాజకీయ పార్టీలు కూడా మాంద్యం ప్రభావం గురించి ప్రభుత్వాన్ని నిలదీయడం లేదు. కనీసం మీడియా కూడా మాంద్యం ప్రభావం ఎలా ఉంది, ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడుతున్నారని అధ్యయనం చేయడం లేదు, వార్తలు ప్రచురించడం లేదు. కానీ మాంద్యం మాత్రం రోజురోజుకూ తీవ్రమౌతోంది. ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోతోంది.

విజయవాడలో పరిస్థితినే గమనిద్దాం. ఇక్కడి జెఆర్‌డి టాటా పారిశ్రామిక వాడలో దాదాపు 120 పరిశ్రమలు ఉన్నాయి. 2,500 మందికి ఉపాధిని కల్పిస్తున్నాయి. కానీ గత మూడు నెలల కాలంలో మాంద్యం కారణంగా 300 మందిని ఉద్యోగాల్లోంచి తీసేశారు. దాదాపు అన్ని కంపెనీల్లో 30 నుంచి 70 శాతం అమ్మకాలు పడిపోయాయి. గత ఏడాది కాలంలో ఇక్కడ దాదాపు 10 చిన్న తరహా పరిశ్రమలు మూతపడ్డాయి. వాటి భవనాలు కాస్తా గోడౌన్లుగా మారిపోయాయి. భవనాలు గోడౌన్లుగా మారడం అంటే వ్యవసాయంలో పశువులను సంతకు తోలడంతో సమానం. పశువులను సంతకు తోలుతున్నారంటే కరువు అధికంగా ఉన్నదని అర్థం. విజయవాడ వ్యాపారులు చెప్పే ప్రకారం వారి అమ్మకాల్లో 40 శాతం పడిపోయాయి. జూన్ మాసంలో సాధారణంగా చెప్పులకు గిరాకీ ఉంటుంది. ఈ కాలంలో ప్రతి ఏడాది 10 నుండి 12 శాతం అదనంగా అమ్మకాలు జరుగుతాయి. కానీ ఈ ఏడాది అమ్మకాలు పెరగక పోగా 5 శాతం తక్కువ జరిగాయి. అంటే దాదాపు 15 నుండి 20 శాతం మేరకు డిమాండ్ తగ్గింది. విశాఖ స్టీల్ ప్లాంట్ ఉత్పత్తిలోనూ పది శాతం అమ్మకాలు పడిపోయాయి. తెలంగాణలోనూ ఎంఆర్ఎఫ్ టైర్ల కంపెనీ 40 శాతం ఉత్పత్తిని తగ్గించుకుంది. ఆటో రంగంలో 200 కోట్ల రూపాయల వ్యాపారం చేసే కుశలవ కంపెనీ దాదాపు 200 మంది రోజువారీ కూలీలను, అప్రెంటీస్‌లను తమకు అక్కర్లేదని పంపించేసింది. చెన్నై నగరంలో ఐటి రంగంలో లక్ష మందిని ఉద్యోగాల నుంచి తీసేశారు.


సంక్షోభం చాలా తీవ్రంగా ఉంది. భారీ స్థాయిలో ఉద్యోగాల నుండి తొలగిస్తున్నారు. దీనిపై ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వితండ వాదన చేస్తున్నారు. యువత మనస్తత్వం మారిందని, వారు కార్లు కొనకుండా ఊబర్, ఓలాలలో తిరుగుతున్నారని, అందుకే కార్ల అమ్మకాలు పడిపోయాయని చెబుతున్నారు. అయితే యువకులు అల్యూమినియం పాత్రలు ఎందుకు కొనడం లేదు, చెప్పులు ఎందుకు కొనడం లేదు, పార్లే కంపెనీ తమ ఐదు రూపాయల బిస్కెట్లకు డిమాండ్ తగ్గిపోయిందని ఇటీవలే ప్రకటించింది. దీన్ని బట్టి మొత్తంగా ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో ఉందని అర్థమవుతుంది. మాంద్యం ప్రభావం ప్రజలపై విపరీతంగా ఉంది. మాంద్యం మరో నాలుగు నెలల పాటు ఇలాగే కొనసాగితే కాంట్రాక్ట్ ఉద్యోగులతో పాటు పర్మినెంట్ ఉద్యోగులను కూడా తీసేయాల్సిన పరిస్థితి వస్తుంది. ప్రారంభంలో కొత్త వారిని ఉద్యోగంలోకి తీసుకోవడం ఆపేశారు. ఆ తర్వాత అప్పటికే పనిచేస్తున్న రోజువారీ కార్మికులను, కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగిస్తున్నారు.

### కిందిస్థాయి ప్రజలపై అధిక భారం

దేశవ్యాప్తంగా తీసుకుంటే అన్ని రంగాల్లోనూ పరిస్థితి తీవ్రంగా ఉంది. మారుతి కార్ల విషయంలో దాదాపు 36 శాతం అమ్మకాలు తక్కువగా ఉంటే ఆల్టో, వాగనార్ బ్రాండ్లలో 63 శాతం అమ్మకాలు పడిపోయాయి. మాంద్యం అన్ని తరగతుల ప్రజలపై ఒకే రకమైన ప్రభావం వేయటం లేదు. కిందిస్థాయి ప్రజలపై ఎక్కువ ప్రభావం ఉంటుంది. తక్కువ ఆదాయాలు ఉన్న వారు, కిందిస్థాయిలో పనిచేసేవారు ముందుగా ప్రభావితమౌతారు. మాంద్యం ప్రభావం కారణంగా ముందుగా కొత్తగా ఉపాధి రాదు. ఆ తర్వాత రోజువారీ ఉద్యోగులను తీసేస్తారు. ఆ తర్వాత కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగిస్తారు. చివరికి పర్మినెంట్ ఉద్యోగులపై కూడా ప్రభావం ఉంటుంది. మాంద్యం ప్రభావం ప్రారంభం కాగానే కార్మిక సంఘాలు బేరమాడే శక్తిని కోల్పోతాయి. అసలు పనే లేకపోతే జీతాల పెంపుదలపై, ఉపాధి రక్షణపై మాట్లాడే అవకాశమే ఉండదు. అయితే ఈ సంక్షోభం కొత్త అవకాశాలను కూడా ఇస్తుంది. ఇన్నాళ్లూ కార్మిక సంఘాలు యాజమాన్య సంఘాలపైన పోరాడాయి. ప్రస్తుతం కార్మికసంఘాలు, యాజమాన్య సంఘాలు కలిసి ప్రభుత్వంపైన పోరాడతాయి. ఆటోమొబైల్స్. ఆహార రంగం, గృహ వినియోగ వస్తువులు, టెక్స్‌టైల్స్ ఇలా ఒక్కటేమిటి అన్ని రంగాల్లోనూ అమ్మకాలు పడిపోయాయి. ఇటీవలే బిజినెస్ లైన్ పత్రిక ప్రచురించిన వార్త ప్రకారం కార్పొరేట్ కంపెనీల రుణ చెల్లింపు

సామర్థ్యం పడిపోయింది. అంటే ఆ కంపెనీల ఆదాయాలు పడిపోయాయి. ఈ నాలుగైదు నెలల్లో స్టాక్ మార్కెట్‌లో 82 శాతం స్టాక్స్ తమ విలువను కోల్పోయాయి. 20 శాతంపైగా స్టాక్స్ 25 శాతం పైగా విలువను కోల్పోయాయి. కేవలం 3 శాతం కంపెనీలు మాత్రం 25 శాతం కన్నా ఎక్కువ లాభాలను ఆర్జించాయి. జిడిపి 5 శాతానికి తగ్గింది. నామినల్ జిడిపి 11 శాతం ఉంటుందని అంచనా వేస్తే 8 శాతం మాత్రమే ఉంది. గత 15 ఏళ్లలో ఇంత తక్కువగా ఏనాడూ నామినల్ జిడిపి నమోదు కాలేదు. ఆటోమొబైల్, సంబంధిత రంగాల్లో గత నాలుగు నెలల్లో మూడున్నర లక్షల మంది ఉపాధిని కోల్పోయారు. ఈ సంఖ్య పది లక్షలకు చేరవచ్చునని అంటున్నారు. వీటన్నింటి కారణంగా ప్రభుత్వ ఆదాయం కూడా పడిపోతోంది. జిఎస్‌టి ఆదాయం నెలకు లక్షా 15వేల కోట్లు ఉంటుందని అంచనా వేస్తే 98 వేల కోట్లు మాత్రమే వచ్చింది.

> “బ్యాంకుల విలీనీకరణ వెనుక ఉన్న అసలు లక్ష్యం వాటిని ప్రయివేటీకరించేందుకే గానీ పరిపుష్టం చేసేందుకు కాదు. గుజరాత్‌లో ఎక్కువగా కార్యకలాపాలు సాగించే దేనా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడాలకు మొండి బకాయిలు ఎక్కువగా ఉన్నాయి. ఈ రెండింటినీ మొండి బకాయిలు చాలా తక్కువగా ఉన్న విజయా బ్యాంక్‌లో కలిపారు. దీంతో మొత్తంగా మొండి బకాయిల శాతం తగ్గుతుంది.”




ఇప్పటి వరకు సంక్షోభం తీవ్రత గురించి చర్చించుకున్నాం. సంక్షోభం కారణంగా ఉపాధి పోతుందని చెప్పుకున్నాం. అయితే ఈ సంక్షోభం కారణంగా బ్యాంకుల పరిస్థితి కూడా మారిపోతుంది. బ్యాంకులు ఇబ్బందుల్లోకి వెళతాయి. బ్యాంకులు కంపెనీలకు అప్పులు ఇస్తాయి. ఆర్థిక మాంద్యం కారణంగా కంపెనీలకు రుణ చెల్లింపులు చేసే సామర్థ్యం తగ్గిపోతోంది. దీంతో మొండి బకాయిలు పెరుగుతాయి. బ్యాంకులకు తొమ్మిదిన్నర లక్షల కోట్ల మొండి బకాయిలు ఉన్నాయి. కానీ ఈ మధ్య ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బ్యాంకుల మొండి బకాయిలు తగ్గాయని చెప్పారు. అయితే బ్యాంకులకు మొండి బకాయిలు వసూలు కావడం వల్ల అవి తగ్గలేదు. గత ఆరేళ్ల కాలంలో దాదాపు ఐదున్నర లక్షల కోట్ల రూపాయల మొండి బకాయిలను రద్దు చేశారు. ఈ విధంగా రద్దు చేయడం ద్వారా మాత్రమే మొండి బకాయిలు తగ్గాయి కానీ అవి వసూలు అయినందువల్ల కాదు. దేశంలో ఉన్న మొత్తం మొండి బకాయిల్లో 85 శాతం ఐదు కోట్ల రూపాయల పైన అప్పు తీసుకున్నా వారివే. దేశంలోని అంబానీ, అదానీ లాంటి 30 మంది బడా పారిశ్రామిక వేత్తలే అత్యధికంగా ఈ రుణాలు తీసుకున్నారు. దేశంలో రైతాంగం తీసుకున్న మొత్తం రుణాలతో ఈ 30 మంది తీసుకున్న రుణాలు సమానం. రుణాలు బాగా తీసుకుంటున్నది కార్పొరేట్లే...రుణాలు ఎగ్గొడుతుంది కూడా కార్పొరేట్లే. కార్పొరేట్లు రుణాలు ఎగ్గొట్టడంతో బ్యాంకులకు మొండి బకాయిలు పెరిగిపోతున్నాయి. మొండి బాకీ పడ్డ కంపెనీలను లిక్విడేట్ చేసేందుకు ట్రిబ్యునల్‌కు పంపిస్తారు. ఆ ట్రిబ్యునల్ ఆ కంపెనీని అతి తక్కువ రేటుకే అమ్మేస్తుంది. మళ్లీ ఆ కంపెనీలను అంబానీ, అదానీ లాంటి బడా కంపెనీలు కొనుగోలు చేస్తాయి. దీంతో ఆ కంపెనీల ఆస్తులు పెరుగుతాయి. బ్యాంకుల నుంచి అప్పులు తీసుకొని కంపెనీలను ముంచుతారు. ఆ ముంచిన కంపెనీని మళ్లీ వీరే కొనుగోలు చేసి లాభపడతారు. బ్యాంకులను దివాళా తీయిస్తున్నారు. దీంతో మొండి బాకీలు పెరిగిపోతున్నాయి. దీనికి పరిష్కారంగా బ్యాంకుల్లో ప్రయివేట్ రంగ వాటాను పెంచుతున్నారు. అందుకోసమే బ్యాంకుల విలీనీకరణ చేపడుతున్నారు.

బ్యాంకుల విలీనీకరణ వెనుక ఉన్న అసలు లక్ష్యం వాటిని ప్రయివేటీకరించేందుకే గానీ పరిపుష్టం చేసేందుకు కాదు. గుజరాత్‌లో ఎక్కువగా కార్యకలాపాలు సాగించే దేనా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడాలకు మొండి బకాయిలు ఎక్కువగా ఉన్నాయి. ఈ రెండింటినీ మొండి బకాయిలు చాలా తక్కువగా ఉన్న విజయా బ్యాంక్‌లో కలిపారు. దీంతో మొత్తంగా మొండి బకాయిల శాతం తగ్గుతుంది. ఆ తర్వాత ప్రయివేటీకరిస్తారు. ఈ ప్రయివేటీకరణలో కూడా బ్యాంకులను ముంచిన ఈ బడా పారిశ్రామికవేత్తలే ఉంటారు. బ్యాంకు లను కొనడం ద్వారా వీరు మళ్లీ లాభపడతారు. ఇంత నగ్నంగా ఈ మాంద్యం నుంచి కూడా బడా పారిశ్రామిక వేత్తలు లాభపడుతున్నారు. ఈ కాలంలో అందరూ నష్టపోయినా రిలయన్స్ కంపెనీకి మాత్రం లాభాలు వచ్చాయి. ఆర్థిక మాంద్యం కారణంగా కార్మికులు, చిన్న తరహా పరిశ్రమల యజమానులే కాక ఓ మాదిరి కార్పొరేట్లు కూడా నష్టపోతున్నారు. బడా పారిశ్రామికవేత్తలపై పోరాటానికి కార్మికులకు మిత్రులుగా చిన్న చిన్న కార్పొరేట్లు కూడా రాబోతున్నారు.

సరళీకృత ఆర్థిక విధానాల కారణంగా కోట్లాది మంది కార్మికుల, శ్రామికుల సంపద ఒక్క శాతంగా ఉన్న బడా ధనవంతుల వద్ద పోగుపడుతోంది. ఈ ప్రక్రియ మాంద్యంలో మరింత తీవ్రంగా జరుగుతుంది.

ప్రపంచ వ్యాప్తంగా మాంద్యం పరిస్థితులు ఉన్నాయని, ఒక్క భారత్‌కే పరిమితం కాదని ప్రభుత్వం అంటోంది. ప్రపంచ వ్యాప్తంగా మాంద్యం ఎందుకుందంటే అమెరికా, చైనా వాణిజ్యపోరుతో పాటు ఇరాన్‌పై ఉన్న ఆంక్షల ప్రభావమని చెబుతోంది. వీటి వల్ల మాత్రమే మాంద్యం పరిస్థితులు ఉన్నాయని భారత ప్రభుత్వం చెబుతోంది. వీటి వల్లే అనే

**“ మాంద్యానికి విరుగుడుగా భారత ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు అధిక మొత్తంలో రాయితీలు ఇస్తోంది. పెద్ద ఎత్తున ఉత్పత్తి చేస్తే మాంద్యం పోతుందని ప్రభుత్వం చెబుతోంది. వాస్తవానికి ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోవడం వల్లే మాంద్యం పరిస్థితులు ఏర్పడ్డాయి. భారతదేశ ఆర్థిక వ్యవస్థకు సమస్య ఉత్పత్తి పెరగకపోవడం కాదు, ప్రజలకు కొనుగోలు శక్తి లేకపోవడం. ”**

దగ్గరే చిక్కు ఉంది. భారతదేశంలో అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాల వల్ల మాంద్యం ఏర్పడిందనే వాస్తవాన్ని మోడీ ప్రభుత్వం కప్పిపుచ్చడానికే ఈ వాదన తెస్తోంది. అమెరికాతో వాణిజ్యం యుద్ధం జరగుతున్నప్పటికీ చైనాలో మాత్రం ఆర్థికవృద్ధి రేటు 6.5 శాతంగా ఉండగా భారత్‌లో మాత్రం ఐదుశాతం మాత్రమే ఉంది. సహజంగా అమెరికా, చైనా వాణిజ్య పోరులో కొట్టుకుంటుంటే ఆ రెండు దేశాలు నష్టపోయి భారతదేశం లాభపడాలి. కానీ అది జరగడం లేదు. మరోవైపు వియత్నాం, బంగ్లాదేశ్‌లలో ఏడు శాతం కన్నా అధిక వృద్ధి రేటు ఉంది. మరి ఈ రెండు దేశాలను మాంద్యం తాకలేదా...కేవలం భారత్‌ను మాత్రమే తాకిందా..? మరోవైపు దేశంలో అన్ని రకాల వ్యవసాయోత్పత్తులు తగ్గిపోతున్నాయి. వేరుశనగ, పత్తి, ఆముదం గింజల ఉత్పత్తి పడిపోయింది. ఇది ప్రపంచంలో మాంద్యం వల్ల ఏర్పడలేదు. భారత దేశంలో సంస్థాగతంగా ఏర్పడిన సంక్షోభం కారణంగా ఈ పరిణామాలు జరగుతున్నాయి. నిరుద్యోగిత 45 ఏళ్ల కాలంలో అత్యధిక స్థాయికి చేరింది.

**మాంద్యానికి కారణాలు – పరిష్కారాలు**

మాంద్యానికి విరుగుడుగా భారత ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు అధిక మొత్తంలో రాయితీలు ఇస్తోంది. పెద్ద ఎత్తున ఉత్పత్తి చేస్తే మాంద్యం పోతుందని ప్రభుత్వం చెబుతోంది. వాస్తవానికి ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోవడం వల్లే మాంద్యం పరిస్థితులు ఏర్పడ్డాయి. భారతదేశ ఆర్థిక వ్యవస్థకు సమస్య ఉత్పత్తి పెరగకపోవడం కాదు, ప్రజలకు కొనుగోలు శక్తి లేకపోవడం. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి బాగానే ఉంది. కానీ ఆ ఉత్పత్తిని కొనే వారు లేరు. దీంతో ఉత్పత్తిని తగ్గించుకుంటారు. దాని పర్యవసానంగా కొంతమందిని ఉద్యోగాల నుండి తప్పిస్తారు. దీంతో వారి కొనుగోలు శక్తి తగ్గి మాంద్యం మరింత తీవ్రమౌతోంది. దీంతో మళ్లీ మరి కొందరి ఉద్యోగాలు పోతాయి. ఇది ఒక విష వలయం లాంటిది. మాంద్యంలో ఇది నిరంతంర జరిగే ప్రక్రియ. ఈ పరిస్థితుల నుండి బయటపడాలంటే ప్రజలకు ఉపాధి, మంచి వేతనాలు కల్పించాలి. తద్వారా వారి కొనుగోలు శక్తి పెరిగి మాంద్యం మాయమౌతుంది. ఈ విషయాన్ని 1930లోనే కీన్స్ అనే ఆర్థికవేత్త చెప్పారు. ఉపాధి పెంచడం కోసం అవసరమైతే గోతులు తవ్వించి వెంటనే వాటిని పూడ్పించండి అని కూడా చెప్పాడు. ఇప్పుడు కూడా ఖర్చుపెట్టి ప్రజలకు ఉపాధిని, వేతనాలను కల్పించాలి. మాంద్యం ఉన్న పరిస్థితుల్లో ప్రయివేటు రంగానికి అమ్మకాలు తగ్గిపోతాయి. వారు పెట్టుబడి పెట్టి ఉపాధిని కల్పించలేరు. కాబట్టి ప్రభుత్వమే పెట్టుబడి పెట్టి ఉపాధిని సృష్టించాలి. తద్వారా మాత్రమే మాంద్యం పరిస్థితులను ఎదుర్కొనగలం.



భారతదేశంలో మాంద్యానికి స్థూలంగా రెండు కారణాలు. మొదటిది ఈ దేశంలో పెట్టుబడికి ఇచ్చిన గౌరవం శ్రామికునికి ఇవ్వరు. శ్రామికుని గౌరవించకుండా కేవలం పెట్టుబడికే ప్రాధాన్యత ఇస్తూ పోవడం వల్ల అసమానతలు పెరిగిపోతున్నాయి. అలా కాకుండా శ్రామికునికి విలువ ఇస్తే మంచి ఉపాధి లభిస్తుంది, దీంతో అతని కొనుగోలు శక్తి పెరుగుతుంది, తద్వారా డిమాండ్ పెరుగుతుంది. దీంతో ఉత్పత్తి పెరిగి మొత్తం ఆర్థికవ్యవస్థ బాగుపడుతుంది. పారిశ్రామిక వేత్తలకు, వ్యాపారస్తులకు కూడా లాభాలు వస్తాయి. వీరికి న్యాయబద్ధమైన లాభాలు రావడాన్ని అందరూ అంగీకరిస్తారు. న్యాయబద్ధమైన లాభాలు లేకుండా ఏ ఆర్థిక వ్యవస్థా నడవదు. న్యాయబద్ధమైన లాభాలు రావాలన్నా కోట్లాది మంది ప్రజలకు వేతనాలు, ఆదాయాలు పెరగాలి. అయితే ఇటువంటి పరిస్థితి లేని భారత దేశ వ్యవస్థాగత ఆర్థిక వ్యవస్థ వలనే మాంద్యం ఏర్పడింది. మోడీ ఒక్కడే కాక ఇప్పటి వరకు పాలించిన అందరూ కూడా దీనికి కారణం. రెండోది మోడీ తెచ్చిన పెద్ద నోట్లరద్దు, జిఎస్టీ కారణం. జిఎస్టీ వల్ల పెద్ద పెద్ద కార్పొరేట్లకు ఖర్చులు తగ్గి చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ఖర్చులు పెరిగాయి. దీంతో ఈ పరిశ్రమలకు అమ్మకాలు భారమైనాయి. దీంతో ఉత్పత్తిని తగ్గించుకొని ఉద్యోగులను తగ్గించుకున్నారు. ఈ కారణంగా ఈ రంగంలోని కార్మికులు ఉపాధిని కోల్పోవటంతో కొనుగోలు శక్తిని కూడా కోల్పోయారు. దీంతో మాంద్యం పరిస్థితులు మరింత తీవ్రమయ్యాయి. శ్రమను గౌరవించే అలవాటు లేకపోవడం, పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టితో పాటు విదేశాల నుంచి విచక్షణారహితంగా పెద్ద ఎత్తున దిగుమతి అవుతున్న చౌక వస్తువులు కూడా మాంద్యానికి కారణం. ఈ కారణాల వల్ల మాంద్యం మరింత తీవ్రమౌతోంది. దీన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వ ఖర్చును పెంచి, కోట్లాది మంది ప్రజలకు ఉపాధి, మంచి వేతనాలను అందించి, వారి కొనుగోలు శక్తిని పెంచాలి. కానీ దురదృష్టవశాత్తూ మోడీ సర్కార్ ప్రజల కొనుగోలు శక్తి పెంచేందుకు కాకుండా ఉత్పత్తిని పెంచటం అనేపేరుతో పారిశ్రామికవేత్తలకు పెద్ద ఎత్తున రాయితీలు ఇస్తోంది. ఇది మాంద్యాన్ని మరింత తీవ్రతరం చేస్తుంది. దీంతో ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుంది. ఈ ప్రజలను వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు సమీకరించి పోరాటాల్లో దించగలగాలి. లేకుంటే వీరి అసంతృప్తిని పక్కదారి పట్టించేందుకు పాలకపక్షాలు భావోద్వేగ వాతావరణాన్ని సృష్టించి, ప్రజల మధ్య ఐక్యతను చెడగొడతాయి. ఎన్నికలకు ముందు ఈ ప్రయత్నం చేసే బిజెపి ఎన్నికల్లో లాభపడింది. ఎన్నికల తర్వాత మళ్లీ మాంద్యంపై చర్చ ముందుకు వచ్చింది. ఈ అంశంపై ప్రజల్ని మరింత చైతన్యవంతం చేసి పోరాటాల్లోకి తీసుకెళ్లాలి. ప్రజలకు ఉపాధి, వేతనాలను అందించే విధానాల వైపు ప్రభుత్వాలను మళ్లించాలి. ❋

# సోషలిస్టు వ్యవస్థ: చిన్న ఉత్పత్తిదారులు



రచయిత ప్రముఖ వామపక్ష ఆర్థిక వేత్త

ప్రభాత్ పట్నాయక్

మా తరానికి టాంజానియా అధ్యక్షుడు జూలియస్ నైరేరి దీపధారి. అయన ఆనాటి వలస దేశాలను విముక్తి గావించిన నాయకులలో అగ్రగామి. ఆ కార్యాక్రమానికి అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఆ నాయకులందరూ వారివారి దేశాలను విముక్తి గావించి ఒక కొత్త వరవడికి నాంది పలికారు. ఆ సమూహంలో అతనితో పాటు పనిచేసిన వారు జవహర్లాల్ నెహ్రూ, సుకర్నో, కామే నుమాహ్, పాట్రిస్ లుముంబా, జాన్ కెన్యట్టా.

**చిన్న ఉత్పత్తిదారులను దోపిడి చేసే పెట్టుబడిదారీ విధానం**

పెట్టుబడిదారీ విధానానికి కొన్ని అనివార్యమైన అంతర్గత "సహజ" ధోరణులు ఉంటాయి. సాధారణ పరిస్థితులలో ఇవి వ్యవస్థకి మద్దతుగా నిలుస్తాయి, దఅఢపరుస్తాయి, వేగాన్ని పెంచుతాయి. అటువంటి అనివార్య ధోరణులతో ఒకటి, తన చుట్టూ అంతకు ముందునుంచీ ఉన్న సాంప్రదాయ చిన్న పరిశ్రమలను ఆక్రమించటం. ఈ ఆక్రమణ "వస్తుగతం" గాను, "నిరంతరం" గాను కూడా జరుగుతుంది. వీటిని పెట్టుబడిదారులు కొన్నిసార్లు ప్రత్యక్ష్యంగా ఆక్రమించుకోగా, కొన్ని సార్లు రాజ్యం అతనికి బదులుగా ఈ కార్యానికి పూనుకుంటుంది.

"వస్తుగతం"గా జరిగే ప్రక్రియలో చిన్న పరిశ్రమదారుల ఉత్పత్తి సాధనాలను పెట్టుబడిదారులు వశపరచుకుంటారు. అంటే వారు వారి ఉత్పత్తి సాధలపై తరతరాలుగా అనుభవిస్తున్న హక్కులను వారి నుండి లాక్కుంటారు. ఈ హక్కులు కొన్ని సార్లు ఉత్తపుణ్యానికే కబ్జా చేస్తే, కొన్నిసార్లు వారికి 'చెల్లించ" వలసిన నామ మాత్రపు ధరలు చెల్లించి తీసుకుంటారు. ఆ ఉత్పత్తి విధానంలో భాగమైన "కార్మికులను" ఈ చెల్లింపుల ప్రక్రియలో సర్వ సాధారణంగా విస్మరిస్తారు. నిజానికి పాత వ్యవస్థలో కార్మికులు కూడా ఉత్పత్తి సాధనలపై ఉత్పత్తిదారులతో సరి సమానమైన హక్కులు కలిగి ఉంటారు.


ఇక "నిరంతరం" సాగే విధానంలో పెట్టుబడిదారుల కబ్జాలో వీరి ఉత్పత్తి సాధనాలతో ప్రమేయం లేకుండానే చిన్న ఉత్పత్తి రంగంలోని ఉత్పత్తిదారుల ఆదాయాలను కుదించివేస్తారు. ఇలా ఆదాయాలను కుదించేందుకు అనేక మార్గాలు ఉంటాయి. ప్రత్యక్షంగా దోపిడీ చేయడం, "అరకొరగా" మారకాలకు బదుళ్ళు ఇచ్చి తీసుకోవడం, పెట్టుబడిదారీ విధానంలో రాజ్యం పన్నులువేసి వశపరచుకోవడం, సూక్షంగా చెప్పాలంటే, పన్నులను చిన్న ఉత్పత్తి దారులపైవేసి వాటిని పెట్టుబడిదారుల ప్రయోజనాలకు రాజ్యం ఉపయోగిస్తుంది. పెట్టుబడిదారులు చిన్న ఉత్పత్తిదారుల వాణిజ్య మార్కెట్లను కొల్లగొడుతుంటారు. అందువలన వాణిజ్యం సమతుల్యంగా ఉన్నా చిన్న పెట్టుబడిదారులకు ఉత్పత్తి చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఫలితంగా ఆదాయాలు తగ్గిపోతాయి.

వలస రాజ్యాలలో "పరిశ్రమలు మూసి వేయ" బడ్డాయి. దేశాల మధ్య వాణిజ్యం సమతూకంలో ఉన్నప్పటికీ ఈ విధంగా ఏర్పడిన నిరుద్యోగానికి కారణాలు నయా ఉదారవాద సిద్ధాంత వేత్తలుగాని, కీనీషియన్ సిద్ధాంతవేత్తలుగాని చెప్పలేక పోతున్నారు. దీనికి అసలు కారణం చిన్న ఉత్పత్తుదారుల అధీనంలో ఉండే భూమి పరిమితమైనది. అది పూర్తిగా వినియోగించబడుతూ ఉంటుంది. ఇదివరకు చిన్న పెట్టుబడిదారులు ఉపయోగించుకునే ప్రాథమిక వ్యవసాయ ఉత్పత్తులను పెట్టుబడిదారులు దిగుమతి చేసుకున్నప్పటికీ, వారు ఇదివరకు తయారు చేసే ఉత్పత్తులు బడా పారిశ్రామిక వేత్తలు ఉత్పత్తిచేయడంతో , చిన్న పరిశ్రమలు చేసే ఉత్పత్తులు తగ్గిపోతాయి. భూమి పరిమితంగానే ఉండడం వలన ఇది వరకటితో పోల్చితే ఉత్పత్తి కార్యకలాపాలు తగ్గిపోతాయి. ఆ తగ్గిన ఉత్పత్తి కార్యకలాపాలకు బదులుగా వేరే ఏ ఇతర రంగంలో కూడా ఉత్పత్తి పెరగదు. (భూమి పరిమితంగా ఉండడం వలన) బయటికిపోయి ఉత్పత్తి చేసుకునే అవకాశాలు చిన్న ఉత్పత్తిదారులకు ఉండవు. పైగా వారి భూమిపై పండిన మౌలిక వ్యవసాయ ఉత్పత్తులు, తిండి గింజలు పెట్టుబడిదారులకు అమ్ముకుని ఉంటారు. అందువలనే ఇక్కడ నిరుద్యోగం ఏర్పడుతుంది. పెట్టుబడిదారులు చిన్న ఉత్పత్తిదారులపై వేరే ఏ విధమైన ఒత్తిడులు పెట్టకపోయినా వారు మార్కెట్లు కోల్పోడానికి, ఫలితంగా వారి ఆదాయాలు కోల్పోడానికి, నిరుద్యోగులుగా మారడానికి ఈ ఒక్క కారణం చాలు. దీని వలన స్థిరంగా ఉండే భూమిపై ఆధారపడిన వారి సంఖ్య పెరుగుతుంది. చాలాకాలం క్రితమే రోజా లగ్జంబర్గ్ చెప్పినట్టు, ఇది పెట్టుబడిదారీ విధానం యొక్క క్రూరమైన అక్రమణ. యూరప్ లోపల కూడా ఇదే విధానం అమలయింది. పెట్టుబడిదారీ విధాన అవిర్భావ సమయంలో, 19వ శతాబ్దం రెండవ అర్థభాగం నుండి మొదటి ప్రపంచయుద్ధం వరకు కెనడా, అమెరికా, న్యూజిలాండ్, దక్షిణ ఆఫ్రికా తదితర దేశాలకు 5 కోట్లమంది వరకు యూరప్ దేశాల నుండి తరలి వెళ్ళటంతో యూరవ్‌లో నిరుద్యోగం అదుపులో ఉంది. పెట్టుబడిదారులు ఆక్రమిత ప్రాంతాలలో భూమిని బలవంతంగా లాక్కోవడం, అక్కడ రైతులుగా మారడం జరిగింది. అయితే అటువంటి అవకాశాలు మూడో ప్రపంచ దేశాలలోని ప్రజలకు అందుబాటులో ఎన్నడూ లేవని వేరేగా చెప్పనక్కరలేదనుకుంటాను.

**పెట్టుబడిదారుల అక్రమణలను గురించి అపోహలు**

> **" వృత్తులు కోల్పోయిన చిన్న ఉత్పత్తిదారులు అందరిని పెట్టుబడిదారీ విధానం తనలో ఇముడ్చు కుంటుందని అనుకోవడం పొరపాటు. ఎందుకంటే పెట్టుబడిదారీ విధానం అన్ని ఉద్యోగాలను సృష్టించ లేదు. యూరప్‌లో కూడా ఇలా జరగలేదు. "**

పెట్టుబడిదారి వ్యవస్థ జరిపిన ఈ ఆక్రమణలను గురించి నాలుగు రకాల అపోహలు ఉన్నాయి. మొదటిది, పెట్టుబడిదారీ విధానం వలన పనులు కోల్పోయిన వఅత్తిదారులను పెట్టుబడిదారి విధానం తనలో ఇముడ్చుకుంది. అందువలన ఏ కొద్దిమందో తప్ప మిగిలిన వారందరికీ ఉద్యోగాలు దొరికాయి. మహా అయితే వారి పనిలో మార్పులు జరిగాయి. అందువలన నిరుద్యోగ సైన్యం చాల చిన్నదిగా ఉండింది. కాబట్టి పెట్టుబడిదారీ వ్యవస్థ చిన్న వఅత్తిదారుల ఉత్పత్తులను ఆక్రమించుకోవడం అన్నది కేవలం పెట్టుబడిదారీ వ్యవస్థ విస్తఅతం కావడంలో భాగమే కానీ సుస్థిరంగా జరిగిన ద్వంద విభజన కాదు. అక్కడక్కడా తన రచనలలో ద్వైదీభావం ఉందని ఒప్పుకున్నా, ఒక అణగారిన, భ్రష్టులైన, మూలుగులు పీల్చబడిన చిన్న ఉత్పత్తిదారులను, ఎదుగుతున్న పెట్టుబడిదారీ విధానం తయారు చేస్తుందని రోజా లగ్జంబర్గ్ కూడా ఊహించలేదు.



జూలియస్ నైరేరీ

వృత్తులు కోల్పోయిన చిన్న ఉత్పత్తిదారులు అందరిని పెట్టుబడిదారీ విధానం తనలో ఇముడ్చు కుంటుందని అనుకోవడం పొరపాటు. ఎందుకంటే పెట్టుబడిదారీ విధానం అన్ని ఉద్యోగాలను సృష్టించలేదు. యూరప్‌లో కూడా ఇలా జరగలేదు. అయితే వలసలను ఆక్రమించడం వలన అక్కడ సమస్య మూడో ప్రపంచదేశాలలో లాగా తీవ్రతరం కాలేదు. అంటే వలసలకు అవకాశం లేకపోయినచోటల్లా పెట్టుబడిదారీ విధానం వలన నిరుద్యోగులైన వఅత్తిదారులు చిన్న ఉత్పత్తి రంగంలోనే ఉండిపోయి, పేదరికానికి అవమానాలకు చిరునామాలుగా మిగిలిపోతుంటారు. ఇలా జరగడం సాధ్యమన్న విషయాన్ని ఎం. దానియేల్సోన్ అనే నరోడ్నిక్ అర్థశాస్త్రవేత్తకి ఏంగిల్స్ 1895 సెప్టెంబర్ 22న వ్రాసిన ఉత్తరంలో తెలియ చేస్తారు. మార్క్స్ కాలం నుంచి ఇప్పటికి జరిగిన సంఘటనలు ఈ విషయాన్ని ధ్రువపరుస్తున్నాయి కూడా. నిజానికి భారతదేశ ఆర్థిక వ్యవస్థ బాగా పెరగడం, ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలను ఆకట్టుకుంది. భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఎదుగుదలకి కారణం నయా ఉదారవాద ప్రపంచీకరణ విధానాల వలన కలిగిన ప్రయోజనాలని, భారతదేశంలో దీనిని రుజువు చేశామని మూడో ప్రపంచ దేశాలకు చూపుతున్నారు. నిజానికి భారతదేశంలో శ్రామిక జనాభా పెరుగుతున్నదానికి, ఉద్యోగాల పెరుగుదలకు ఏమాత్రం పొంతన లేకుండా ఉంది. ఉదాహరణకి 2004-05, 2009-10 మధ్య కాలంలో జాతీయోత్పత్తి పెరుగుదల దాదాపు ఏడాదికి 8 శాతంగా ఉంది. ఈ కాలంలో జనాభా పెరుగుదల 1.5 శాతం మాత్రమే ఉంది. కానీ " సామాన్య స్థితి " (సంవత్సరకాలంలో పని దొరికే రోజులు-స్థిరమైన ఉద్యోగం) ఉద్యోగం ఉన్నట్టు చెప్పుకోగలిగిన వారి పెరుగుదల మాత్రం 0.8 శాతంగా మాత్రమే ఉంది. అంటే ఇది జనాభా పెరుగుదల శాతం కన్నా చాలా తక్కువ.

రెండవ దురభిప్రాయం, మార్క్స్ తన "పెట్టుబడిదారి వ్యవస్థ యొక్క ఆదిమ సంచయనం" లో చర్చించినట్టు, పెట్టుబడిని ఆకర్షించేందుకు, చిన్న పెట్టుబడిదారులపై పెట్టుబడి దురాక్రమణ జరిపే క్రమం, ఆదిమ సంచయనం, పెట్టుబడిదారీ విధానం ప్రారంభ దశలోనే ఉంటుందని అనుకోవడం. మార్క్స్ రెండో విభాగంలో సూచించినట్టు, ఒకసారి పెట్టుబడిదారీ విధానం ప్రారంభమైన తరువాత, తనకుతానే పునరుత్పత్తి చేసుకోగలగడం వలన ప్రారంభదశలో లాగా పెట్టుబడిదారీ వ్యవస్థకి ఆదిమ సంచయనానికి పాల్పడ వలసిన అవసరం రాదన్న అపోహ ఉన్నది.

19వ శతాబ్దం అంతటిలో ప్రపంచంలో పెట్టుబడిదారీ విధాన క్రమాన్ని కొనసాగించడానికి వలస విధానం నిర్వహించిన పాత్రని ఈ అభిప్రాయం పూర్తిగా విస్మరించింది. ఈ విషయంపై ఎస్ బి సాల్ వంటి ఆర్థిక చరిత్రకారులు విలువైన పరిశోధనలు చేశారు. మార్క్స్ కూడా పెద్ద ఎత్తున అదనపు విలువ భారతదేశం నుంచి బ్రిటన్‌కు ప్రవహించిందన్న వాస్తవాన్ని తన చివరి రోజులలో దానియేల్సన్‌కి 1881 ఫిబ్రవరి 19న వ్రాసిన ఉత్తరంలో ప్రస్తావించారు. అందులో "భారత దేశంలో బ్రిటిష్ వారు సంవత్సరం పొడుగునా కొల్లగొడుతున్నది కాక భారతదేశానికి సరిసమానంగా ఏదీ ఇవ్వకుండా, అక్కడి నుండి ప్రతి ఏడూ తరలిస్తున్నది... కేవలం భారతదేశం ఇంగ్లాండ్ కి పంపే విలువైన సరుకుల గురించే మాట్లాడుకున్నా, -60 మిలియన్ల వ్యవసాయ, పారిశ్రామిక కార్మికుల సంవత్సర ఆదాయానికి సరిసమానంగా ఉంటుంది! ఇది కక్షతో మాంసం ముక్కలుగా చేసుకొని తినడమే!" అని రాశారు.

కాబట్టి పెట్టుబడిదారీ గతిక్రమంలో దౌర్జన్యానికి ఏ మాత్రం పాత్ర లేదని అనుకోవడంలో అర్థం లేదు. అంటే చిన్న పరిశ్రమలను కబళించడం పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రారంభంలోనే కాదు. దాని జీవితకాలం కొనసాగుతునే ఉంటుంది. చిన్న ఉత్పత్తిదారుల జీవితాలను ఆక్రమించి, వారిని దుర్భర పరిస్థితులలోకి నెట్టి, ఉత్పత్తి రంగంలో వారిని ఇముడ్చుకోకుండా, వారి సాంప్రదాయ అలవాట్లకు వారిని దూరం చేసి, దరిద్రులుగా మార్చడం పెట్టుబడిదారి వ్యవస్థ తన జీవితకాలం కొనసాగిస్తుంది. ఈ వాస్తవాన్ని నయా సాంప్రదాయ అర్థశాస్త్ర సిద్ధాంతాలు గుర్తించలేదు. వారి సిద్ధాంతంపై ఆధారపడిన ఐ ఎం ఎఫ్, వరల్డ్ బ్యాంకు లాంటి సంస్థలు

" సంపద దిగువకు ప్రవహించడం" (ట్రికిల్ డౌన్) సిద్ధాంతాన్ని సమర్థిస్తున్నాయి.

మూడో అపోహ కూడా ఈ వాస్తవాన్ని గుర్తించడంలో వైఫల్యాన్ని చూపడమే. కాని అది పూర్తిగా వేరే దఅష్టికోణం నుంచి చూపడం జరుగుతుంది. రైతులు, ముఖ్యంగా మధ్య తరగతి రైతులు పెట్టుబడిదారీ వ్యవస్థ దాడిని ఎదుర్కోగలుగుతారని సాధారణంగా భావిస్తుంటారు. ఎక్కువమంది చిన్న ఉత్పత్తిదారులు వ్యవసాయ రంగంలోనే నిలిచి ఉండడాన్ని పెట్టుబడి దాడిని ఎదుర్కొని నిలబడ గలగడంగా చూపుతుంటారు. నిజానికి చిన్న ఉత్పత్తిదారులు వ్యవసాయరంగంలో కొనసాగడానికి కారణం పెట్టుబడిని ఎదుర్కోగలగడం కాదు. వారు దుర్భర జీవితాలే గడుపుతున్నా ''వేరేదారిలేక'', బయట పెట్టుబడిదారీ వ్యవస్థలో ఎటువంటి ఉద్యోగాలు దొరకక వ్యవసాయంలోనే "బంధించబడి" ఉండిపోయారు. పెట్టుబడిదారీ వ్యవసాయంలో కన్నా చిన్న కమతాలలో ఉత్పత్తి ఎక్కువగా వుండడాన్ని కూడా పెట్టుబడిదారి విధానాన్ని ఎదుర్కోడంగా చూపుతుంటారు. కానీ నిజానికి వ్యవసాయోత్పత్తి చేయడంలోనే ఎక్కువమంది రైతులు ఉండిపోవడమే ఈ రంగంలో అధికోత్పత్తి జరగడానికి కారణం. తలసరి ఉత్పత్తిని గనక లెక్క కడితే ఈ విషయం స్పష్టమవుతుంది. తలసరి ఉత్పాదకత చాల తక్కువగా ఉంటుంది. "సమర్థుడైన" చిన్న రైతు పెట్టుబడిదారి వ్యవస్థలో మనగలగడం కేవలం మిథ్యే.

నాలుగో అపోహ, ప్రపంచ యుద్ధం తరువాతి పెట్టుబడిదారీ విధానంలో విభిన్న దశల మధ్య హద్దులు చెరిగిపోయాయని భావించడం. ఇంకా మన పరిస్థితులకు అన్వయించి చెప్పాలంటే, వలస విధానం అంతరించిన తొలినాళ్లలో, పెట్టుబడిదారీ విధానంలో, ప్రైవేటు పెట్టుబడిని తమ అభివఅద్ధి కొరకు మూడోప్రపంచదేశాలు ఆహ్వానించినప్పటికీ దాని ''సద్యోజనిత'' (స్వేచ్ఛాయుతమైన) ధోరణులను కట్టడి చేసేవారు. కానీ నయా ఉదారవాదం ప్రపంచవ్యాప్తంగా ఆధిపత్యం సంపాదించిన తరువాత, బ్రెటన్ వుడ్స్ సంస్థల ఒత్తిడిలకు లంగి వివిధ దశలలో మూడో ప్రపంచ దేశాలలో వాటిని అమలు చేయడం ప్రారంభించిన తరువాత, పెట్టుబడిదారీ విధానపు "సద్యోజనిత" రూప క్రూరత్వం బయటపడడం మొదలయింది. వలస విధానం అంతమైన తొలినాళ్లలో ప్రభుత్వాలు అనుసరించిన "నియంత్రణల"లో ముఖ్యమైనది

> " రైతాంగం యొక్క వ్యవసాయం విషయానికి వస్తే అంతర్జాతీయ మార్కెట్ ధరల ఒడిదుడుకులకు ఈ రంగాన్ని పూర్తిగా వదిలివేయడం జరిగింది. ఫలితంగా రైతుల అప్పులు పెరిగాయి. పేదరికం వారిని ఆవహించింది. వారికిచ్చే సబ్సిడీలన్నీ తొలగించడం వలన వారి లాభాలు తగ్గిపోయాయి. వారు విత్తనాలకు, ఎరువులకు, పురుగు మందులకు అంతర్జాతీయ వ్యవసాయ వాణిజ్య సంస్థల దయాదాక్షిణ్యాలపై ఆధారపడవలసి వస్తున్నది. "




"పెట్టుబడిదారీ వ్యవస్థ నిన్ను చంపేస్తోంది" యూరప్‌లోని నగరాల్లో ఇప్పుడు తరచూ ఈ నినాదం కనిపిస్తోంది.

చిన్న పెట్టుబడిదారులను ప్రోత్సహించడం, వారిని విదేశీ స్వదేశీ పెట్టుబడిదారులు కబళించకుండా రక్షణలు కల్పించడం. ఇవి వలస వ్యతిరేక విధానానికి అనుగుణంగా ఉండేవి. మూడో ప్రపంచదేశాలలో వలసవాదం అంతమైన తరువాత ఏర్పడ్డ ప్రభుత్వాలలో ఎక్కువశాతం ప్రాచీన యూరప్ తరహా రాజ్యాలు కాదు. కానీ నయాఉదారవాద విధానాలు చిన్న పెట్టుబడిదారులకు అందుబాటులోఉండే రక్షణను పూర్తిగా తొలగించి వేశాయి.

వీరి ఆధిపత్యంలో "నయా ఉదారవాద రాజ్యాలు" ఏర్పడ్డాయి. అవి ప్రపంచ పెట్టుబడి ప్రయోజనాలను మాత్రమే కాపాడుతున్నాయి. వాటితో దేశీయ బూర్జువా వర్గం మమేకమవుతున్నది.

ఇక రైతాంగం యొక్క వ్యవసాయం విషయానికి వస్తే అంతర్జాతీయ మార్కెట్ ధరల ఒడిదుడుకులకు ఈ రంగాన్ని పూర్తిగా వదిలివేయడం జరిగింది. ఫలితంగా రైతుల అప్పులు పెరిగాయి. పేదరికం వారిని ఆవహించింది. వారికిచ్చే సబ్సిడీలన్నీ తొలగించడం వలన వారి లాభాలు తగ్గిపోయాయి. వారు విత్తనాలకు, ఎరువులకు, పురుగు మందులకు అంతర్జాతీయ వ్యవసాయ వాణిజ్య సంస్థల దయాదాక్షిణ్యాలపై ఆధారపడవలసి వస్తున్నది. వీటికి తోడు విద్య వైద్యం లాంటి అత్యవసర సేవలు ప్రైవేటు పరం చేయడం వలన వాటి ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఫలితంగా చిన్న ఉత్పత్తిదారులు అప్పుల ఊబిలో కూరుకు పోయారు. అనాథలుగా మారారు. గత పదిహేనేళ్ల కాలంలో దాదాపు మూడు లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారంటే పరిస్థితి ఎంత విషమంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. 1991–2011 మధ్య జరిగిన సెన్సస్ లెక్కలు 1.5 కోట్లమంది రైతులు వ్యవసాయాన్ని వదిలి వేసినట్టు స్పష్టం చేస్తున్నాయి. ఫలితంగా నిరుద్యోగ సైన్యం మరింత పెరిగింది. ఇది క్యాజువల్ ఉద్యోగులు, పార్ట్ టైం ఉద్యోగులు, అప్పుడప్పుడు ఉద్యోగాలు చేసేవారు గణనీయంగా పెరగడంలో స్పష్టంగా కనిపిస్తున్నది. ఇంత పెద్ద ఎత్తున నిరుద్యోగులు పెరగడం వలన

> **"సామ్రాజ్యవాద కేంద్రాల పెట్టుబడికి మూడో ప్రపంచదేశాల పెట్టుబడికి కొంత వ్యత్యాసం ఉన్నమాట నిజం. మూడో ప్రపంచ దేశాలలోని కార్మికులకు తక్కువ వేతనాలు ఉండడాన్ని నయాఉదారవాదం ప్రపంచ మార్కెట్‌లో తనకు అనువుగా ఉపయోగించుకుంటున్నది. దీని ఫలితంగా మూడో ప్రపంచ దేశాలలోనే కొన్ని అభివృద్ధి చెందిన ప్రాంతాలు తయారయ్యాయి."**

పెట్టుబడిదారీ ఉత్పత్తి రంగంలో వేతనాలు తక్కువ స్థాయిలో ఉంటాయి. కార్మికసంఘాలు ఉన్న చిన్న చిన్న విభాగాలలో కూడా ఇదే పరిస్థితి. ఈ విషయాన్ని తరువాత చర్చిస్తాను.

**మూడోప్రపంచదేశాలలో పేదరికం, కార్మిక కర్షక ఐక్యత**

పైన చెప్పుకున్నదాని పర్యవసానాలు రెండు రకాలుగా ఉంటాయి. మొదటిది, నయాఉదారవాద విధానంలో ద్రవ్య పెట్టుబడి "సద్యోజనితంగా" ఉండడం వలన మూడో ప్రపంచదేశాలలోని పేదరికాన్ని తొలగించక పోగా నిరుద్యోగానికి, ఆర్థికంగా రక్షణలు లేకపోడానికికారణ మవుతుంది. వలసవాద ఆర్థికవ్యవస్థని సామ్రాజ్యవాద కేంద్రాల పెట్టుబడిదారీ విధానం ఆక్రమించడం వలన ఉన్న పేదరికం కొనసాగుతూనే ఉంది. మరింత తీవ్రమౌతున్నది కూడా.

ఈ వాక్యానికి మరింత వివరణ అవసరం. సామ్రాజ్యవాద కేంద్రాల పెట్టుబడికి మూడో ప్రపంచదేశాల పెట్టుబడికి కొంత వ్యత్యాసం ఉన్నమాట నిజం. మూడో ప్రపంచదేశాలలోని కార్మికులకు తక్కువ వేతనాలు ఉండడాన్ని నయాఉదారవాదం ప్రపంచ మార్కెట్‌లో తనకు అనువుగా ఉపయోగించుకుంటున్నది. దీని ఫలితంగా మూడో ప్రపంచదేశాలలోనే కొన్ని అభివఅద్ధి చెందిన ప్రాంతాలు తయారయ్యాయి. ఈ అభివఅద్ధి చెందినవి చిన్న దేశాలైతే అక్కడున్న నిరుద్యోగం తొలగి, స్థానిక పేదరికం తగ్గుతుంది. అయితే ఈ చిన్నపాటి దేశాలలోని "విజయాలను" నయా ఉదారవాద విధానాల సాధారణ విజయాలుగా చూపబడ్డాయి. అలాగే ఈ అభివఅద్ధి నుండి సామాన్యజనం దూరంగా ఉండడమే కాదు, దానికింద నలిగిపోతున్నారు. మంచి ఆదాయాలు పొందే, ప్రముఖంగా కనిపించే మధ్యతరగతి మూడో ప్రపంచదేశాలలో ముందుకొచ్చింది. ఇది ఆహ్వానించదగ్గ పరిణామం కాదు. ప్రభుత్వ విధానాల వలన ఒక తరగతి ప్రజలు ఆరోగ్యానికి, విద్యకు ఉత్తమమైన సేవలు అందుబాటులోకి వస్తున్నందు వలన ప్రజలందరి భౌతిక పరిస్థితులలో మార్పు వచ్చినట్టుగా చూపడం జరుగుతున్నది. అందువలనే నయాఉదారవాద విధానాల అమలు తరువాత మూడో ప్రపంచదేశాలలో పేదరికం పెరిగిందన్న వాస్తవం పై పైన చూస్తే కనిపించదు.

కానీ పేదరికం పెరిగిందా లేదా అని పరీక్షించేందుకు ఒక దేశం లోనే కాక మూడో ప్రపంచ దేశాలన్నిటిలోని కొన్ని ప్రధాన వస్తువుల వినిమయాన్ని పరిగణనలోనికి తీసుకుని పరిశీలిస్తే పరిస్థితి అర్థం అవుతుంది. 1980లలో తలసరి తఅణ ధాన్యాల ఉత్పత్తి 355 కిలోలు ఉండేది. (1979-81 మధ్యమూడేళ్ల కాలంలో జరిగిన ఉత్పత్తి సరాసరిని 1980 నాటి జనాభాతో విభజించడం జరిగింది.) 2000 సంవత్సరానికి కూడా ఇదే రకంగా గణాంకాలు సేకరించడం జరిగింది. అప్పుడు సరాసరి 343 కిలోలకు తగ్గింది. ఇదే గణాంకాల ప్రకారం చూస్తే 2016కి 344.9 కిలోలుగా ఉంది. ఈ కాలంలో ఎథనాల్ తయారీకి చెప్పుకోదగ్గ స్థాయిలో తఅణ ధాన్యాలు తరలించబడుతున్నందు వలన ప్రజల తఅణ ధాన్యాల వినిమయం తగ్గిందని అంచనాకు రావలసి ఉంటుంది.

ఇక్కడ మనం ప్రత్యక్ష, పరోక్ష వినిమయాన్ని పరిగణనలోనికి తీసుకుంటున్నాము. పరోక్ష వినిమయం అంటే తయారైన ఆహారం, జంతు ఉత్పత్తులు (ఇందులో ఆహారధాన్యాలు పశువుల ఆహారంగా ఇవ్వడాన్ని కలుపబడింది). అందువలన తఅణ ధాన్యాల వినిమయం ఒక స్థాయి వరకు పెరిగినట్టు కనిపిస్తుంది. ఒకవేళ గనక మూడో ప్రపంచదేశాలలో అంతటా పేదరికం తగ్గినట్టయితే తఅణ ధాన్యాల వినిమయం బాగా పెరిగి ఉండాల్సింది. కానీ మూడో ప్రపంచదేశాలలో తఅణధాన్యాల వినిమయం తగ్గిందంటేనే ప్రజలలో పేదరికం పెరిగిందని నిర్ధారించవచ్చు. అంటే పెట్టుబడిదారీ విధానం పేదరికాన్ని సహజంగానే నివారిస్తుందన్నది వాస్తవం కాదు.

పైన చేసిన రెండో వాదన పర్యవసానం, నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానం స్వచ్ఛందంగానే కార్మికులు, కర్షకులు, చిన్న ఉత్పత్తిదారులు, వ్యవసాయ కార్మికులు, చిన్న ఉత్పత్తిదారులు వినియోగించుకునే ఇతర శ్రామికులను ఒకచోటికి చేరే అవకాశం కల్పిస్తుంది. ఎందుకంటే చిన్న ఉత్పత్తిదారులను పీల్చి పిప్పిచేసినందువలన నిరుద్యోగ సైన్యం పెరుగుతుంది. ఈ పెరుగుదల కార్మికుల వేతనాలపై దుష్ప్రభావం చూపుతుంది. అంటే నిజవేతనాలేకాదు. అసలు వేతనాలు కూడా దిగజారతాయి. సంఘాలు ఏర్పరచుకున్న పరిశ్రమలపైనా దీని ప్రభావం పడుతుంది. అంటే నయా ఉదారవాద విధానాలను వ్యతిరేకించే కార్మిక, కర్షకుల ఐక్యతకు ఇక భూమిక ఏర్పరుస్తుంది. అంటే పెట్టుబడిదారీ వ్యవస్థ తన కడపటి దశలో కార్మికవర్గం స్వచ్ఛందంగా కలిసే స్థితిని కల్పిస్తుంది.

లెనిన్ సిద్ధాంతీకరించిన కార్మిక, కర్షక ఐక్యతను ఇది మరింత ముందుకు తీసుకెళ్లే అంశం. లెనిన్ (ప్రజాతంత్ర విప్లవంలో సోషల్ డెమొక్రసీ యొక్క రెండు ఎత్తుగడలు) వాదనని ఒకసారి పునశ్చరణ చేసుకుందాం : పెట్టుబడిదారీ విధానంలోకి ఆలస్యంగా అడుగుపెట్టిన దేశాల (ఆనాడు రష్యా), బూర్జువా వర్గం, ఫ్యూడల్ ఎస్టేట్ల అధీనంలో ఉన్న భూమిని పంపకం చేసి ఫ్యూడల్ విధానానికి వ్యతిరేకంగా ప్రజాతంత్ర విప్లవాన్ని జయప్రదం చేయడానికన్నా, భూస్వాములతో కుమ్మక్కవటం చేస్తున్నది. ఎందుకంటే ఇప్పుడు ఫ్యూడల్ ఆస్తులను ఆక్రమించడానికి ప్రయత్నిస్తే ఆ తరువాతి కాలంలో తన ఆస్తులు ఆక్రమణలకు గురవుతాయని అది భయపడుతున్నది. (ఇప్పటికే బూర్జువా ఆస్తులు ఒక సారి ఆక్రమణ జరిగిన చారిత్రిక నేపథ్యం ఉంది.) అందువలన కేవలం కార్మికవర్గం మాత్రమే రైతాంగాన్ని ఇతర శ్రమజీవులను కలుపుకుని సోషలిస్టు విప్లవానికి నాయకత్వం వహించగలదు. దాని మిత్రుల కూటమిలో భాగమైన రైతాంగంలో విప్లవ క్రమంలో అనేక మార్పులు జరగవచ్చు.

లెనిన్ ఊహించిన కార్మిక కర్షక సంఘటన, ప్రజాతంత్ర విప్లవాన్ని జయప్రదం చేస్తుందన్న ఆలోచన "జనతా ప్రజాతంత్ర విప్లవం", "నయా ప్రజాతంత్ర విప్లవం'' లాంటి భావ వ్యక్తీకరణలలో కనిపిస్తుంది. (దీనిని ఫ్రాన్స్‌లో ప్రాచీన బూర్జువాల నాయకత్వంలో జరిగిన ప్రజాతంత్ర విప్లవానికి మధ్య తేడా ఉంది.)

ఈ భావన నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానంలో తన ప్రాముఖ్యతను కోల్పోదు. పైగా కార్మిక, కర్షక ఐక్యతకు మరింత పునాదిగా ఉంటుంది. బూర్జువాజి ప్రజాతంత్ర విప్లవం నుండి కేవలం పారిపోవడమే కాదు. నయా ఉదారవాద పెట్టుబడిదారి విధానం తనలోని ఒక భాగమైన చిన్న పెట్టుబడిదారులను కూడా పీల్చి పిప్పి చేస్తుంది. పెట్టుబడిదారీ విధానాల అమలువలన పెద్ద రైతులు తమ ప్రయోజనాలను వ్యవసాయంలోనే కాక ఇతరత్రా కూడా విస్తరిస్తారు. ఇటువంటివి ఇందుకు మినహాయింపు కావచ్చు గాని సాధారణ రైతాంగం వారి దోపిడీకి బలికావలసిందే. అయితే ఈ అంశాలే సోషలిజం రావడానికి అనుకూల పరిస్థితులు కల్పిస్తాయి.

చిన్న పెట్టుబడిదారుల మద్దతు కోల్పోవడం పెట్టుబడిదారీ వ్యవస్థకు రాజకీయంగా చాలా నష్టం కలిగిస్తుంది. కార్మికవర్గ నాయకత్వంలోని సోషలిస్టు సవాలుకు వ్యతిరేకంగా తన స్థానాన్ని సుస్థిరపరచుకోడానికి, తమ ఆస్తులపై జరిగిన దాడి లాంటిదే చిన్న పెట్టుబడిదారుల ఆస్తుల పైనా జరుగుతుందని పెట్టుబడిదారీ వర్గం రైతాంగాన్ని బెదిరిస్తుంది. పారిస్ కమ్యూన్ జరిగినప్పుడు అడాల్ఫ్ థేర్స్ కమ్యూన్‌ని పడగొట్టడానికి ఫ్రెంచ్ రైతాంగ మద్దతు కూడా ఇలాగే పొందాడు. 1789లో ఫ్రాన్స్‌లో బూర్జువా విప్లవం వలన ఫ్యూడల్ ఎస్టేట్‌లు విభజింపబడి రైతాంగం కొంత లాభపడింది. అదే సమయంలో పెట్టుబడిదారీ విధానం ఎదగడం వలన, ఆనాడున్న వలసలు వెల్లగలిగే విధానం వలన కూడా ఫ్రెంచ్ రైతాంగం ప్రయోజనం పొందింది. అందువలన ఆనాడు కార్మిక, కర్షక సంఘటనకు కొంతవరకు పరిమితులు ఉన్నాయి. అవి బూర్జువాజీకి బాగా ఉపయోగ పడ్డాయి.

కానీ బోల్షివిక్ విప్లవ కాలానికి పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అప్పటికి బూర్జువాజి భూస్వామ్య ఆస్తులపై దాడి చేసే సమర్థతను కోల్పోయింది. అందువలన భూమిని, భూస్వాముల నుండి స్వేచ్ఛను కోరుకుంటున్న రైతాంగం కోరికను బూర్జువాజి తీర్చలేకపోయింది. నిజానికి రష్యాలో జరిగిన ఫిబ్రవరి విప్లవంలో కూడా బూర్జువాజి ఈ పరిమితులను అధిగమించలేక పోయింది. అందువలన రైతాంగాన్ని సంతృప్తి పరచలేకపోయింది. అక్టోబర్‌లో విప్లవం రాగానే రైతులు భూములను తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. ఫ్యూడల్ ఎస్టేట్‌లను ఆక్రమించారు. వారి ఈ ప్రయత్నంలో బోల్షివిక్‌లు

> “నయా ఉదారవాద పెట్టుబడిదారి విధానం తనలోని ఒక భాగమైన చిన్న పెట్టుబడిదారులను కూడా పీల్చి పిప్పి చేస్తుంది. పెట్టుబడిదారీ విధానాల అమలువలన పెద్ద రైతులు తమ ప్రయోజనాలను వ్యవసాయంలోనే కాక ఇతరత్రా కూడా విస్తరిస్తారు. ఇటువంటివి ఇందుకు మినహాయింపు కావచ్చు గాని సాధారణ రైతాంగం వారి దోపిడీకి బలికావలసిందే. అయితే ఈ అంశాలే సోషలిజం రావడానికి అనుకూల పరిస్థితులు కల్పిస్తాయి.”



భారత దేశంలో అత్యధిక మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నది చిన్న, మధ్యతరగతి పరిశ్రమలే

వారికి అండగా నిలబడ్డారు. వారు భూమిని జాతీయం చేయాలన్న తమ విధానాన్ని వదులుకుని భూమిని రైతులు స్వాధీనం చేసుకోడానికి అవకాశం కల్పించారు. బోల్షివిక్‌లు తమ కార్యక్రమంలో చేసిన ఈ మార్పు వలన సోషలిస్టు రివల్యూషనరీలు (ఆనాటి రష్యా లోని ఒక రాజకీయ పార్టీ) బోల్షివిక్‌లు తమ కార్యక్రమాన్ని “దొంగిలించారని” అభియోగం మోపారు. నిజానికి వామపక్ష సోషలిస్టు విప్లవకారులు, రైతాంగం తమ పునాదిగా గల సోషలిస్టు రివల్యూషనరీ పార్టీ బోల్షివిక్‌లతో కలిసి విప్లవ ప్రభుత్వంలో భాగస్వామి కూడా ఉంది.

క్లుప్తంగా చెప్పాలంటే ఆలస్యంగా పెట్టుబడిదారీ విధానంలోకి అడుగుపెట్టిన మూడో ప్రపంచ దేశాలలో, ఉదాహరణకి ఆసియా, ఆఫ్రికా, కొన్ని లాటిన్ అమెరికా దేశాలలో విప్లవ భవితవ్యాన్ని నిర్ణయించడంలో రైతాంగం యొక్క మద్దత్తు నిర్ణయాత్మకంగా ఉంటుంది. ఈ దేశాలన్నింటిలోనూ భూపంపకాలు జరగలేదు. నయా ఉదారవాద ప్రపంచీకరణ వారిని పీల్చి పిప్పి చేసింది. ఇదే కార్మిక కర్షక మైత్రికి, ప్రజాతంత్ర విప్లవం ద్వారా సోషలిజాన్ని సాధించడానికి ఒక పెద్ద ముందడుగు. ఇది సాధించే విధానం వివిధ దేశాలలో వేర్వేరుగా ఉండవచ్చు.

### చిన్న ఉత్పత్తిదారులను రక్షించటం అవసరం.

రైతాంగం బేధఖలు పడకుండా రక్షించడం అంటే చిన్న ఉత్పత్తిదారుల ఉనికిని నిరంతరం కాపాడడం అనికాదు. చిన్న ఉత్పత్తిదారులు స్వచ్ఛందంగా తమ కమతాలు కలుపుకుని సహకార సంఘాలుగా ఏర్పడేందుకు ప్రోత్సహించడం. సహకారం లేదా కలిసి పంటలు పండించడం అంటే రైతాంగం దోపిడీకి గురి కాకుండా ఉండడం. భూమిని ఐచ్ఛికంగా కలుపుకోవడం. అందువలన ఇక్కడ పెట్టుబడిదారీ విధానంలో లాగా ఆక్రమణలకు,ఆదిమ సంచయానానికి తావు లేదు.

> **“ సోషలిజం నిలుపుకోడంలో, దాన్ని సాధించడానికి జరిగిన అనేక పోరాటాల్లో కార్మిక కర్షక సంఘటన విజయవంతంగా పనిచేయలేక పోయిందనేది చారిత్రిక వాస్తవం. నిజానికి సోషలిస్టు ప్రయోగం విఫలమవ్వడానికి ఇది ఒక బలమైన కారణం. సోషలిస్టు విప్లవ సాధన మొదటి దశలో కార్మిక కర్షక సంఘటన విజయం సాధించినా, తరువాత ఇంకా ముందుకెళ్ళడంలో విఫలమైంది. చైనాలో లాగా సోవియట్‌లో బలవంతంగా సామూహిక వ్యవసాయాన్ని రుద్దక పోయినా, విప్లవ మూలాలు బలహీన పడేందుకు దోహదం చేశాయి. ”**

అయితే సోషలిజం నిలుపుకోడంలో, సోషలిజం సాధించుకోడానికి జరిగిన అనేక పోరాటాలలో కార్మిక కర్షక సంఘటన విజయవంతంగా పనిచేయలేకపోయిందనేది చారిత్రికవాస్తవం. నిజానికి సోషలిస్టు ప్రయోగం వైఫల్యం చెందడానికి ఇది ఒక బలమైన కారణం. సోషలిస్టు విప్లవ సాధన మొదటి దశలో కార్మిక కర్షక సంఘటన విజయం సాధించినా, ఆ తరువాత సోషలిస్టు విప్లవ సాధనలో ఇంకా ముందుకెళ్ళడంలో విఫలమైంది. చైనాలో లాగా సోవియట్ యూనియన్‌లో బలవంతంగా సామూహిక వ్యవసాయాన్ని రుద్దకపోయినా, విప్లవ మూలాలు బలహీన పడేందుకు దోహదం చేశాయి. ఒక పార్టీకే అధికారం కట్టబెట్టి, నియంతఅత్వాన్ని నెలకొల్పడంలో ప్రముఖ పాత్ర పోషించాయి. ఇలా సాధించిన విప్లవం దీర్ఘకాలం మనుగడ సాగించలేదని రుజువయింది. సూక్ష్మంగా చెప్పుకోవాలంటే కార్మిక కర్షక సంఘటనను నిలుపుకోవడం కష్టమని రుజువయింది.

అయితే దీనికి చారిత్రిక కారణాలు ఉన్నాయి. దానికి తోడుగా సైద్ధాంతిక కారణాలు కూడా ఉన్నాయి. వెనక్కు తిరిగి చూస్తే, కార్మిక కర్షక సంఘటన నిలబడాలంటే మార్క్సిస్టులలో ఉండే రెండు రకాల సైద్ధాంతిక అంశాలు పునఃపరిశీలించవలసిన అవసరం ఉందనిపిస్తుంది.

మొదటిది –లెనిన్ “ సోషల్ డెమోక్రసి రెండు ఎత్తుగడలు” లో ప్రజాతంత్ర విప్లవం సోషలిజం వైపుకు మార్పు చెందడం, కార్మిక కర్షక ఐక్య సంఘటనతో మొదలవుతుందని, కార్మికవర్గ సంఘటనలోని రైతాంగ మిత్రులు విప్లవబాటవైపు మరలుతున్న క్రమంలో మారతారని ఊహించారు. ధనిక రైతులు మొదట్లో విప్లవానికి అనుకూలంగా ఉన్నా విప్లవం పురోగమిస్తున్న కొద్దీ వ్యతిరేకంగా మారతారని భావించారు. అయితే ఇక్కడ ఒక ప్రశ్న. విప్లవం పురోగమిస్తున్న కొద్దీ తమకు వ్యతిరేకమవుతుందని తెలిసిన ధనిక రైతులు, ఆమాటకొస్తే మధ్యతరగతి రైతులైనా అసలు విప్లవానికి ముందు మాత్రం కార్మికవర్గంతో ఎందుకు చేతులు కలుపుతారు? వారు గనక ఐక్యం కాకపోతే విప్లవం సాధించడమే అసాధ్యం. పైగా వారు విప్లవాన్ని నమ్మి, అది తమను రక్షిస్తుందనుకుని, తమ ప్రయోజనాలకు ఏ దశలోనూ భంగం కలిగించదనుకుంటే, వారికి వ్యతిరేకంగా పోరాటం మొదలయిన క్షణం నుండి విప్లవ మార్గం అత్యంత క్లిష్టంగా తయారవుతుంది. తమను మోసం చేశారనే భావన రైతాంగానికి కలుగుతుంది. ఇది విప్లవానికి పెద్ద ఆటంకాలను సఅష్టిస్తుంది. ముఖ్యంగా విప్లవం చుట్టూ సామ్రాజ్యవాదులు తప్పనిసరిగా చేరి తీరుతారు. అప్పుడు విప్లవ సాధన మరింత క్లిష్టమవుతుంది. ప్రస్తుతమున్న ప్రపంచీకరణ నేపథ్యంలో కార్మిక, కర్షక సంఘటన అధికారంలోకి రావాలంటే ప్రపంచీకరణతో ఉన్న సంబంధాన్ని తెగదెంచుకోవాలి. శత్రువులు చుట్టుముట్టడం ఎటూ తప్పదు. ఈ కష్టాలను తప్పించుకుని శత్రువులను, విమర్శకులను దగ్గరకి రానీయకుండా చర్యలు తీసుకుని, విప్లవం విజయం సాధించినా, ఈ కష్టాలన్నీ గట్టెక్కడానికి అవసరమైన నిరంకుశపాలన అమలుపరిస్తే అది మరింత నష్టాన్ని కలిగిస్తుంది.

అంటే విప్లవానికి అవసరమైన వర్గశక్తుల బలాబలాలలో సమతూకాన్ని కేవలం బలప్రయోగంతో సాధించలేము. అది ప్రజాతంత్ర విప్లవంలో భాగస్వాములైన ధనిక రైతాంగంతో సహా రైతాంగంలో అన్ని తరగతుల వారికి, విప్లవం వలన వారి భౌతిక పరిస్థితులు బాగుపడతాయన్న నమ్మకం కలిగించ వలసి ఉంటుంది. కొంతమంది ధనిక రైతులు కలిసి రాకపోవచ్చు. విప్లవపోరాటంలో ధనిక రైతుల పాత్ర తగ్గవచ్చు. ప్రజా సమూహాలు ఈ రెండు లక్ష్యాలను సాధించగలగాలి: సమూహంలో ఉత్పత్తి శక్తుల బలాన్ని పెంచాలి. అందరి భౌతిక పరిస్థితులను మెరుగు పరుస్తూనే, అత్యంత ధనిక రైతుల బలాన్ని తగ్గించాలి. లెనిన్ చెప్పినట్టు సోషలిజం సాధించే క్రమంలో ధనిక రైతులపై దాడిచేయడం అంటే బల ప్రయోగం చేసికాదు. కానీ వారు తమకు తాముగా మార్పుచెందేలాగా ప్రయత్నించాలి. కార్మిక, కర్షక సంఘటన సోషలిజం సాధించ డానికి తన స్వరూపాన్ని మార్చుకునేందుకు వీలుకల్పిస్తూనే, రైతాంగంలోని ఏ ఒక్క విభాగం శత్రువులుగా మారకుండా జాగ్రత్త తీసుకోవాలి. ఈ ప్రయత్నానికి ప్రజాతంత్ర విప్లవ కాలంలో చేరిన ధనిక రైతులు కూడా మినహాయింపుకాదు. ఎందుకంటే అలా ఏ ఒక్క వర్గాన్ని దూరం చేసుకున్నా అది విప్లవాన్ని బలహీనపరుస్తుంది. తన చివరి రోజుల్లో ఈ నిజాన్ని లెనిన్ కూడా గుర్తించారు.

రెండో సైద్ధాంతిక అపార్థం, పైన చెప్పినట్టు తప్పనిసరిగా ఆచరించాల్సిన పద్ధతిని వదిలి పెట్టి, సోషలిజానికి మారుతున్న క్రమంలో ఏర్పడ్డ వైరుధ్యాలను పక్కన పెట్టి, బలవంతంగా తీర్మానాలు చేసి మార్చాలను కోవడం. మార్కెట్ కోసం ఉత్పత్తి చేయడం వలన కింది స్థాయి నుంచి ఉత్పత్తిదారులలో విబేధాలు వస్తాయని, ఆ విధమైన పెట్టుబడిదారీ విధాన ధోరణులు సోషలిజం పురోగమనానికి ఆటంకమని. అందువలన అటువంటి పెట్టుబడిదారీ అనుకూల ఉత్పత్తిదారులను బలప్రయోగంతో అణచివేయాలని భావించడం ఈ అపార్థానికి కారణం. ఈ అపార్థం ఏర్పడడానికి కారణం, మార్కెట్ కోసం ఉత్పత్తి చేయబడిన ప్రతి ఉత్పత్తి సరుకే అన్న భావన. సరుకుల ఉత్పత్తి, ఉత్పత్తి చేసేవారిలో బేధాలు సఅష్టిస్తుందన్నది నిజమే. (నిజానికి ఇది సరుకు ఉత్పత్తికి గుర్తింపు). అందువలన పెట్టుబడిదారీ విధానంలో తలెత్తే ఈ ధోరణి, తక్కువస్థాయిలో ఉత్పత్తి చేసే చిన్న ఉత్పత్తిదారుల నుంచి మొదలవవచ్చున్న అపోహ. కానీ సరుకు ఉత్పత్తే ఒక ప్రత్యకమైన తత్వం గలది. అది జరిగేదే మార్కెట్ కోసం. ఉదాహరణకి భారతదేశంలో బ్రిటన్ ఆక్రమణకు ముందు శతాబ్దం అంతా మార్కెట్ కోసం ఉత్పత్తి జరుగుతూనే ఉన్నది. కానీ అది కిందిస్థాయి నుంచి పెట్టుబడిదారీ విధానానికి దారి తీయలేదు. అదే గనక జరిగి ఉంటే, భారతదేశాన్ని సామ్రాజ్యవాదులు ఆక్రమించడానికి ముందే భారతదేశం యూరప్ కన్నా అభివఅద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశంగా మారి ఉండేది.


సరుకు ఉత్పత్తి స్వరూపమే మార్కెట్ కోసం అన్నది నిజం. దాని వలన ఉత్పత్తిదారునికి

ఉపయోగపు విలువ ఉండదు. కేవలం మారకపు విలువ మాత్రమే ఉంటుంది. ఇక సరుకులను ఉత్పత్తి చేసి అమ్మే వారికీ కొనే వారికీ మధ్య అసలు సంబంధమే ఉండదు. భారతదేశంలో ఉన్న విధానంలో ఏదో ఒక రకమైన బంధుత్వాలు ఉండి ప్రతిరోజూ కలుసుకునే దగ్గరి వాళ్ళ మధ్య సరుకు లావాదేవీలు జరుగుతుంటాయి. అందువలన అక్కడి అర్థంలో సగటు భారతదేశ బజారుకి, సరైన సరుకు ఉత్పత్తి కేంద్రం అయే అర్హత ఉండదు. ఉత్పత్తిదారుల మధ్య అక్కడ ఉండే విబేధాల ధోరణి ఇక్కడ ఉండ వలసిన అవసరం లేదు. అందువలనే సరుకు ఉత్పత్తిదారుల మధ్య అక్కడుండే సంబంధ ధోరణి ఇక్కడ ఉండాల్సిన పని లేదు. దానితో ముడిపడిన పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ఉద్భవించవలసిన అవసరం కూడా లేదు. ఉత్పత్తులను తయారు చేయడానికి కార్మికులను నియమించుకున్నప్పుడు కూడా ఇదే పరిస్థితి ఉంటుంది. వారు సరుకులను తయారు చేయడానికి భారతదేశంలో తినుబండారాలు తయారుచేసే ఏ నగటు వర్తకుడైనా నియమించినట్టే కార్మికులను నియమిస్తారు.

యూరప్‌లో ఆధునిక పెట్టుబడిదారీ విధానం ఏర్పడడం మెడిటరేనియన్ సముద్ర మార్గంలో వాణిజ్యం మొదలయిననాటి నుండి ఆరంభమయిందని పేరునే కనుక్కోవడం ఏ మాత్రం ఆశ్చర్యాన్ని కలిగించదు. యూరప్ సుదూరప్రాంతంలో ఉండడం, ఏమాత్రం మానవ సంబంధాలు లేకపోవడం, సరుకు ఉత్పత్తిని, దాని నిజమైన అర్థంలో పెద్ద ఎత్తున పెంచింది. పేరునేతో ఎవరు ఏకీభవించినా ఏకీభవించక పోయినా, ప్రాంతాల మధ్య దూరం ఎక్కువగా ఉండడం, వ్యక్తుల మధ్య సంబంధాలు లేకపోవడం, పెట్టుబడిదారీ విధానానికి సైద్ధాంతికంగా చాల ముఖ్యమైన అంశం.

అయితే, ప్రతి ఉత్పత్తి మార్కెట్ కోసమే అని, అన్ని ఉత్పత్తులలోను, ముఖ్యంగా ఉత్పత్తి చేయడానికి కార్మికులను నియమించుకున్న చోట పెట్టుబడిదారీ ధోరణి పొడచూపుతుందని నమ్మిన సోషలిస్టు దేశాలు, రైతాంగంతో సహా చిన్న మధ్య తరగతి యజమానులను ఉమ్మడిగా ఉండే విధంగా సంఘాలు ఏర్పరచలేదు. వారిని నియంత్రించ డానికి బదులుగా వారిపై జులుం చేశారు. అందువలన వారే సంఘాలుగా ఏర్పడి తామంత తామే వైదొలిగారు. ఇది విప్లవం యొక్క సామాజిక మూలాన్ని బలహీన పరిచింది. చైనాలోని సాంస్కృతిక విప్లవంలో చిన్నఉత్పత్తిదారుడు పెట్టుబడిదారునికి ఆద్యుడన్న భావన బహిర్గతం అయింది. వారిపై అస్త్రాలు సంధించడం జరిగింది. ఇది ఈ మధ్య కాలంలో సైద్ధాంతికంగా ఉన్న తీవ్రమైన తప్పుడు అవగాహన.

" అయితే, ప్రతి ఉత్పత్తి మార్కెట్ కోసమే అని, అన్ని ఉత్పత్తుల లోను, ముఖ్యంగా ఉత్పత్తి చేయడానికి కార్మికులను నియమించుకున్న చోట పెట్టుబడిదారీ ధోరణి పొడచూపుతుందని నమ్మిన సోషలిస్టు దేశాలు, రైతాంగంతో సహా చిన్న మధ్య తరగతి యజమానులను ఉమ్మడిగా ఉండే విధంగా సంఘాలు ఏర్పరచలేదు. వారిని నియంత్రించ డానికి బదులుగా వారిపై జులుం చేశారు. అందువలన వారే సంఘాలుగా ఏర్పడి తామంత తామే వైదొలిగారు. ఇది విప్లవం యొక్క సామాజిక మూలాన్ని బలహీన పరిచింది. "




దీని నుంచి గ్రహించవలసినది, సోషలిజం కేవలం అప్రయత్నంగా ఏర్పడే వ్యవస్థ కాదు. ఇక్కడ ప్రజలు సామూహికంగా ఆర్థిక అవసరాలతో సహా, తమ మార్గాన్ని తామే నిర్ణయించుకుంటారు. రాజకీయ జోక్యంతో చిన్న ఉత్పత్తిదారులపై దురాక్రమణ చేసే బదులు వారిని రక్షిస్తూ ప్రజల పేదరికాన్ని దూరం చేయవచ్చు. ఇది చిన్న పెట్టుబడిదారులంటే ఉన్న తప్పుడు, మూర్ఖమైన అవగాహనని విడనాడితే సాధ్య పడుతుంది. ప్రజా సమూహం రాజకీయాలను సాధనంగా చేసుకుని ఆర్థికంగా పురోగమించేందుకు ఏర్పడిన ఒక వ్యవస్థ సోషలిజం. ఇది తనకుతానే రాజకీయ కారణాలతో చిన్న ఉత్పత్తిదారులను తరిమివేయదు. తప్పుడు సైద్ధాంతిక అవగాహనతో, పెట్టుబడిదారీ వ్యవస్థకి మారే క్రమంలో ఏర్పడ్డ వైరుధ్యాలను అర్థం చేసుకోలేక, రాజకీయ కారణాలు చూపి చిన్న ఉత్పత్తిదారులను తరిమి వేయకూడదు.

ఇటువంటి ఆక్రమణలు జరిగినా, వారిలో యాదృచ్ఛిక స్వభావం ఉండకపోవడం వలన చిన్నఉత్పత్తిదారులు పేదరికం నుంచి బయట పడగలరని చారిత్రిక అనుభవాలు తెలియచేస్తున్నాయి. కానీ వారి సామాజిక విప్లవ మూలాలు బలహీన పడితే మాత్రం బతికి బట్టకట్టలేరని అవే చారిత్రిక అనుభవాలు తెలియచేస్తున్నాయి. అందువలన చిన్న ఉత్పత్తిదారులను రక్షించి, వారు తమంత తామే స్వచ్ఛందంగా మారేందుకు సహకరించాలి. సోషలిజం బతకాలంటే ఇది తప్పనిసరి. చిన్న ఉత్పత్తిదారులు కూడా సోషలిజం పట్ల వారి అవగాహనను మార్చుకోవాలి.

**(అనువాదం: కె ఉషారాణి)**

**చరిత్ర**

# కంచు యుగం వైపుగా

**ఎంవిఎస్ శర్మ**



రచయిత
ప్రజాశక్తి సంపాదకులు

పాతరాతియుగం నుంచి మధ్య రాతియుగానికి, అక్కడినుండి కొత్తరాతియుగానికి, ఆపైన కంచుయుగానికి - ఇదే మార్గాన మానవజాతి నాగరికత ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో పురోగమిస్తూ వచ్చింది. కొత్తరాతియుగానికి ఉన్న ప్రత్యేకత ఏమిటి? ఈ దశలో మానవులు వ్యవసాయానికి ఉపయోగపడే పనిముట్లను రూపొందించుకున్నారు. వ్యవసాయం అంటేనే ఒక దగ్గర స్థిరంగా నివసించడానికి సిద్ధపడడం. వ్యవసాయం అంటేనే ఎంతో కొంత మిగులు ఏర్పడడం. స్థిరంగా జీవించే పరిస్థితి వస్తేనే ఇళ్ల నిర్మాణం అవసరం వస్తుంది. మెహెర్‌ఘర్ తవ్వకాలలో అటువంటి ఇళ్లు బైటపడ్డాయి.


అక్కడినుండి కంచుయుగంవైపు మరో ముందడుగుపడింది. మనం క్రీ.పూ 4000-3200 సంవత్సరాల మధ్య కాలం వరకు వచ్చినట్టు గమనించాలి. కంచు అంటే రాగి, తగరం అనే రెండు లోహాల మిశ్రమంతో తయారైన మిశ్రమలోహం. మానవులు తాము కోరుకున్న ఆకారాలలో పరికరాలను, ఆయుధాలను తయారు చేసుకోగలిగిన పరిస్థితి వచ్చింది. ఐతే రాగి, తగరం వంటి లోహాలు ముడిపదార్థాల రూపంలోనే భూమిపై దొరుకుతాయి. భూమికింద నిక్షిప్తమై ఉన్న గనులను కనిపెట్టగలిగే స్థితి ఆనాడు లేదని గమనించాలి. భూమిపైన రాళ్లలో కొండల్లో రాగి, తగరం కలిసి వుండే రాళ్లు కొద్ది మోతాదులోనే ఉంటాయని వేరే చెప్పనవసరం లేదు. కనుక కంచు పనిముట్ల వాడకం మొదలైంది అంటే దానర్థం ఆనాటి మానవులందరూ ఆ పనిముట్లనే వినియోగించేవారనుకోలేం. ప్రధానంగా రాతి పనిముట్లనే వినియోగించేవారు. క్రీ.పూ 1000 సంవత్సరాల నాడు ఇనుము వాడకం మొదలుపెట్టాకనే రాతిపనిముట్ల వాడకం నిలిచిపోయింది.

కొద్దిగా మాత్రమే లభించినా కంచుతో చేసిన ఆయుధాలు రాతి ఆయుధాల కన్నా మెరుగైనవి అయినందున ఆ కంచు ఆయుధాలను ఎక్కువగా కలిగివున్న సమూహాలు తక్కిన సమూహాలను ఓడించి లంగదీసుకోగలిగాయి. వ్యవసాయం ద్వారా లభించిన మిగులు సంపదను స్వాధీనం చేసుకోవడానికే ఈ తరహా దాడులు జరిగాయని మనకి అర్థం ఔతుంది. ఈ దాడుల్లో ఓడిన వారిని గెలిచినవారు చంపివేయడమో, వేరే ప్రాంతాలకు తరిమివేయడమో చేయలేదు. వారిని లోబరుచుకుని వారిచేతనే ఆ భూములపై సాగు చేయించి, వ్యవసాయంలో వచ్చే మిగులును మాత్రం విజేతలు అనుభవించడం మొదలైంది. అందువలన కొత్త రాతియుగపు సంస్కృతి, జీవనవిధానం, ఆచారాలు, విశ్వాసాలు కంచుయుగంలో కూడా కొనసాగాయి.

మెహెర్‌ఘర్ ప్రాంతంలో బైటపడిన 3వ దశ శిథిలాలు క్రీ.పూ 4300 నుండి 3800 కాలంనాటికి చెందినవి. ఇక్కడ దాదాపు 200 ఎకరాల విస్తీర్ణంలో ఒకేవిధమైన మట్టిపాత్రల శిథిలాలు దొరికాయి. దీనినిబట్టి ఈ ప్రాంతమంతా ఒకే విధమైన సంస్కృతి ఉండేదని నిర్ధారించవచ్చు. అంటే మానవ సమూహం బాగా విస్తరించిందనుకోవాలి. అక్కడ ముందునుంచీ ఉండినవారికి తోడు అదనంగా వచ్చి చేరారు. అక్కడి తవ్వకాలలో లభించిన అస్థిపంజరాలను పరిశీలిస్తే ఇరాన్ ప్రాంతపు జనాల అస్థిపంజరాలను పోలివున్నాయి. ఈ దశకు పూర్వకాలానికి సంబంధించి (క్రీ.పూ 7000-4000 మధ్య) దొరికిన అస్థిపంజరాలు దక్షిణాసియా వాసుల అస్థిపంజరాలను పోలివుంటే, ఆ తర్వాత కంచుయుగపు తొలిదశలో (క్రీ.పూ 4300-3200) కాలంనాటి అస్థిపంజరాలు ఇరాన్ ప్రాంత ప్రజలకు దగ్గరగా ఉన్నాయి.

నాలుగురకాల గోధుమలు, బార్లీ, ఓట్లు పండించడం బట్టి వ్యవసాయంలో పురోగతి ఉందని చెప్పవచ్చు. వ్యవసాయం కన్నా చేతివృత్తులలో అభివృద్ధి కొట్టవచ్చినట్లు కనపబడింది. ఇది రాతిపనిముట్ల తయారీలో కూడా కనపడింది. ఆకుపచ్చరంగులో ఉండే

## చరిత్ర పూర్వ దశ



జింకలను వేటాడ్డంలో బల్లేలు, బాణాల వినియోగం

ఒక తరహా గట్టిరాతితో భూమిలోకి డ్రిల్లింగుచేసే పనిముట్లు తయారుచేశారు. ..... అభ్రకం, రాతి స్ఫటికాలతో పూసల్ని తయారుచేశారు.

బట్టీలలో కాల్చి తయారు చేసే పాత్రలను వారు వినియోగించారు. దాదాపు 1000 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు వేడి చేయగలిగే బట్టీలు ఉండేవి. రాగిని కరిగించే పెద్దపెద్ద సైజుల్లో ఉన్నాయి. దీనిని బట్టి పెద్దమొత్తాలలో ఆహారధాన్యాలను నిలువచేశారని చెప్పవచ్చు. ఆ మట్టిపాత్రలపై రంగులతో చిత్రించిన మానవుల, జంతువుల చిత్రాలు, వాటిపై వేసిన రేఖాకృతులు ఇప్పటి జానపద కళలను గుర్తుచేస్తున్నాయి.


ఈ బట్టీలను పరిశీలిస్తే సమాజంలో పనివిభజన మరింత విస్తృతమైందని చెప్పవచ్చు. కొన్నిరకాల వస్తువుల తయారీకి మాత్రమే కొందరు పరిమితమైతే మరి వారి జీవితావసరాలు ఎలా తీరుతాయి? బార్టరు పద్ధతిన సరుకుల మారకం జరిగి ఉండాలి. రాగి వంటి లోహం, కెంపులు వంటి విలువైన రాళ్లు, శంఖాలు వంటివి ఉపయోగించి ఆభరణాలు, వస్తువులు తయారు చేశారంటే ఇతర ప్రాంతాలనుంచి అవి తెచ్చి ఉండాలి. అంటే సుదూర ప్రాంతాలతో వ్యాపారం జరిగిందనుకోవాలి. అక్కడ రాగిముద్రలు దొరికినవి చూస్తే నాణేలు వాడేంత విస్తృత స్థాయిలో ఆ వ్యాపారం జరిగినట్టు చెప్పవచ్చు.

స్థిరనివాసం ఏర్పరచుకున్న పర్యవసానంగా, అపరిశుభ్రత పెరగడం, బట్టీలు నడిపినప్పుడు వెలువడే పొగ కారణంగా కాలుష్యం – వెరసి ఆయు ప్రమాణం 31 నుండి 24 సంవత్సరాలకు పడిపోయింది. చిన్న వయసులోనే మరణించేవారి సంఖ్య ఎక్కువైంది. దీని ఫలితంగా మరింత మంది పిల్లల్ని కనాలనే వత్తిడి స్త్రీలపై పెరిగి సగటున ఒక్కోస్త్రీ కనే పిల్లల సంఖ్య 4.5 నుండి 6కి పెరిగింది. ఫ్యాక్టరీలు వచ్చాక కార్మికుల కుటుంబాల స్థితి దిగజారిన వైనం గుర్తుకోస్తోంది కదా!

మెహెర్‌ఘర్ సంస్కృతి అదృశ్యం అయినది క్రీ.పూ 3800 కాలంలో. దాదాపు అదే కాలంలో మెహెర్‌ఘర్‌కు వాయవ్యంగా సింధునది ప్రాంతంలో హక్రా సంస్కృతి అవశేషాలు లభించాయి. క్రీ.పూ. 3800–3200 మధ్యకాలానికి చెందిన ఈ సంసక్కృతిలో 'హక్రా' అనే ఒక తరహా మట్టిపాత్రల తయారీ ముఖ్య లక్షణం. వాస్తవానికి హక్రా ఒకనదిపేరు. అది ఆ తర్వాత కాలంలో ఎండిపోయింది. ప్రస్తుత బెలూచిస్తాన్ ప్రాంతంలో ఇది ప్రవహించేది. ఈ ప్రాంతంలో ఆ కాలపు

**“ స్థిరనివాసం ఏర్పరచుకున్న పర్యవసానంగా, అపరిశుభ్రత పెరగడం, బట్టీలు నడిపినప్పుడు వెలువడే పొగ కారణంగా కాలుష్యం - వెరసి ఆయు ప్రమాణం 31 నుండి 24 సంవత్సరాలకు పడిపోయింది. చిన్న వయసులోనే మరణించేవారి సంఖ్య ఎక్కువైంది. దీని ఫలితంగా మరింత మంది పిల్లల్ని కనాలనే వత్తిడి స్త్రీలపై పెరిగి సగటున ఒక్కోస్త్రీ కనే పిల్లల సంఖ్య 4.5 నుండి 6కి పెరిగింది. ”**

## కొత్త రాతి విప్లవం



**ఉట్నూరులో లభించిన పశువుల గిట్టల ముద్రలు: క్రీ.పూ 3000 నాటి అవశేషాలు**

ప్రజలు ప్రధానంగా మాంసాహారంపై ఆధారపడ్డారు. వేటాడి తెచ్చిన దానికన్నా, పెంపుడు జంతువుల మాంసమే అధికశాతం ఆహారంగా ఉండేది. స్థిరనివాసాలు లేవు. పశు పెంపకం ప్రధానంగా ఉండిన సంస్కృతి ఇది. అడపాదడపా పోడు వ్యవసాయం చేసేవారు. అక్కడ ఎడారి, తుప్పలున్న వాతావరణంలో వారికి అనువైన జీవనవిధానం అదే.

వరిసాగు– మధ్య తూర్పు భారతదేశం – క్రీ.పూ 2,000 వరకూ. మెహెర్‌ఘర్ ప్రాంతంలో క్రీ.పూ 7000 సంవత్సరాల నాటికే కొత్తరాతి పనిముట్ల సాయంతో ప్రజలు వ్యవసాయం చేయగలిగారని ఇంతకుముందే చెప్పుకున్నాం. ఐతే సింధు పరివాహక ప్రాంతాన్ని దాటి తూర్పు, దక్షిణ దిశగా ఉన్న ఉపఖండంలో వ్యవసాయ పద్ధతులను చేపట్టడానికి మరో 4000 సంవత్సరాలు పట్టింది. మానవ సమాజ అభివృద్ధి క్రమం ఎంత ఎగుడు దిగుడుగా ఉంటుందో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు.

మధ్య గుజరాత్‌లోని లంఘ్‌నాజ్‌లో, దానికి ఉత్తరాన మేవార్ దగ్గరలోని బాగోర్‌లో చేపట్టిన తవ్వకాలలో కొత్తరాతియుగం నాటి పనిముట్లు దొరికాయి. లంఘ్‌నాజ్‌లోని అవశేషాలు క్రీ.పూ 2550–2185 మధ్యకాలానికి చెందినవి కాగా, బాగోర్‌లోనివి క్రీ.పూ 5365–2315 మధ్య కాలం నాటివి. బాగోర్‌లోని రెండవదశ తవ్వకాలలో రాగిపనిముట్లు, కుండపెంకులు లభించాయి. ఇవి క్రీ.పూ 2650 కాలంనాటివి. ఇటువంటిదే అదంఘర్ ప్రాంతం. నర్మదాలోయలోని ఈ ప్రాంతంలో క్రీ.పూ 6000 నాటి అవశేషాలు లభించాయి. ఈ ప్రాంతంలో క్రీ.పూ 5300 నాటికే గొర్రెలు, మేకలు, పందులు పెంపకం చేపట్టారు. తిరగలి వంటివి ఉన్నా, ధాన్యం పండించిన జాడలు మొదటిదశలో లేవు. వారు ప్రధానంగా గొర్రెల కాపరులు.

ఈ పశ్చిమప్రాంతపు ప్రజాసమూహాలతో లేకుండానే, తూర్పు భారతంలో స్వతంత్రంగానే కొత్తరాతియుగ సంస్కృతి పెంపొందింది. గంగా పరీవాహక ప్రాంతంలో బేలన్ నదీ లోయలో బోపానీమండో ప్రాంతంలో క్రీ.పూ 3385–3135 మధ్య కొత్త రాతియుగ సంస్కృతి అవశేషాలు బైటపడ్డాయి. ప్రజలు గుడిసెల్లో జీవించేవారు. అక్కడ పలురకాల కొత్తరాతి పనిముట్లు లభించాయి. మిర్జాపూర్ జిల్లా (ఉత్తరప్రదేశ్)లో కూడా క్రీ.పూ 3035–1265 మధ్య కొల్డిహవ, మహగరలలో

> **❝ ఇతర ప్రాంతాలతో సంబంధాలు లేకుండా స్వతహాగా పెంపొందిన సంస్కృతి దక్షిణాదిన మాత్రమే ఉండేదని భావించాలి. కొత్తరాతియుగ సంస్కృతి ఆనవాళ్లు కర్నాటక, ఆంధ్ర, తమిళనాడు ప్రాంతాల్లో లభించాయి. ఉట్నూరు (ఆదిలాబాద్ జిల్లా), కొడెకల్ (కర్నాటక) వద్ద క్రీ.పూ 3000 నాటి అవశేషాలు లభించాయి. ❞**

కొత్తరాతియుగ అవశేషాలు దొరికాయి. ఈ ప్రాంతాల్లో వరిసాగు జరిగిన దాఖలాలు లభించాయి. బహుశా ఇక్కడికి వరిసాగు తూర్పున చైనా వైపు నుండి విస్తరించి ఉండాలి. చైనాలో యాంగ్జీనదీ ప్రాంతంలో క్రీ.పూ 8000 నాటికే మొదలైన వరిసాగు అక్కడినుండి క్రమంగా మన ఉపఖండంలో ప్రవేశించిందను కోవచ్చు. అస్సాంలోని దావ్‌జలీహాదింగ్ ప్రాంతంలో, సారుతరు (కామ్‌రూప్ జిల్లా)లో, పశ్చిమబెంగాల్ లోని పాండురాజుదిబి (బర్ద్వాన్ జిల్లా)లో ఇటువంటి సంస్కృతే ఉంది.

ఇక్కడికన్నా కొంత అభివృద్ధి చెందిన కొత్తరాతియుగ సంస్కృతి ఆనవాళ్లు బీహార్‌లోని సారన్ జిల్లాకు చెందిన బిరంద్ ప్రాంతంలో (క్రీ.పూ 2100–1400 మధ్య) రకరకాల వైవిధ్యం కలిగిన కొత్తరాతి పనిముట్లు దొరికాయి. వాటితో పాటు వరి, గోధుమ, బార్లీ, మూంగ్ పప్పు వంటివి లభించాయి.

మొక్కలు పెంచడం, వరిసాగు చేయడం జరిగినట్టు దొరికిన ఆధారాలను బట్టి గంగామైదాన ప్రాంతంలో పెద్దఎత్తున విస్తారమైన భూముల్లో వరిసాగు జరిగినట్టు భావించలేము. ఆ ప్రాంతమంతా దట్టమైన అడవులు ఉండేవి. ఇనుము వాడకం ఇంకా మొదలు కాలేదు. అందుకే అక్కడక్కడ తుప్పలను నరికి వర్షాకాలంలో సాగుచేసేవారు. అటువంటి ప్రదేశాల విస్తీర్ణం చాలా పరిమితంగా ఉండేది. పోడువ్యవసాయం చేసేవారు. వ్యవసాయం పరిమితం గనుక చెట్ల నుండి కాయలు, దుంపలు, వేటద్వారా దొరికే జంతువుల మాంసం ఆహారంలో ముఖ్యభాగంగా ఉండేవి. నాగలి వాడిన దాఖలాలు లేవు.

ఉత్తరభారతంలో కాశ్మీర్‌లోయలోని బుర్జాహోం, గుఫ్‌కర్ల్ ప్రాంతాల్లో క్రీ.పూ 2800–2000 మధ్యకాలానికి చెందిన సంస్కృతి బైటపడింది. నదీతీరంలో ఇసుక తిన్నెల దగ్గర అరుగులు నిర్మించి అక్కడ నివసించేవారు. వేట, పశువుల పెంపకం ప్రధాన వ్యాపకం. గోధుమ, బార్లీ, పప్పుధాన్యాలు పండించిన దాఖలాలున్నాయి. అక్కడ రాళ్లపై చెక్కిన చిత్రాకృతులు (3,9) వేటలో కుక్కల్ని కూడా ఉపయోగించినట్లు సూచిస్తున్నాయి.

ఇక్కడ సమాధుల్లో లభించిన అస్థిపంజరాలలో పుర్రెకు ఏడుచోట్ల రంధ్రాలు ఉన్నట్టు గమనించారు. ఆసియా, యూరప్ ఖండాల్లో పలు కొత్తరాతియుగ సంస్కృతులలో ఇటువంటివి లభించాయి. బహుశ ఇది మనిషిపై జరిగిన తొలి నాటి సర్జరీ కావొచ్చు. మెదడుపై వత్తిడి తెస్తే అతడిని పీడించే బాధలు, తలలో దూరిన దుష్టశక్తులు బైటపడతాయనే మూఢవిశ్వాసంతో ఇటువంటి సర్జరీలు జరిగి వుండొచ్చు.

సింధులోయ సంస్కృతులతో ఉత్తర భారత ప్రాంతపు కొత్తరాతియుగం సంస్కృతులకు సంబంధాలు ఉన్నట్లు కనపడింది. కాశ్మీర్‌లోయలోని ప్రదేశాల మాదిరిగానే ఇస్లామాబాద్ దగ్గర (క్రీ.పూ. 3360–2525), హిమాలయాల దిగువన పంజాబ్ వద్ద కూడా ఆధారాలు లభించాయి. వీరికి పశ్చిమ ప్రాంతంతోనే గాక ఉత్తరచైనాలోని యాంగ్‌ఫావో ప్రాంతపు ప్రజలతో సైతం సంబంధాలు ఉన్నట్లు దాఖాలాలు దొరికాయి. దీనిని బట్టి తొలినాళ్లనుండే భారత ఉపఖండంలో అన్నివైపుల నుండి మానవ సమూహాల రాకపోకలుండేవని తెలుస్తోంది.

ఇతర ప్రాంతాలతో సంబంధాలు లేకుండా స్వతహాగా పెంపొందిన సంస్కృతి దక్షిణాదిన మాత్రమే ఉండేదని భావించాలి. కొత్తరాతియుగ సంస్కృతి ఆనవాళ్లు కర్నాటక, ఆంధ్ర, తమిళనాడు ప్రాంతాల్లో లభించాయి. ఉట్నూరు (ఆదిలాబాద్ జిల్లా), కొడెకల్ (కర్నాటక) వద్ద క్రీ.పూ 3000 నాటి అవశేషాలు లభించాయి. (3.10 పశువుల గిట్టల ముద్రలు ఉట్నూరులో లభించాయి) ఉలవలు, పెసలు, గోధుమ, బార్లీ పండించేవారు. చేతులతోనే (కుమ్మరిసారె వాడకం తెలియదు) చేసిన కుండలు లభించాయి. పశువులపెంపకం ఒక ముఖ్యవ్యాపకంగా ఉండేది.

❋



**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

చర్చ

# భారత దేశంలో రోగిష్టి నియంతృత్వం



(అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతులు పొందిన భారతీయ తత్వవేత్త, మేధావి అఖీల్ బిల్‌గ్రామీ ట్రై కాంటినెంటల్ ఇనిస్టిట్యూట్ ఫర్ సోషల్ రిసెర్చ్‌కు చెందిన జిప్సన్ జాన్, జితీష్ పి.ఎం లకు ఇటీవల ఇచ్చిన సుదీర్ఘ ఇంటర్వ్యూ సారాంశంలో రెండో భాగం ఇది.మొదటి భాగం గత సంచికలో ప్రచురించబడింది....సంపాదకుడు)

– అఖీల్ బిల్‌గ్రామీ

సోషల్ డెమోక్రసీని అధికారంలోకి రానీయకుండా లిబరలిజం దుర్మార్గమైన పాత్ర నిర్వహిస్తోంది. సమాజాన్ని మౌలికంగా మార్చడానికి కావలసిన సంభావనలు (కాన్సెప్ట్స్) కార్మిక ప్రజలకు అందకుండా చేయడం ద్వారా అది మార్పుకు అడ్డుపడుతోంది. అయితే దానర్థం సోషల్ డెమోక్రసీ సమాజాన్ని మారుస్తుందని కాదు. ఎందుకంటే సోషల్ డెమోక్రసీ ఎన్నడూ పెట్టుబడిదారీ వ్యవస్థను మౌలికంగా విమర్శించదు. ఈ అంశాలే చాలా కాలంగా భారత దేశంలోనూ, ఇతర దేశాల్లోనూ వామపక్షాలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చకు కారణమవుతున్నాయి.

పెట్టుబడిదారీ వ్యవస్థపై సోషల్ డెమోక్రసీ విధించిన నియంత్రణలు ఏవైతే ఉన్నాయో వాటిని 20వ శతాబ్దంలో లిబరలిజం తన స్వంతం చేసుకుంది. అయితే పెట్టుబడిదారీ వ్యవస్థను మౌలికంగా విమర్శించడానికి లిబరలిజం ఈ విధంగా చేయలేదన్న విషయం ఇక్కడ గుర్తుంచుకోవాలి. సోషల్ డెమోక్రసీని నీరుగార్చడానికే లిబరలిజం దాన్ని స్వంతం చేసుకుంది. ప్రభాత్ పట్నాయక్ ఈ విషయాన్ని నేరుగా పేర్కొనకపోయినా నేటి పెట్టుబడిదారీ వ్యవస్థలో దీనికి సంబంధించి చాలా చక్కగా వివరించారు. ‘‘పెట్టుబడిదారీ వ్యవస్థలో సద్యోజనిత (స్పాంటేనియస్) ధోరణలు’’ పెట్టుబడిపై నియంత్రణలు శాశ్వతంగా ఉండడానికి ఆమోదించవని పట్నాయక్ చెప్పారు. ఇక్కడ స్పాంటేనియస్ అంటే స్వేచ్ఛకు విరుద్ధమైన పదం. నిర్ధారితం (డిటర్మినిస్టిక్) అని అర్థం. అంటే పెట్టుబడిపై శాశ్వత నియంత్రణలు పెట్టే స్వేచ్ఛ మనకు లేదన్న మాట. ఈ మొత్తం అంశాన్ని ఇంకో విధంగా కూడా చెప్పవచ్చు: నీవు పెట్టుబడిదారీ వ్యవస్థను అదిగమించనైనా అదిగమించాలి లేకుంటే పెట్టుబడిదారీ వ్యవస్థే నిన్ను (అంటే నీవు దానిపై విధించిన నియంత్రణలను) బలహీనపరుస్తుంది. అంటే ఆధునిక కాలంలో మనకు పెట్టుబడిదారీ చట్రాన్ని నియంత్రించే స్వేచ్ఛ లేదు కానీ పెట్టుబడిదారీ వ్యవస్థను అదిగమించే స్వేచ్ఛ ఉంది. అంటే పెట్టుబడికి సద్యోజనితంగా (స్పాంటేనియస్‌గా) ఉన్న ‘నిర్ధారిత’ లక్షణం వల్ల అది మనకు దానిపై సోషల్ డెమోక్రటిక్ నియంత్రణలు పెట్టడానికి స్వేచ్ఛనివ్వదు. కానీ ఆ వ్యవస్థను మార్చే స్వేచ్ఛ మనకు ఉంటుంది.

ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో జనాకర్షకవాదం (పాపులిజం) పెరగడంలో లిబరలిజం పాత్రను అర్థం చేసుకోవాలి. రాజకీయ రంగంలో ప్రజల అసంతృప్తి సోషల్ డెమోక్రసీ వైపు లేదా వామపక్షం వైపు మొగ్గకుండా ఇది చేస్తుంది. రాజకీయ రంగంలో శ్రామిక ప్రజల ముందు ప్రత్యామ్నాయ సంభావనలు (కాన్సెప్ట్స్) లేకుండా చేయడం ద్వారా అది ఈ పని నిర్వహిస్తుంది. నయా–ఉదారవాద విధానాల కాలంలో బ్రిటన్‌లో కన్సర్వేటివ్ టోరీల ఆలోచనా ధోరణీ, బ్లెయిర్ కాలంలోనూ, అంతకు ముందు జేమ్స్ కల్లఘాన్ కాలం నుండే లేబర్ పార్టీ ధోరణీ ఒకటే కావడం వల్ల...వలస ప్రజలు బ్రిటన్‌కు వాస్తవానికి లాభం చేకూరుస్తారన్న భావన బ్రిటిష్ ప్రజలకు అందకుండా పోయింది. ఇటువంటి భావనలు అందకుండా లిబరలిజం అడ్డుపడింది. అందువల్లనే యూరోపియన్ యూనియన్‌ను వ్యతిరేకించిన బ్రిటిష్ ప్రజలు దానికి విరుగుడుగా వలసలను అడ్డుకుంటుంది అన్న భావనతో బ్రెగ్జిట్‌ను సమర్ధించారు. జరుగుతున్న పరిణామాలనుండి ప్రజలు సరైన సంభావనలు (కాన్సెప్ట్స్) ఏర్పర్చుకోడానికి కావలసిన మార్గాలు వారికి లేకుండా చేస్తుంది లిబరలిజం. అందువల్లనే లిబరలిజం నిజమైన వామపక్షానికి అసలైన శత్రువు. కారల్ మార్క్స్ తను రాసిన “యూదుల సమస్య” వ్యాసంలో ఈ విషయం చెప్పాడు.

మితవాదాన్ని లక్ష్యం చేసుకోవడం సులువు. ఎందుకంటే దాని వల్ల జరిగే నష్టాలు మన కళ్ల ముందుంటాయి. అమెరికాలో రిపబ్లికన్లు, బ్రిటన్‌లో టోరీలు తక్షణ ప్రమాదాలన్న దాంట్లో సందేహం లేదు. ఎన్నికల్లో ఇవి అధికారంలోకి వస్తే ప్రజలపై మరిన్ని భారాలు పడతాయన్న దాంట్లో కూడా సందేహం లేదు. కానీ లోతుగా పరిశీలిస్తే అసంతృప్తి చెందిన ప్రజల ముందు మితవాదం మినహా మరో మార్గం లేకుండా చేస్తున్న లిబరలిజం యొక్క పాత్ర అర్థమవుతుంది. అందుకనే రాడికల్ వైఖరి తీసుకునే వారు లిబరలిజాన్ని లక్ష్యం చేసుకోవాలి. అయితే ఇదేమంత సులువైన పనికాదు. ఎందుకంటే పచ్చి మితవాదుల దుర్మార్గ విధానాలను వ్యతిరేకించడం ద్వారా లిబరలిజం నైతికంగా ఉన్నత స్థితిలో ఉంటుంది. (అదే సమయంలో సోషల్ డెమోక్రాటిక్ వైఖరులు తీసుకున్న సాండర్స్, కార్బిన్ వంటివారిపై నిప్పులు చెరుగుతూ ఉంటుంది.) అందువల్ల ప్రజల ముందు మితవాదానికి ప్రత్యామ్నాయ ఆలోచనలు లేకుండా చేయడం ద్వారా

> “ అమెరికాలోని ఏ ప్రఖ్యాతి విశ్వవిద్యాలయం లోని ఆర్థిక శాస్త్ర విభాగాలైనా చూడండి లిబరలిజం యొక్క ఈ దుష్ట పాత్ర కనిపిస్తుంది. వీటిల్లో ఎవరైనా రాడికల్ సోషలిస్టు ఆర్థికవేత్త ఉంటే లిబరల్ ఆర్థిక వేత్తలు ఆ వ్యక్తిని పూర్తిగా పక్కన పెట్టేస్తారు. అంతా కలిసికట్టుగా “పాపం ఆ వ్యక్తి 50 ఏళ్లనాటి పాతచింతకాయ పచ్చడి పట్టుకు వేలాడుతున్నారు” అని చెప్పి వెలివేస్తారు. దాంతో ఉద్యోగం పట్ల ఆందోళన చెందిన ఆ వ్యక్తి రాజీ పడిపోయి ప్రత్యామ్నాయ ఆలోచనా ధోరణులను వదులుకోవడం జరుగుతుంది. ”

మితవాదం అభివృద్ధికి కారణమైన లిబరలిజానికి మితవాదాన్ని విమర్శించే నైతిక హక్కు లేదు. మితంవాదం అభివృద్ధి చెందడానికి మనం కార్మిక ప్రజలను తప్పుపట్టకూడదు. ఎందుకంటే ప్రపంచీకరణకు వ్యతిరేకంగా గానీ, లేక ఐరోపా యూనియన్‌కు వ్యతిరేకంగా గానీ వారిలో ఏర్పడిన అసంతృప్తిని కొత్తమార్గంలోకి నెట్టగలిగే సంభావనాత్మక (కాన్‌సెప్చ్యువల్) ప్రత్యామ్నాయాలు వారికి అందకుండా పోయాయి గనుక. వారిని తప్పుపట్టడం ప్రజాస్వామ్య విరుద్ధమవుతుంది. వారి రాజకీయ సంస్కృతిలో ఇటువంటి విషయాలు తెలుసుకునే అవకాశం లేకుండా చేసేవారిని మనం తప్పుపట్టాలి. ఇక్కడే మనం లిబరలిజాన్ని తప్పుపట్టాలి. అందుకే లిబరలిజం అసలు శత్రువు అని చెప్పేది.

అమెరికాలోని ప్రఖ్యాతి పొందిన ఏ విశ్వవిద్యాలయంలోని ఆర్థిక శాస్త్ర విభాగాలైనా చూడండి లిబరలిజం యొక్క ఈ దుష్ట పాత్ర కనిపిస్తుంది. ఈ విద్యాలయాల్లో ఎవరైనా రాడికల్ సోషలిస్టు ఆర్థిక వేత్త ఉద్యోగం పొందితే ఈ విభాగంలోని లిబరల్ ఆర్థిక వేత్తలు అతనిని లేక ఆమెను పూర్తిగా పక్కన పెట్టేస్తారు. ఆ వ్యక్తిమీద సెన్సార్ పెట్టరు. లేక ఇలా చెయ్యి అలా చెయ్యి అని నియంత్రణలూ పెట్టరు. అలా చేస్తే లిబరలిజం యొక్క నైతిక ఔన్నత్యం తగ్గిపోతుంది కదా! కానీ అంతా కలిసి కట్టుగా “పాపం ఆ వ్యక్తి 50 ఏళ్లనాటి పాతచింతకాయ పచ్చడి పట్టుకు వేలాడుతున్నారు” అని చెప్పి పక్కన పెట్టేస్తారు. ఇక దాంతో ఉద్యోగం పట్ల ఆందోళన చెందిన ఆ వ్యక్తి రాజీ పడిపోయి తన మౌలిక ప్రత్యామ్నాయ ఆలోచనా ధోరణులను వదులుకోవడం జరుగుతుంది. పెట్టుబడి ప్రభావం నేరుగా లేని యూనివర్సిటీల్లోనే ఇలా జరుగుతుంటే ఇక మీడియాలోనూ, రాజకీయ రంగంలోనూ పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోండి.

కార్మిక ప్రజలు ప్రత్యామ్నాయం వైపు వెళ్లాలంటే దేశాలు ప్రపంచీకరణ నుండి తెగతెంపులు చేసుకోవడం అవసరమని సమీర్ అమిన్, ప్రభాత్ పట్నాయక్‌లు చెబుతున్నారు. ఈ అంశం మీద పెద్ద చర్చ జరగాల్సిన అవసరం ఉంది. పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క చెడుఫలితాల నుండి తప్పుకోడానికి ఇది మొదటి మెట్టుగా భావించవచ్చు. అయితే ఈ ప్రతిపాదన ముందుకు తెచ్చిన మార్క్సిస్టు మేధావులిద్దరూ వర్ధమాన దేశాలకు చెందినవారు కావడం గమనార్హం. పశ్చిమ దేశాల మార్క్సిస్టుల ఆలోచనల్లో ఈ అంశం లేకపోవడం విశేషం. బ్రిటన్‌లో కార్బిన్ ఇటువంటి ఆలోచనలో ఉన్నట్లున్నాడు గనుకనే ఆయన బ్రెగ్జిట్‌కు దగ్గరగా వచ్చాడు కాని దాన్ని బహిరంగంగా ప్రకటించలేకపోతున్నాడు. అలా చేయలేకపోవడానికి అనేక కారణాలున్నాయి. ప్రపంచీకరణ నుండి విడగొట్టుకోవడం వల్ల ప్రజలు ప్రారంభంలో చాలా కష్టాలు ఎదుర్కొనాల్సి వస్తుంది. ప్రభుత్వాలు ప్రజలపై పొదుపు చర్యలకు దిగకుండా ధనవంతులపై పన్నులు విధించాల్సి ఉంటుంది. కార్బిన్ ఎన్నికల ప్రణాళికలో ఇటువంటి కొన్ని అంశాలు లీక్ అవడంతో లిబరల్ మీడియా మొత్తంగా ఆయనపై విరుచుకుపడింది. అయితే దాని వల్ల ఆయన ప్రధాన పునాది బలపడింది. ప్రపంచీకరణ నుండి విడగొట్టుకునే దేశాలు స్వావలంబన ఆధారంగా ఒక ప్రత్యామ్నాయ అభివృద్ధి మార్గాన్ని రూపొందించి, ప్రజల్లో ప్రచారం చేయాలి. అభివృద్ధికి ఉన్న ఏకైక మార్గం ప్రపంచీకరణ మాత్రమే అని అనేక సంవత్సరాలుగా బ్రెయిన్ వాష్ చేయబడిన ప్రజల సంభావనా సంస్కృతి (కాన్సెప్చ్యువల్ కల్చర్)లో ఈ ప్రత్యామ్నాయ అభివృద్ధి మార్గం ఒక భాగం కావాలి. కార్మిక వర్గం ప్రపంచీకరణ వ్యతిరేక విధానం చేపడితే సరిపోదు, రాజకీయ ఆర్థికవ్యవస్థ యొక్క మౌలిక విషయాలపై ప్రత్యామ్నాయ ఆలోచనలు ప్రభుత్వ విద్య ద్వారా ప్రజల మనస్సుల్లో స్థిరపడేట్లు చేయాలి.

ప్రపంచీకరణ నుండి దేశాలు తెగతెంపులు చేసుకోవాలి అన్న విషయంలో వర్ధమాన దేశాల ఆర్థిక వేత్తలకూ, పశ్చిమ దేశాల ఆర్థికవేత్తలకూ మధ్య పూర్తి వ్యత్యాసం ఉంది. తెగతెంపులు వల్ల వర్ధమాన దేశాలు లాభపడతాయా, పశ్చిమ దేశాలు లాభపడతాయా అన్న చర్చ జరుగుతోంది. తెగతెంపులు చేసుకోవాలన్న వాదన వర్ధమాన దేశాల ఆర్థిక వేత్తలనుండే వినిపిస్తోంది. ప్రపంచీకరణ వినా మరో మార్గం లేదని పశ్చిమ దేశాల ఆర్థిక వేత్తలు అభిప్రాయపడుతున్నారు. అయితే తెగతెంపులు చేసుకోవడం వర్ధమాన దేశాలకూ సులభమైన విషయం కాదు. వనరులు ఎక్కువగా ఉన్న పెద్ద దేశాలు ప్రారంభ కష్టాలను తట్టుకోగలవు. కాని చిన్న దేశాలకు చాలా కష్టం. అందువల్ల చిన్న దేశాల రక్షణ కోసం వర్ధమాన దేశాలు తమ మధ్య సంబంధాలు ఏర్పాటు చేసుకోవాలి. ఆ సంబంధాలు బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా కూటమి) లాగా ఉండకూడదు. చైనా, భారత దేశాలు ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలతో ఏర్పరుచుకుంటున్న సంబంధాలు కొత్త సామ్రాజ్యవాదాల ఏర్పాటుకు దారితీస్తాయని కొందరు వాదిస్తున్నారు. కానీ అవి అధికార కేంద్రాలుగా ఏర్పడి పేద దేశాల మీద పశ్చిమ దేశాల అధిపత్యం మాదిరి పరిస్థితులకు దారితీసే అవకాశం లేదు. అయితే ఈ అంశాల మీద చర్చ జరగాలి. ఒక రకంగా చెప్పాలంటే ప్రపంచీకరణ నుండి తెగతెంపులు చేసుకుంటే వర్ధమాన దేశాలు బాగుపడతాయి, పశ్చిమ దేశాలు చితికిపోడానికి అవకాశాలున్నాయి. ఎందుకంటే అలా జరిగితే వర్ధమాన దేశాల మీద గత శతాబ్దం మధ్య నుండి కొనసాగుతూ, 1980లలో పెరిగిన పశ్చిమ దేశాల ఆధిపత్యం పోతుంది కనుక.


అయితే వర్ధమాన దేశాల్లో ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తుల ఆధిపత్యంలో ఉన్నాయి గనుక అవి ప్రపంచీకరణతో తెగతెంపులు చేసుకోవడం కష్టమైన పనే. ఈ దేశాల్లో వామపక్షాలు చాలా బలహీనంగా ఉన్నాయి కనుక గత పావు శతాబ్ద కాలంలో కార్మికుల బేరసారాల శక్తి ఎలా తగ్గిపోయిందో చూశాం. భారత దేశంలోనూ, ఇతర దేశాల్లోనూ ఇది మనకు కనిపిస్తుంది. దీనికి ఒక ప్రధాన కారణం కార్మిక వర్గాన్ని అశాశ్వత, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా ముక్కలు చేయడం. రిజర్వు సైన్యం (నిరుద్యోగం) పెరగడం కూడా కార్మికుల బేరసారాల శక్తిని తగ్గించింది. నిజానికి

ఈ రెండూ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. నిరుద్యోగం పెరగడమే అనియత ఉద్యోగాలు పెరగడానికి కారణం. అందువల్ల ప్రపంచీకరణతో విడగొట్టుకోవడం అనేది చాలా కష్టంతో కూడిన పనే.

కానీ దీనికి ప్రత్యామ్నాయం ఏమిటి? ఇలాంటి ప్రయత్నాలకు అంతర్జాతీయ స్థాయిలో వచ్చే ప్రతిఘటన ఏమిటి? బ్రిట్టన్ వుడ్స్ సంస్థలు (ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్, డబ్ల్యుటివో)లు పునరుద్ధరించబడినప్పటి నుండి దేశాలు సార్వభౌమాధికారం కోల్పోతూవచ్చాయి. ఈ సంస్థలకు కోపం తెప్పిస్తే పెట్టుబడి ఎక్కడ తమ దేశాలనుండి పలాయనం చెందుతుందోనన్న ఆందోళన ఆ దేశాల లొంగుబాటుకు కారణం. ప్రతిఘటనోద్యమాల మీద దీని ప్రభావం చాలా ఆందోళనకరంగా ఉంది. ఉదాహరణకు, బ్రెజిల్‌లో లూలా డ సిల్వా అధికారంలోకి వచ్చిన విషయాన్ని తీసుకోండి. ఒక మంచి పురోగామి కార్యక్రమంతో గొప్ప కార్మికోద్యమ వెల్లువలో ఆయన అధికారంలోకి వచ్చాడు. కానీ అక్కడ ఆర్థిక వ్యవస్థ ప్రపంచీకరణతో ముడిపడి ఉండడం వల్ల ఆయనకు ముందు నుయ్యి వెనుక గొయ్యి పరిస్థితి ఏర్పడింది. స్వావలంబన విధానాలు అమలు పరిస్తే పెట్టుబడి పారిపోతుంది. అదే జరిగితే తీవ్రమైన నిరుద్యోగం ఏర్పడి ఆయనది బాధ్యతా రహిత ప్రభుత్వంగా ముద్రపడుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో పెట్టుబడి ఎక్కడకు పరారైతే అక్కడల్లా దానికి వ్యతిరేకంగా కార్మిక ఉద్యమాలు జరపడానికి సిద్ధంగా ఉండాలని మైఖేల్ హార్ట్, ఆంటోనియో నెగ్రి వంటి వారు వాదిస్తున్నారు. దీన్ని వాళ్లు ప్రాంతాలకు అతీతమైన (డి టెర్రిటోరియలైజ్డ్) ప్రతిఘటన అంటున్నారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో వారిది కేవలం ఒక భ్రమ తప్ప మరేమీ కాదు.

" అందువల్ల ప్రస్తుత పరిస్థితుల్లో జాతీయ ప్రతిఘటనా పోరాటాలకు మాత్రమే అవకాశం ఉంది. 2018 సెప్టెంబర్ 5న భారత దేశంలో జరిగిన కార్మిక-కర్షక (వ్యవసాయ కార్మికులతో సహా) ప్రదర్శన ఈ సందర్భంగా చాలా ప్రాధాన్యత గలది. నిర్దిష్టమైన, కొన్ని సార్లు విరుద్ధ ప్రయోజనాలు గల ఈ రెండు గ్రూపుల మధ్య సౌహార్ధత ఏర్పడ్డం గమనించదగ్గది. ప్రపంచ స్థాయిలో ఇటువంటి సౌహార్ధత ఊహించడం కూడా కష్టమే. "

అందువల్ల ప్రస్తుత పరిస్థితుల్లో జాతీయ ప్రతిఘటనా పోరాటాలకు మాత్రమే అవకాశం ఉంది. 2018 సెప్టెంబర్ 5న భారత దేశంలో జరిగిన కార్మిక–కర్షక (వ్యవసాయ కార్మికులతో సహా) ప్రదర్శన ఈ సందర్భంగా చాలా ప్రాధాన్యత గలది. నిర్దిష్టమైన, కొన్ని సార్లు విరుద్ధ ప్రయోజనాలు గల ఈ రెండు గ్రూపుల మధ్య సౌహార్ద్రత ఏర్పడ్డం గమనించదగ్గది. (కర్షకులు తము పండించే వాటికి అధిక ధరలు కోరుకుంటారు, దాని వల్ల పట్టణాల్లో కార్మికుల ఆహారం ధరలు పెరుగుతాయి) ప్రపంచ స్థాయిలో ఇటువంటి సౌహార్ద్రత ఊహించడం కూడా కష్టమే. బాసుమతి ధాన్యం పండించే భారత రైతులకూ



ప్రభాత్ పట్నాయక్

అమెరికా నగరాల్లో దాన్ని వినియోగించే ప్రజలకూ మధ్య సౌహార్ద్రత ఎలా సాధ్య పడుతుంది? కాని భారత దేశంలో కార్మిక–కర్షక సౌహార్ద్రతకు ఒక ప్రాతిపదిక ఉంది. రైతాంగం పండించే దానికి సరైన ధర రాకపోతే వారు దివాళా తీస్తారు. దాని వల్ల పట్టణాలకు వలసలు పెరుగుతాయి. ఫలితంగా పట్టణాల్లో తీవ్ర సమస్యలు తలెత్తుతాయి. ఇవి కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీస్తాయి. అందువల్ల రైతాంగం పండించే పంటకు ధర పలకడం అనేది కార్మిక వర్గానికి కూడా ప్రయోజనకారి అవుతుంది. అందువల్ల శ్రామికుల మధ్య సౌహార్ద్రత జాతీయ స్థాయిలో మాత్రమే కుదరడానికి అవకాశం ఉంది. అయితే సియాటిల్, ప్రపంచ ఆర్థిక ఫోరమ్ వంటి ఉద్యమాల అంతర్జాతీయ సౌహార్ద్రతను కాదనలేం. కానీ ఆ ఉద్యమాలు స్థిరంగా సాగలేవు. అందువల్ల ఇటువంటి ఉద్యమాలు స్థిరంగా సాగడానికి జాతీయ స్థాయిలోనే అవకాశాలు ఎక్కువ. ఇటువంటి ఉద్యమాలు రూపొందించిన డిమాండ్ల ఆధారంగా ఈ దేశాల్లో ఎన్నికల వేదికలు నిర్మించడం అవసరం. కానీ పెట్టుబడి పలాయనం చెందుతుందన్న ఆందోళన నయా–ఉదారవాద చట్రంలో ఈ ఉద్యమాలు జయప్రదం కావడానికి అడ్డంకిగా మారుతుంది. ఐరోపాలో గ్రీసు దీనికి ఒక ఉదాహరణ. కాబట్టి ప్రపంచీకరణతో తెగతెంపులు చేసుకోవడం అనేది ఈ దేశాల్లో ఉద్యమాల జయప్రదానికి అవసరం.

మన కాలంలో ప్రజాకర్షణవాదం తిరిగి తలెత్తడానికి ఒక కారణం ప్రస్తుతం ఉన్న ప్రజాస్వామ్యంలో పరిమితులు ఏర్పడ్డమే కాదు, గత కొన్ని సంవత్సరాలుగా వర్గ రాజకీయాలు వెనుకపట్టుపట్టడం కూడా. కార్మికుల బేరసారాల శక్తి ఎలా తగ్గించబడిందో చెప్పుకున్నాం. దాని ఫలితమే వర్గరాజకీయాలు వెనుకపట్టుపట్టడం. ఇక రెండో కారణం, వర్గరాజకీయాలతో సంబంధంలేని రకరకాల ప్రత్యేక గ్రూపులు బయలుదేరి రాజ్యంపై ఒత్తిడి పెట్టి దాని విధానాల ద్వారా ప్రయోజనాలు పొందడం. (భారత దేశంలో మండల్ ఉద్యమం, ఇతర అనేక గ్రూపులు ముందుకు రావడం ఈ కోవకే చెందుతుంది). ఈ రెండు కారణాలు రాజకీయాలను ప్రభావితంచేసే కొత్త ప్రజాకర్షణవాదాలను ప్రతిఘటన పోరాటాల్లోకి ప్రవేశపెట్టాయి. అమెరికాలో సాండర్స్ ఆ పనే చేస్తున్నాడు. ఆయన ఒకవైపు పాత పద్ధతిలో కార్మికులనూ, నిరుద్యోగులనూ సమీకరిస్తూనే, మరోవైపు విద్యా రుణాల ఊబిలో కూరుకుపోయిన విద్యార్థులనూ, ఆరోగ్య బీమా రక్షణ లేని వృద్ధులనూ, జైళ్లలో మగ్గుతున్న నల్లజాతి ప్రజలనూ కదిలించాడు.

మితవాద ప్రజాకర్షణవాదాన్ని ఫాసిజంతో పోల్చే ధోరణులు ఇప్పుడు రాజకీయ రంగంలో కనిపిస్తున్నాయి. భారత దేశంలోనూ, హంగరీలోనూ ప్రస్తుతం ఉన్న పరిస్థితులు 1930, 40 దశాబ్దాల్లో జర్మనీలోని పరిస్థితులకు సరిగ్గా పోలి ఉన్నాయని కొందరూ, లేదని కొందరూ వాదిస్తున్నారు. ఇవన్నీ విసిగించే వాదనలు. సైద్ధాంతికంగా గానీ, రాజకీయంగా

“ ప్రజలు విజ్ఞానంతో ఓటింగులో పాల్గొనడం ధనిక వర్గాలకు ఇష్టం ఉండదు. అందువల్లనే రాజకీయాల్లోగానీ, విద్యా సంస్థల్లోగానీ ఉన్నత వర్గాలు “నిపుణత” గురించి మాట్లాడతారుగానీ విజ్ఞానం గురించి మాట్లాడరు. విజ్ఞానం (నాలెడ్జ్) పొందే సామర్థ్యం అందరికీ ఉంటుంది. కాకపోతే వారికి వనరులు (మీడియా, విద్య వగైరా) అందుబాటులో ఉండాలి. కాని నిపుణత (ఎక్స్‌పెర్టయిజ్) అలా కాదు. దాన్ని కొందరే పొందుతారు. ”

గానీ ప్రేరణ నిచ్చేవి కావు. భారత దేశంలో ప్రస్తుత పరిస్థితులను చూస్తే నాటి జర్మనీ, ఇటలీలోని కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. 1) పారామిలటరీ సంస్థ అయిన ఆర్ఎస్ఎస్ రాజ్యాన్ని వెనక ఉండి నడుపుతోంది, దాన్ని ప్రభావితం చేస్తోంది. 2) హిందూత్వ దృక్పథం వెనకనున్న స్వచ్ఛమైన బ్రాహ్మణ్యం అనేది నాటి జాతి స్వచ్ఛతను పోలి ఉంది. 3) పోలీసు, హోమ్ మంత్రిత్వ శాఖ యంత్రాంగం కలిసిపోయి జాతి, ప్రజ పేరుతో అసమ్మతిని అణచి వేస్తున్నాయి. అసమ్మతిని రక్షించే సంస్థలను నిర్వీర్యం చేస్తున్నాయి. 4) గతమెంతో ఘనకీర్తి గల ప్రజలను సెక్యులరిజం పేరుతో కొంతమంది బయటి వ్యక్తులు (నాడు యూదులు, నేడు ముస్లింలు) మైలపరిచేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. 5) ఇటువంటి ప్రచారాలతో మైనారిటీలమీద, దళితులమీద సామూహిక దాడులు చేసి ఊచకోత కోస్తున్నారు. 6) దేశ వ్యాపితంగా అసంతృప్తికి లోనైన విద్యార్థులపై ఎబివిపి నాడు ఇటలీలోని బలిల్లాస్ మాదిరిగా దాడులు చేస్తున్నారు. 7) చివరిగా బెనిటో ముస్సోలినీ చెప్పినట్లు రాజ్యమూ, కార్పొరేట్ శక్తులు కలగలిసిపోయి భారత దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం మాదిరిగా రూపుదిద్దుకున్నది. ఇవన్నీ చూసినప్పుడు ఐరోపాలోని ఫాసిస్టు శక్తుల లక్షణాలు కనిపిస్తున్నాయని కొందరు అంటున్నారు, కాదని కొందరు చెబుతున్నారు. ఈ వాదనలు ఎలా ఉన్నా దీన్ని ఫాసిజం అని కాకుండా రోగిష్టి నియంతృత్వం (పాథలాజికల్ అథారిటేరియనిజం) అని పేర్కొనవచ్చు. దీన్ని గురించి సైద్ధాంతికంగా వివరించాలంటే ఆంటోనియో గ్రాంసీ చెప్పిన ‘హెజిమోనీ’ అనే పదం గురించి చెప్పుకోవాలి. ఇది ఒక టెక్నికల్ పదం. దీన్ని మామూలుగా చెప్పే అధికారం, ఇతరులపై ఆధిపత్యం అనే అర్థాల్లో వాడకూడదు. గ్రాంసీ చెప్పిన ప్రత్యేక అర్థంలో హెజిమోనీ అంటే ఒక వర్గం తను ఇతర అన్ని వర్గాల ప్రయోజనాలకోసంమే పనిచేస్తున్నాని ఆ ఇతర అన్ని వర్గాలనూ ఒప్పించి పాలక వర్గంగా మారడం. అందువల్ల అటువంటి హెజిమోనీ గల దేశాలు, లేక వర్గాలు నియంతృత్వంగా పిలవబడవు. నియంతృత్వ రాజ్యాలు నియంతృత్వంగా ఎందుకుంటాయంటే అక్కడ గ్రాంసీ చెప్పిన హెజిమోనీ ఉండదు కాబట్టి. భారత దేశంలో ప్రస్తుత మోడీ ప్రభుత్వం తన విధానాలు దేశంలోని అన్ని వర్గాల ప్రయోజనాలకోసమేనని ఆ వర్గాలన్నిటినీ ఒప్పించినట్లు చెప్పుకుంటున్నది. మరి అలాంటప్పుడు దేశంలోని నియంతృత్వాన్ని ఏమనాలి? రోగిష్టిది అనాలి. అందుకనే దీన్ని ఫాసిజం అని కాకుండా రోగిష్టి నియంతృత్వం అని అనవచ్చు. పెట్టుబడిదారీ వ్యవస్థ, దాన్నుండి వస్తున్న సంక్షోభం ఈ రోగిష్టి నియంతృత్వం అభివృద్ధి చెందడానికి ప్రాతిపదికలు.

ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ డిక్షనరీ ‘సత్యానంతరం’ (పోస్ట్ ట్రూత్) అనేదాన్ని 2017 సంవత్సరపు విశిష్ట పదంగా ఎంపిక చేసింది. ఈ పదం, దాని వెనుకనున్న ప్రపంచ దృక్పథం ఆధునికానంతరవాదం (పోస్ట్‌మోడర్నిజం) లాగానే ఉంటాయి. ఇప్పుడు ఆధునికానంతర యుగం లేక సత్యానంతర యుగం నడుస్తోందని కొందరు వాదిస్తున్నారు. మార్క్సిస్టు మేధావి ఫ్రెడరిక్ జేమ్సన్ ఆధునికానంతర వాదాన్ని సామ్రాజ్యవాద చివరి దశయొక్క సాంస్కృతిక తర్కం అని పేర్కొన్నాడు. కానీ దేన్నయినా ఒక యుగంతోనో, కాలంతోనో పోల్చేటప్పుడు చాలా ఆలోచించాలి. నిజానికి దీన్ని పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క నయా–ఉదారవాద కాలం అని చెప్పవచ్చు. పెట్టుబడిదారీ వ్యవస్థ చివరి దశ అంటే అర్థం అదే. ఈ కాలానికి సాంస్కృతిక తర్కం అంటూ ఏమీ లేదు. దానికి ఒక నిర్దిష్ట సంస్కృతి ఉంది. నిర్దిష్ట తర్కం ఉంది. ఈ రెంటినీ కలపడం సాధ్యం కాదు. తర్కం ఏమిటంటే, పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క నయా–ఉదారవాద దశ. ఇక సంస్కృతి ఏమంటే సర్వం సరుకుల మయం చేయడం. ఇంకా సూటిగా చెప్పాలంటే ఇది పనికిమాలిన సంస్కృతి. ఆధునికానంతరవాదం, ఈ సంస్కృతి రెండూ కూడా వాస్తవానికి దూరంగా అపభ్రంశం చెందిన అంశాలే. ఆధునికానంతర వాదం అనేది లోతులేని తత్వశాస్త్రం అని జేమ్సన్ చెప్పిన విషయం ఆసక్తి కరమైనది. అంతేకాదు ఆధునికవాదం (మోడర్నిజం) అనేది లోతుల్లోకి వెళ్లి శోధిస్తుందనీ, ఆధునికానంతర వాదం లోతుల్లోకి వెళ్లకుండా పైపైన చూస్తుందని జేమ్సన్ చెప్పాడు. ఆ విధంగా చూసినప్పుడు కారల్ మార్క్స్, సిగ్మండ్ ఫ్రాయిడ్ ఇద్దరూ ఆధునిక వాదులే అవుతారు. ఇక సత్యానంతర వాదం అనేది పూర్తిగా రాజకీయాలకు సంబంధించిన విషయం. ఇది ప్రధానంగా కొన్ని దేశాల్లో ముఖ్యంగా అమెరికాలో ఇటీవలి కాలంలో తలెత్తిన కొన్ని ధోరణులకు సంబంధించిన అంశం. ఇతర దేశాల్లో కూడా రానురాను ఈ ధోరణులు ఎక్కువగానే కనిపిస్తున్నాయి. ముఖ్యంగా సోషల్ మీడియాలో రాజకీయాలకు సంబంధించి తలెత్తుతున్న కొన్ని ఆందోళనకర అంశాలకు సత్యానంతరవాదం ఉపయోగపడుతోంది.

సత్యానంతరవాదం, రాజకీయాల గురించి తెలుసుకోవాలంటే ముందుగా వాస్తవాలను తొక్కిపట్టడం, వాస్తవాలను “కనిపెట్టడం” గురించి తెలుసుకోవాలి. వాస్తవాలను తొక్కిపట్టడం అనేది రాజకీయ రంగంలో చాలా కాలం నుండి ఉంది. అధికారంలో ఉన్న వారికి సమాచారాన్ని ప్రజలకు అందించడం అంటే ఇష్టం ఉండదు. సామాన్య ప్రజలకు అధికార సమాచారం ఎంత ఎక్కువగా అందిస్తే ప్రజాస్వామ్యం అంతగా పరిఢవిల్లుతుంది. అప్పుడే ప్రజలు అన్నీ తెలుసుకుని ఓటింగులో పాల్గొంటారు. ప్రజలు అలా విజ్ఞానంతో ఓటింగులో పాల్గొనడం ధనిక వర్గాలకు ఇష్టం ఉండదు. అందువల్లనే రాజకీయాల్లోగానీ, విద్యా సంస్థల్లోగానీ ఉన్నత వర్గాలు “నిపుణత” గురించి మాట్లాడతారుగానీ విజ్ఞానం గురించి మాట్లాడరు. విజ్ఞానం (నాలెడ్జ్) పొందే సామర్థ్యం అందరికీ ఉంటుంది. కాకపోతే వారికి వనరులు (మీడియా, విద్య వగైరా) అందుబాటులో ఉండాలి. కాని నిపుణత (ఎక్స్‌పెర్టయిజ్) అలా కాదు. దాన్ని కొందరే పొందుతారు. అధికారంలో ఉన్న వారు విజ్ఞానాన్ని నిపుణతగా పేర్కొంటూ అందరికీ దాన్ని అందుబాటులో లేకుండా

> **"సత్యాన్ని కనుగొనడం అంటే లేని వాటిని సృష్టించడమే. ఇది సత్యాన్ని తొక్కి పట్టి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడంకన్నా ప్రమాదకరమైంది. ఇటీవలి కాలంలో సోషల్ మీడియాలో ఈ ప్రమాదకర ధోరణి పెరిగింది. "ఇన్‌సైడ్ జాబ్" దీన్ని చక్కగా చూపించారు. 2008 ఆర్థిక సంక్షోభాన్ని నివారించడం కోసం పెట్టుబడిపై ముందస్తు నియంత్రణలు పెట్టకుండా హార్వార్డ్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలకు చెందిన ఉన్నత స్థాయి ఆర్థిక వేత్తలు ఎలా తప్పుడు సమాచారాన్ని సృష్టించారో ఇందులో చూపిస్తారు."**

చేస్తారు. సెన్సార్‌షిప్పుతో సమాచారాన్ని తొక్కి పెట్టేది మరో మార్గం. కార్పొరేట్ మీడియా వాస్తవాలను సెల్ఫ్ సెన్సార్‌షిప్పుతో తొక్కిపడుతుంది. అమెరికాలోని లిబరల్ మీడియా విదేశాల్లో తమ ప్రభుత్వం, ఇతర మిత్రులతో కలిసి చేస్తున్న అఘాయిత్యాలను గురించి ఏన్నడూ మాట్లాడదు. భారత దేశంలో కూడా ఇప్పుడు అదే జరుగుతోంది. దేశంలోని కార్పొరేట్ మీడియా మోడీ ప్రభుత్వం ముందు మోకరిల్లిపోయింది.

సత్యాన్ని కనుగొనడం అంటే లేని వాటిని సృష్టించడమే. ఇది సత్యాన్ని తొక్కి పట్టి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడంకన్నా ప్రమాదకరమైంది. ఇటీవలి కాలంలో ఈ ప్రమాదకర ధోరణి పెరిగింది. "ఇన్‌సైడ్ జాబ్" చిత్రంలో సత్యాన్ని ఎలా కనుగొంటారో చక్కగా చూపించారు. 2008 ఆర్థిక సంక్షోభాన్ని నివారించడం కోసం పెట్టుబడిపై ముందస్తు నియంత్రణలు పెట్టకుండా హార్వార్డ్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలకు చెందిన ఉన్నత స్థాయి ఆర్థిక వేత్తలు ఎలా తప్పుడు సమాచారాన్ని సృష్టించారో ఇందులో చూపిస్తారు. ఇటీవల సోషల్ మీడియాలో ఇటువంటి ధోరణులు ఎక్కువగా కనిపిస్తున్నాయి గనుక ఈ సత్యానంతరవాదం గురించి చర్చించాల్సి వస్తోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అసత్యాలు చెబుతున్నారని పలువురు అంటున్నారు. సత్యాన్ని పట్టించుకోక పోవడం వేరు, సత్యం చెప్పడాన్ని పట్టించుకోక పోవడం లేక అసత్యం చెప్పడం వేరు. అసత్యాలు చెప్పేవాడు సత్యాన్ని తొక్కిపట్టేయాలనుకుంటాడు. అందువల్లనే అతను అసత్యాలు చెబుతాడు. కానీ సత్యాన్ని పట్టించుకోని వాడు ఏదైనా విషయం సత్యమో, అసత్యమో పట్టించుకోకుండా చెప్పేస్తాడు. అసత్యాలు చెప్పేవాని మాదిరిగా ఇతను మోసం చేయాలనుకోడు. డొనాల్డ్ ట్రంప్‌ను రెండో కోవలోకి చేర్చవచ్చు. అయితే ఆయన అసలు అసత్యాలు చెప్పడని కాదు. లేక మోసం చేయలేదనీ కాదు. కానీ ఆయన చెప్పే అనేక అంశాలు వాస్తవమో కాదో తెలుసుకోకుండా చెప్పేస్తాడు.

సత్యాన్ని కనుగొనే ఇంకో మీడియా ఉంది. అది ఇంటర్‌నెట్, సోషల్ మీడియా. ఇందులో పూర్తిగా వదంతులను వ్యాపింపజేస్తారు. రాజకీయ విలువలను పూర్తిగా కలుషితం చేస్తూ తిట్ల దండకాలు చదువుతారు. ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్ కన్నా భావోద్వేగాలే సత్యాలుగా ఇందులో ప్రచారం అయిపోతుంటాయి. అబద్ధం వేగంగా



**2018 సెప్టెంబర్ 5న న్యూఢిల్లీలో జరిగిన కార్మిక-కర్షక సదస్సు**

పరుగెడుతుంది, సత్యం తరువాత నెమ్మదిగా వస్తుంది; కాని అప్పటికే అసత్యం తాను చేయాల్సిన పని చేసేస్తుంది అనే సూత్రం మీద వీరు ఆధారపడతారు. ఇది అందరికీ ఆందోళన కలిగించే ధోరణి. ఈ టెక్నాలజీ కొత్తది కనుక ఈ పద్ధతులు కూడా ఇంతకు ముందు ఎన్నడూ ఎరుగనివి. అంటే దానర్థం ఇంటర్ నెట్ మొత్తంగా రాజకీయాలు, సంస్కృతి మీద చెడు ప్రభావం చూపిస్తోందని కాదు. ఏ సాంకేతిక శాస్త్రానికైనా ఉన్నట్టు ఇంటర్‌నెట్‌కు కూడా మంచీ చెడు రెండు ముఖాలున్నాయి. ప్రధాన స్రవంతి మీడియాలో అనుమతించబడని అసమ్మతి, అభిప్రాయాలు ఇంటర్నెట్‌లో మనకు దొరుకుతాయి. క్లాస్ రూముల్లోనూ, సదస్సుల్లోనూ దొరకని విషయాలు దొరుకుతాయి. ఇవన్నీ మనకు తెలిసిన అంశాలే. అయితే మనం ఎక్కువగా చెప్పుకోని అంశం ఒకటుంది. అదేమంటే పొద్దస్తమానం చాకిరీ చేసి, మైళ్లకొద్దీ ప్రయాణాలు చేసే కార్మికులకు ఇంటర్‌నెట్‌లో లోతైన విషయాలు వెదికి పట్టుకుని, ప్రధాన స్రవంతి మీడియా ఇవ్వని సత్యాలు సేకరించే తీరిక ఎక్కడిది? మహా అయితే వాళ్లు కాస్త వినోదం కోసం నెట్ చూడగలరు అంతే. కార్మిక ప్రజలు ప్రధానంగా వినోదం, స్పోర్ట్స్, సెలబ్రిటీల సమాచారం కోసం నెట్ ఎక్కువగా చూస్తున్నారని సర్వేలో తేలింది.

ఈ మొత్తం పరిశీలిస్తే మనం తిరిగి పెట్టుబడిదారీ వ్యవస్థ దగ్గరకు వస్తాం. ఇంటర్‌నెట్ టెక్నాలజీపై ఫిర్యాదు చేయడం ద్వారా మనం ఈ సమస్యలు పరిష్కరించలేం. శ్రామిక ప్రజల జీవితాలు ఏవైతే పేదరికం, ప్రతిష్టంభన, భరించలేని చాకిరీ, పరాయీకరణ వంటి వాటిలో చిక్కుకు పోయాయో ఆ పూర్వరంగ పరిస్థితులను మార్చకుండా ఈ సమస్యల్లో ఒక్కదాన్నీ మనం సరిచేయలేం, మార్చలేం. ఈ లోతైన, మౌలికమైన అంశాలనుండి తప్పుకునే మార్గం మనకు లేదు
.

**(తెలుగు సేత : ఎన్. వెంకట్రావు)**

**అధ్యయనం**

# వ్యవసాయేతర పనుల్లోకి వ్యవసాయకార్మికులు



రచయిత హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం బాధ్యులు

సి. సాంబిరెడ్డి

వ్యవసాయ కార్మికులంటే శ్రమను అమ్ముకొని దినకూలీలుగా వ్యవసాయ రంగంలో పని చేసేవారు.

వ్యవసాయరంగంలో పెట్టుబడిదారీ సంబంధాలు ప్రవేశించటంతో రైతాంగంలో వర్గీకరణ జరుగుతుంది. దానితో రైతులలో భూములు కోల్పోయేవాళ్లు, భూములు సంపాదించేవాళ్లు తయారవుతారు. వాళ్లలో భూములు పోగొట్టుకునే వాళ్లు ఎక్కువగాను, భూములు కొనేవాళ్లు తక్కువగానూ ఉంటారు. భూములు పోగొట్టుకొన్నవాళ్లు బ్రతుకు తెరువు కొరకు వ్యవసాయ కూలీలుగా మారతారు. ఈ ప్రక్రియ సాగునీటి వసతి గల ప్రాంతాల్లో వేగంగా జరుగుతుంది. అందుకనే ఆంధ్రరాష్ట్రం లోని డెల్టా ప్రాంతాల్లో వీరు చాలా ఎక్కువగా ఉంటారు. ఈ ప్రాంతాల్లో బ్రిటీష్ వాళ్ల కాలం నుండి సాగునీటి వసతి ఉంది. కాబట్టి అక్కడ వ్యవసాయ కార్మికుల సంఖ్య అప్పటి నుండి పెరుగుతూనే ఉంది. అందుకే రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకంటే డెల్టా ప్రాంతంలో వ్యవసాయ కార్మికులు చాలా ఎక్కువ. ఆధునిక పరిశ్రమల తాకిడికి తట్టుకోలేక దివాళా తీసిన వృత్తిదారులు కూడా ప్రధానంగా వ్యవసాయ కార్మికులలోనే కలిసి పోయారు.

విజ్ఞాన కేంద్రం సేకరించిన సమాచారం ప్రకారం వృత్తులను వదిలి పెట్టే వారి సంఖ్య చాలా వేగంగా పెరుగుతూ ఉంది. ఆ సమాచారం ఆధారంగా 25 సంవత్సరాల వ్యవధిలో వృత్తిదారుల కుటుంబాలలో ఎంత శాతం కుటుంబాలు వృత్తులను వదిలిపెట్టి ఇతర ఉపాధులు చూసుకున్నాయో లెక్కించటం జరిగింది. 25 సంవత్సరాల వ్యవధిలో రాష్ట్రం మొత్తం మీద 47.67 శాతం కుటుంబాలు వృత్తులను వదిలి పెట్టినట్లు లెక్క తేలింది. చర్మకారులు, చేనేత, కమ్మరి, వాయిద్య కళాకారుల కుటుంబాలు మొత్తం వృత్తులు వదిలి పెట్టినట్లుగా సర్వే జరిపిన గ్రామాల నుండి సమాచారం అందింది. వృత్తులు వదలని వారుగా కార్పెంటర్లు, స్వర్ణకారులు, పూజార్ల కుటుంబాలు కనిపిస్తాయి. కార్పెంటర్లు, స్వర్ణకారులు సమీప పట్టణాలలో వారి వృత్తులకు సంబంధించిన కూలి పనులు చేస్తున్నారు. మంగలి కుటుంబాలు 35 శాతం, కల్లుగీత కార్మికులు 64.28 శాతం, మత్స్యకారులు71.42 శాతం వృత్తులను వదిలి పెట్టారు. రాయలసీమలో చేపలు పట్టే కుటుంబాల వారు దాదాపు లేరు. గీత వృత్తి ఇబ్బందితో కూడుకున్న వృత్తి కాబట్టి యువతరం ఇష్టపడటం లేదు. వృత్తులు వదిలిన వారిలో ఎక్కువ భాగం వ్యవసాయ కూలీలలో కలిసిపోతున్నారు.

**వేగంగా పెరుగుతున్న భూమిలేని కుటుంబాలు :** గుంటూరు జిల్లాలో అనంతవరం పూర్తిగా మాగాణి భూములు గల ఒక గ్రామం. ఆ గ్రామంలో 1974లో సందరయ్య గారు ఒక సర్వే జరిపారు. ఆనాడు భూమిలేని కుటుంబాలు ఆ గ్రామంలో 50 శాతం ఉన్నట్లుగా లెక్క తేలింది. అదే గ్రామాన్ని 2004లో ప్రొ॥ వి.కె.రామచంద్రన్ బృందం సర్వే చేసింది. ఆ సర్వేలో ఆ గ్రామంలో భూమిలేని కుటుంబాలు 65 శాతంగా లెక్క తేలింది. అంటే 1974 నుండి 2004, అంటే 30 సంవత్సరాల కాలంలో ఆ గ్రామంలో భూమిలేని కుటుంబాలు 50శాతం నుండి 65 శాతానికి పెరిగాయి. అంటే 30 సంవత్సరాలలో 15 శాతం పెరిగాయని అర్థమౌతుంది. అనంతవరం సమీపాన వున్న చిన్న గాదెల వర్రు గ్రామంలో 2008 సంత్సరంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం సర్వే నిర్వహించింది. ఆ సర్వేలో భూమిలేని కుటుంబాలు 74 శాతమని తేలింది. అంటే మొదటి 30 సంవత్సరాలలో భూమిలేని కుటుంబాలు 15 శాతం పెరిగితే ఇప్పుడు 2004 నుండి 2008 మధ్యకాలంలో అంటే 4 సంవత్సరాల కాలంలోనే భూమిలేని కుటుంబాలు 9 శాతం పెరిగాయి. అంటే కాలం గడిచే కొద్దీ భూములు పోగొట్టుకొని కూలీలుగా మారే రైతులు చాలా వేగంగా పెరుగుతున్నట్లు స్పష్టమవుతుంది. 2013-14లో కూడా విజ్ఞాన కేంద్రం మరొక సమీప గ్రామం చంపాడులో సర్వే జరిపింది. అక్కడ భూమిలేని కుటుంబాలు 81 శాతమని లెక్క తేలింది. అంటే 2008 నుండి 2014 వరకు గడిచిన 6 సంవత్సరాల కాలంలో భూమిలేని కుటుంబాలు 74 శాతం నుండి 81 శాతం వరకు, అంటే 7 శాతం పెరిగాయి. దీనిని బట్టి 2008 తరువాత కూడా భూమి కోల్పోయిన కుటుంబాలు వేగంగానే పెరుగుతున్నట్లు అర్థమౌతుంది. మన రాష్ట్రంలో 1995లో నయా ఉదారవాద విధానాలు ప్రారంభమయ్యాయి. పై వివరాలను పరిశీలిస్తే భూములు కోల్పోయే కుటుంబాలు నయా ఉదారవాద విధానాలు అమలు జరిపిన కాలంలోనే ఎక్కువ వేగంగా పెరిగినట్లు అర్థమౌతుంది. (అనంతవరం, చినగాదెల వర్రు, చంపాడు - మూడూ తెనాలి తాలూకాలోని దగ్గర, దగ్గరగా ఉండే గ్రామాలు. దాదాపు ఒకే వ్యవసాయ పరిస్థితులు గలవి. అందుకే భూమిలేని కుటుంబాలను పరిశీలించటానికి ఈ మూడు గ్రామాలను తీసుకోవటం జరిగింది. కాని వివిధ సంవత్సరాలకు సంబంధించిన పరిశీలనకు ఒకే గ్రామాన్ని తీసుకోవాలి. కాని మూడు పర్యాయాలకు సంబంధించిన సమాచారం గల గ్రామం అందుబాటులో లేక మూడు సమీప గ్రామాలను తీసుకోవటం జరిగింది.)

కాని భూమిలేని కుటుంబాల శాతం రాష్ట్రమంతా ఒకే విధంగా లేదు. ఇంతకు ముందే చెప్పినట్లు మాగాణి ప్రాంతాల్లో

భూమిలేని కుటుంబాలు ఎక్కువగా ఉంటాయి. మెట్ట ప్రాంతాల్లో తక్కువగా ఉంటాయి. పెట్టుబడిదారీ సంబంధాలు వ్యవసాయంలో ఏ మేరకు ప్రవేశించాయి, భూమిలేని కుటుంబాలు యే మోతాదులో పెరిగాయి అనే దానిపై వ్యవసాయ కార్మిక కుటుంబాల శాతం ఆధారపడుతుంది. కింది గ్రామాలను పరిశీలిద్దాము.

**"వ్యవసాయంలో యాంత్రీకరణ బాగా పెరిగింది. భూస్వాములకు సబ్సిడీలపై ప్రభుత్వమే యంత్రాలను సరఫరా చేస్తూ ఉంది. ట్రాక్టర్లు విపరీతంగా పెరిగాయి. కోత యంత్రాలతో పాటు హార్వెస్టర్లు కూడా వచ్చాయి. ఇట్లా వ్యవసాయ రంగమంతా యంత్రాల మయమైంది. ఒక ప్రక్క యంత్రాలతో పనిదినాలు వేగంగా తగ్గిపోతూ ఉంటే, మరొక ప్రక్క భూములు కోల్పోవటం ఎక్కువై వ్యవసాయ కార్మికులు పెరిగిపోతున్నారు."**

<u>మాగాణి ప్రాంతంలోని గ్రామాలు :</u>

| గ్రామం | భూమిలేని కుటుంబాల శాతం |
|---|---|
| 1 రోళ్లపాలెం (తూ.గో) | 90% |
| 2. చేదువాడ (తూ.గో) | 89% |
| 3. బొబ్బనపల్లి (ప.గో) | 85% |
| 4. చంపాడు (గుంటూరు) | 81% |
| 5. జయపురం (క్రిష్ణా) | 72% |
| 6. కట్టావారి పాలెం (గుంటూరు) | 72% |

<u>మెట్ట ప్రాంతాలలోని గ్రామాలు :</u>

| గ్రామం | భూమిలేని కుటుంబాల శాతం |
|---|---|
| 1. అంపిలి (శ్రీకాకుళం) | 54.3% |
| 2. కొలభీముని పాడు (ప్రకాశం) | 49% |
| 3. హాజీపురం (ప్రకాశం) | 40.9% |
| 4. గువ్వలదొడ్డి(కర్నూలు) | 40.3% |
| 5. కె. మార్కాపురం (కర్నూలు) | 37% |
| 6. రేణుమాకులపల్లి(అనంతపురం) | 32% |



వ్యవసాయంలో యాంత్రీకరణ వ్యవసాయ కార్మికుల ఉపాధిని దెబ్బతీస్తున్నది

ఈ విధంగా వ్యవసాయ కార్మిక కుటుంబాలు పెరిగిపోతూ ఉంటే, వారు పెరిగే ధరలకు అనుగుణంగా తమ కూలిరేట్లు కూడా పెంచుకునేందుకు భూకామందులతో బేరసారాలాడగలిగే తమ శక్తిని కూడా కోల్పోయి నిస్సహాయులవుతారు. ఉదాహరణకు రోళ్లపాలెం గ్రామంలో భూమిలేని కుటుంబాలు 90శాతం ఉన్నాయి. వారంతా తమ జీవనం కొరకు భూములు గల మిగిలిన 10 శాతం కుటుంబాల మీదనే ఆధారపడాల్సి వస్తుంది. కూలిరేటుతో సంబంధం లేకుండా పని దొరికితే చాలన్నట్లు పని కొరకు వారిలో వారు పోటీపడతారు. ఈ పరిస్థితిని ఉపయోగించుకొని భూములు గలవారు వీలయినంత తక్కువ కూలికి పని చేయించుకుంటారు. పోటీ తీవ్రంగా ఉన్నంత కాలం వ్యవసాయ కార్మికులు నిస్సహాయులుగానే మిగిలిపోతారు. దీనికి విరుగుడు వారు సంఘటితం కావటమే. అప్పుడు బేరసారాలాడే పని సంఘమే చేస్తుంది.

ప్రాంతాలవారీగా పరిశీలిస్తే భూమిలేని కుటుంబాలు దక్షిణకోస్తాలో గరిష్టంగా సగటున 70 శాతం, ఉత్తర కోస్తాలో 40 శాతం, రాయలసీమలో కనిష్టంగా 33 శాతం ఉన్నాయి.

<u>పనిదినాలు :</u>

వ్యవసాయంలో యాంత్రీకరణ బాగా పెరిగింది. భూస్వాములకు సబ్సిడీలపై ప్రభుత్వమే యంత్రాలను సరఫరా చేస్తూ ఉంది. ట్రాక్టర్లు విపరీతంగా పెరిగాయి. కోత యంత్రాలతో పాటు హార్వెస్టర్లు కూడా వచ్చాయి. నాట్లకు కూడా యంత్రాలే. కలుపు నివారణకు మందులు వచ్చాయి. వేరుశనగ కాయలు వలవటానికి, మొక్కజొన్న గింజలు తీయటానికి, యంత్రాలనే వాడుతున్నారు. పురుగుమందులు చల్లటానికి కూడా యంత్రాలే. ఇట్లా వ్యవసాయ రంగమంతా యంత్రాల మయమైంది. ఒక ప్రక్క యంత్రాలతో పనిదినాలు వేగంగా తగ్గిపోతూ ఉంటే, మరొక ప్రక్క భూములు కోల్పోవటం ఎక్కువై వ్యవసాయ కార్మికులు పెరిగిపోతున్నారు. వారిలో వారికి పోటీ ఎక్కువై పెరిగే ధరలకు అనుగుణంగా కూలిరేట్లు పెరగటం లేదు. రాష్ట్రంలోని పనిదినాలను పరిశీలిస్తే సగటున సంవత్సరానికి ఉత్తర కోస్తాలో 122 రోజులు, దక్షిణ కోస్తాలో 137 రోజులు, రాయలసీమలో 124 రోజులు, రాష్ట్రం మొత్తం మీద సగటున 128 రోజులు ఒక్కొక్కరికి పని దొరుకుతుంది. అంటే సంవత్సరానికి సగటున నాలుగున్నర నెలలు కూడా పని దొరకటం లేదన్న మాట. అందుకే వామపక్షాల వత్తిడితో ఉపాధి హామీ చట్టం వచ్చింది. మన రాష్ట్రంలో 2008-09లో ఉపాధి హామీ చట్టం ద్వారా సగటున కుటుంబానికి 14 రోజులు మాత్రమే పని దొరికింది. (ఆ పథకాన్ని ఆ సంవత్సరమే ప్రవేశ పెట్టారు.) కాని 2013-14లో ఉపాధి పనిరోజులు కుటుంబానికి 100 రోజులు కాకపోయినప్పటికీ బాగా పెరిగాయి. సగటున కుటుంబానికి ఉత్తరాంధ్రలో 65, దక్షిణాంధ్రలో 47, రాయలసీమలో 80 రోజులు ఉపాధి పనులు దొరికాయి. కాబట్టి 2013-14లో, అంటే రెండవ సర్వే జరిగిన సంవత్సరం మొత్తం పని దినాలు అంటే, ఉపాధి పనిదినాలు, వ్యవసాయ రంగంలో లభించే పని దినాలు మొత్తం కలిసి బాగా పెరిగి ఉండాల్సింది. కాని అలా పెరగలేదు. పురుషులకు మాత్రం నామమాత్రంగా పెరిగాయి.

2008-09లో సగటున మనిషికి 140 రోజులు పని ఉంటే 2013-14లో 128 రోజులు మాత్రమే పని దొరికింది. అందులో

❝ వ్యవసాయ రంగంలో సంవత్స రానికి మూడు నెలలు పని దొరకటమే గగనంగా వుందని చూశాము. దానికితోడు వారికిచ్చే కూలిరేట్లు కూడా చాలా హీనంగా వున్నాయి. వాటిలో కూడా ప్రాంతాలను బట్టి హెచ్చుతగ్గులు వున్నాయి. దక్షిణ కోస్తాలో సగటు దినకూలి రు.185/-లు వుంటే ఉత్తర కోస్తాలో రు.158/-లు, రాయలసీమలో రు.150/-లు వుంది. రాష్ట్రం మొత్తం మీద సగటు కూలి రు.172/-లు మాత్రమే. ❞

ఉపాధి పనిదినాలు సగటున మనిషికి 30 రోజులు ఉన్నాయి. 128 పని దినాలలో ఈ 30 రోజుల ఉపాధి పని తీసేస్తే మిగిలేది 98 రోజులు మాత్రమే. అంటే వ్యవసాయ రంగంలో దొరుకుతున్న పని దినాలు సగటున 98 మాత్రమే. సంవత్సరానికి 3నెలల 8రోజులు. మిగిలిన కాలమంతా వారు పని కొరకు ఎదురు చూస్తూ ఉండవలసిందే. పురుషుల కంటే స్త్రీల పనిదినాలు మరింత ఎక్కువగా తగ్గిపోయాయి. మూలిగే నక్క మీద తాటి కాయపడ్డట్టు భూస్వాములు, ధనిక రైతులు ఉపాధి చట్టం పనులను వ్యవసాయంతో ముడి వేయమంటున్నారు. వ్యవసాయ రంగంలో ఉన్న పనులు చాలకనే ఉపాధి హామీ చట్టం ద్వారా వ్యవసాయ రంగానికి బయట కుటుంబానికి 100 రోజుల చొప్పున ప్రభుత్వం పని కల్పించవలసి వచ్చింది. ఇప్పుడు ఈ పథకాన్ని వ్యవసాయ రంగంతో ముడి పెడితే వ్యవసాయ రంగంలో చేసే పనిలో 100 రోజుల వరకు ఉపాధి పథకం నుండి కూలి అందుతుంది. కాని దీనితో బయట నుండి రావలసిన 100 రోజుల పని గల్లంతవుతుంది. ఎందుకంటే 100 రోజుల ఉపాధిపని వ్యవసాయ రంగంలోనే ఇవ్వబడింది. కాబట్టి, ఆ పనికి ఉపాధి నిధుల నుండే చెల్లిస్తారు. కాబట్టి బయట పని ఇవ్వటానికి ఆ పథకం అంగీకరించదు. బయట నుండి రావలసిన 100 రోజుల పనిని వదులుకోవాల్సి వస్తుంది. అందువల్ల ఉపాధి పథకాన్ని వ్యవసాయంతో ముడి పెడితే వ్యవసాయ కార్మికులు తీవ్రంగా నష్టపోతారు.

**గ్రామాలలో పని దినాలు, కూలిరేట్లు:**

| గ్రామం | పని దినాలు | కూలిరేటు |
|---|---|---|
| **బొబ్బనల్లి(ప.గో)** | **154** | **230** |
| **కొత్తపల్లి (క్రిష్ణా)** | **128** | **196** |
| **చెన్నారావుపాలెం (క్రిష్ణా)** | **131** | **182** |
| **బండివారిగూడెం (ప.గో)** | **187** | **164** |
| **కట్టావారిపాలెం (గుంటూరు)** | **150** | **133** |
| **కొలభీమునిపాడు (ప్రకాశం)** | **191** | **109** |
| **పట్టుపురం (శ్రీకాకుళం)** | **215** | **196** |
| **రామవరం(విజయనగరం)** | **99** | **159** |
| **జగ్గన్నపేట (విశాఖపట్నం)** | **236** | **179** |
| **గువ్వలదొడ్డి (కర్నూలు)** | **122** | **132** |
| **రేణుమాకులపల్లి (అనంతపురం)** | **115** | **112** |
| **కె.మార్కాపురం (కర్నూలు)** | **137** | **160** |

వ్యవసాయ రంగంలో సంవత్స రానికి మూడు నెలలు పని దొరకటమే గగనంగా వుందని చూశాము. దానికితోడు వారికిచ్చే కూలిరేట్లు కూడా చాలా హీనంగా వున్నాయి. వాటిలో కూడా ప్రాంతాలను బట్టి హెచ్చుతగ్గులు వున్నాయి. దక్షిణ కోస్తాలో సగటు దినకూలి రు.185/–లు వుంటే ఉత్తర కోస్తాలో రు.158/–లు, రాయలసీమలో రు.150/–లు వుంది. రాష్ట్రం మొత్తం మీద సగటు కూలి రు.172/–లు మాత్రమే. కూలిరేట్లలో స్త్రీ, పురుషుల మధ్య వ్యత్యాసం కూడా చాలా హెచ్చుగానే ఉంది. రాష్ట్రంలో పురుషుల సగటు కూలి రు.211/–లు వుంటే స్త్రీల సగటు కూలి రు.119/–లు మాత్రంగానే ఉంది. అంటే పురుష కూలిలో స్త్రీల కూలి 56శాతం మాత్రమే. స్త్రీల కూలిరేట్లు ఇంత హీనంగా ఉండబట్టే రాష్ట్రంలో సగటు కూలి బాగా తక్కువగా రు.172/–లుగా లెక్క తేలింది. వారి కుటుంబ ఆదాయాలు కూడా బాగా తగ్గిపోయాయి. ప్రాంతాలను బట్టి కూడా స్త్రీల కూలిరేట్లలో చాలా హెచ్చుతగ్గులున్నాయి. స్త్రీల సగటు కూలి దక్షిణ కోస్తాలో రు.129/–లు ఉండగా, ఉత్తర కోస్తాలో అది రు.98/–లు మాత్రమే ఉంది. ఈ విషయంలో ఉత్తరాంధ్రకంటే రాయలసీమ కొంత మెరుగ్గా ఉంది. అక్కడ స్త్రీల సగటు కూలి రు.111/–లు. (ఇవి 2013–14లో ఉన్న కూలిరేట్లు.) ఇప్పుడు ఇంకా కొంత పెరిగి ఉంటాయి. అయినా సగటు కూలిరేట్లు గ్రామాలలో రైతులు చెప్పే వాటికంటే చాలా తక్కువగానే లెక్క తేలుతాయి. మరొక ప్రక్క ఉపాధి పనులకు కూలిరేట్లు ప్రాంతాన్ని బట్టి మారుతున్నాయి. 2013–14లో ఉపాధి కూలిరేట్లు రాష్ట్రంలో రు.70/–ల నుండి రు.230/–ల వరకు ఉన్నాయి. గ్రామాలు, ప్రాంతాలను బట్టి రేట్లు మారుతూ ఉన్నాయి.

**కూలిరేట్లు పెరగకపోవటానికి కారణాలు :**

1. వ్యవసాయ కార్మికులు సంఘటితంగా లేరు.

2. వ్యవసాయ కార్మికుల సంఖ్య విపరీతంగా పెరగటంతో వారి మధ్య కూలి పనుల కొరకు పోటీ ఎక్కువై కూలిరేట్లు పెరగకుండా ఆపోటీ అడ్డుకుంటూ ఉంది.

3. కాంట్రాక్టు, పీస్‌రేట్ల వలన కూలిరేట్లు తగ్గిపోతున్నాయి. :

యాంత్రీకరణ బాగా పెరిగింది. కాబట్టి ఈమధ్య కాంట్రాక్టు పద్ధతి కొంత వెనకపట్టు పట్టింది. అయినా ఇంకా ఈ పద్ధతి బలంగానే ఉంది. పత్తి తీయటం, మిరపకాయలు కొయ్యటం లాంటి పనులకు పీస్‌రేటు పద్ధతి ఒక నియమంగా మారింది. కాంట్రాక్టు పద్ధతిలో, పీసురేటు కూలీలు ఈ పనులను పొద్దు పొడిచినప్పటి నుండి పొద్దుకుంకే వరకు చాలా వేగంగా చేస్తారు. పని చేసే కాలం, పని తీవ్రత కూడా ఎక్కువే. మామూలు పరిస్థితులలో 2 రోజులలో చేసే పనిని ఒకరోజులోనే చేస్తున్నారు. పని వత్తిడి రోజుల్లో కూలిరేటు రు.300/–లు, వరకు ఉంటుంది. ఈ లెక్కన కాంట్రాక్టు, పీస్‌రేటు పనుల్లో రోజుకు సగటున రు.600/–లు కూలి పడాలి. కాని అవి సగటున రు.450/–లకు మించటం లేదు. ఆ విధంగా కాంట్రాక్టు, పీస్‌రేటు పనులలో వాస్తవంగా వ్యవసాయ కార్మికులు నష్టపోతున్నారు.

4. కౌలురైతులు, పేదరైతులు కూడా కూలి పనులకు పోటీ పడుతున్నారు.

సన్నకారు, చిన్నకారు, కౌలురైతులకు వ్యవసాయం ఏ మాత్రం గిట్టుబాటు కావటం లేదు. వ్యవసాయంలో వారి ఆదాయాలు వేగంగా పడిపోతున్నాయి. 2008లో సన్నకారురైతులకు వ్యవసాయ రంగంలో ఆదాయం వారి మొత్తం ఆదాయంలో 32.2శాతం ఉండగా, 2013లో అది 7.6 శాతానికి పడిపోయింది. చిన్నకారు రైతులకు వారి వ్యవసాయ ఆదాయం 2008లో 58.5 శాతం ఉండగా 2013 నాటికి అది 16.6 శాతానికి పడిపోయింది. కౌలురైతులకు 2008లో అది 49.4 శాతం ఉండగా, 2013 నాటికి అది 19.3 శాతానికి పడిపోయింది.

ఈ విధంగా వ్యవసాయంలో పేదరైతుల ఆదాయాలు తీవ్రంగా పడిపోయాయి. వ్యవసాయంలో వచ్చే రాబడిలోని తరుగుదలను పూడ్చుకోవటానికి వారెక్కువగా వ్యవసాయ రంగంలో కూలి పనుల మీద ఆధారపడుతున్నారు. ఈ రైతులకు వారి మొత్తం ఆదాయాల్లో కూలి ఆదాయం ఈ కాలంలో గణనీయంగా పెరిగింది. 2008లో సన్నకారు రైతుల కూలి ఆదాయం వారి మొత్తం ఆదాయంలో 37శాతం ఉండగా, అది 2013 నాటికి 63.8 శాతానికి పెరిగింది. చిన్నకారు రైతులకు కూలి ఆదాయం ఇదే కాలంలో 20.4 శాతం నుండి 35.1 శాతానికి పెరిగింది. అట్లాగే కౌలురైతులకు అది 37 శాతం నుండి 52 శాతానికి పెరిగింది. మధ్య తరగతి రైతుల కూలి ఆదాయం కూడా 10.4 శాతం నుండి 49.1 శాతానికి పెరిగింది. ఇట్లా పేదరైతుల మొత్తం ఆదాయంలో వారు కూలి పనులు చేసి సంపాదించే ఆదాయం సగం, లేదా సగానికి పైగానే ఉంటూ ఉంది. ఇట్లా వ్యవసాయ కార్మికులతో పేదరైతులు కూలి పనుల కొరకు పోటీ పడటం సంవత్సర, సంవత్సరానికి పెరుగుతూ ఉంది. కాబట్టే వారి కూలిరేట్లు పెరిగే ధరలకు అనుగుణంగా పెరగటం లేదు.

### వ్యవసాయ కార్మికులకు తరిగిపోతున్న కూలి సంపాదన

రైతులకు వ్యవసాయ ఆదాయాలు తగ్గుతున్నట్లుగానే వ్యవసాయ కార్మికులకు వారి సాలుసరి ఆదాయంలో కూలి భాగం గణనీయంగా తగ్గిపోతూ ఉంది. 2008లో వీరి కూలి ఆదాయం, వారి మొత్తం ఆదాయంలో 88.6 శాతం ఉండగా, అది 2013 నాటికి 57శాతానికి పడిపోయింది. అంటే కూలి ఆదాయం వారి మొత్తం ఆదాయంలో దాదాపు సగం మాత్రమే. మిగిలిన సగం వారు వేరే రంగాల్లో సంపాదించుకోవాలి. కాబట్టే వారు తమ ఆదాయాల్లో ఈ తరుగును పూడ్చుకోటానికి మొత్తం 14 రకాల ఇతర పనులు చేస్తున్నారని లెక్క తేలింది. అంటే ప్రతి కుటుంబం 14 రకాల పనులు చేస్తుందని కాదు. వారు చేస్తున్న ప్రధానమైన ఇతర పనులు (1)కౌలు, (2) వ్యవసాయేతర కూలి పనులు (3) చిన్న వ్యాపారాలు (4) చిన్న ఉద్యోగాలు (స్కీము వర్కర్ల లాంటివి) (5) స్వయం ఉపాధి పనులు (6) వృత్తి పనులు (7) పాడి (8) సమీప పట్టణాలలో పనులు (9) పాలేరు, (10) వలసలు మొదలగునవి. ప్రతి కుటుంబం రెండు, మూడు, నాలుగు రకాల పనులు చేస్తూ ఉండటం కనిపించింది. ఈ కాలంలో వ్యవసాయ కూలీలు కౌలు రైతులుగా మారటం ఎక్కువయింది. గ్రామాల్లో సగానికి పైగా కుటుంబాలకు కూలే ప్రధాన ఆదాయ వనరు.

**" వ్యవసాయ కార్మికులకు సాలుసరి ఆదాయంలో కూలి భాగం గణనీయంగా తగ్గిపోతూ ఉంది. 2008లో వీరి కూలి ఆదాయం, వారి మొత్తం ఆదాయంలో 88.6 శాతం ఉండగా, అది 2013 నాటికి 57శాతానికి పడిపోయింది. అంటే కూలి ఆదాయం వారి మొత్తం ఆదాయంలో దాదాపు సగం మాత్రమే. మిగిలిన సగం వారు వేరే రంగాల్లో సంపాదించుకోవాలి. కాబట్టే వారు తమ ఆదాయాల్లో ఈ తరుగును పూడ్చుకోటానికి మొత్తం 14 రకాల ఇతర పనులు చేస్తున్నారని లెక్క తేలింది. "**



గ్రామాల్లో వ్యవసాయ పనుల్లో ఉపాధి తరిగిపోతున్న కొద్దీ వ్యవసాయ కార్మికులు నిర్మాణ రంగాన్ని ఆశ్రయిస్తున్నారు

**వలసలు :**

వలసలు కూడా తమ ఆదాయాలను మెరుగు పరచుకోటానికి వ్యవసాయ కూలీలకు బాగా ఉపయోగపడుతున్నాయి. కాని సగటున 70 శాతం పనులు వారు స్వంత గ్రామాల్లోనే చేసుకుంటున్నారు. మిగిలిన 30 శాతం పనులు వలసల ద్వారా జరుగుతున్నాయి. వలస పోయే వారిలో పట్టణాలకు చేరే వారు అత్యధికంగా 51 శాతం ఉన్నారు. తరువాత ఇతర గ్రామాలకు (స్వంత జిల్లాలలోగాని, ఇతర జిల్లాలలోగాని) పనుల కొరకు వెళ్లేవారు 29 శాతం ఉన్నారు. 16 శాతం ఇతర రాష్ట్రాలకు, 3 శాతం ఇతర దేశాలకు (కార్మికేతర వర్గాలు) వలసపోతున్నారు. 7–8 కి.మీటర్ల పరిధిలో ఉన్న గ్రామాలకు వెళ్లటం ఎక్కువగా ఉంది. వారిలో కొందరు తెల్లవారుజామునే నిద్రలేచి, వంట పనులు పూర్తి చేసి, పొద్దుపొడవక ముందే బయలుదేరి రాత్రి 9–10 గంటలకు ఇళ్లకు చేరుతున్నారు. ఉత్తర కోస్తా, రాయలసీమ, ప్రకాశం జిల్లాలలో వలసలు చాలా ఎక్కువగా వున్నాయి. దక్షిణ కోస్తాలో వలసలు తక్కువగా వున్నాయి. వలసల వలన పిల్లల చదువులు దెబ్బతింటున్నాయి. వృద్ధులకు ఆలనాపాలనా లేకుండా పోతూఉంది. పని ప్రదేశాల్లో వాళ్ల ఇబ్బందులు వర్ణనాతీతం.

### వ్యవసాయ కార్మిక కుటుంబాల భూమి, ఆస్తులు, ఆదాయాలు :

వ్యవసాయ కూలీలకు దొరికే పనిదినాలు తక్కువ. వారి కూలిరేట్లు తక్కువ. కాబట్టి వారి సాలుసరి ఆదాయాలు కూడా బాగా

> **"భూస్వాముల కుటుంబాలు మొత్తం 6.59 శాతం మాత్రమే ఉన్నాయి. అంటే నూటికి ఏడు కుటుంబాల కూడా లేవు. అయినా మొత్తం భూమిలో వారి భూమి దాదాపు సగం ఉంది. అంటే మొత్తం భూమిలో వారి వాటా 49.67శాతం. మరొక వైపు వ్యవసాయ కార్మికులున్నారు. వారి భూములు, వారి ఆస్తిపాస్తులను పరిశీలించండి. మొత్తం కుటుంబాల్లో భూస్వాముల కుటుంబాలు 6.59 శాతం కాగా, వ్యవసాయ కార్మిక కుటుంబాలు 26.25 శాతం అంటే, భూస్వాముల కుటుంబాలకంటే 4 రెట్లు ఎక్కువగా ఉన్నాయి."**

తక్కువగానే ఉన్నాయి. వారు చేసే పనులన్నిటి నుండి వారికి వచ్చే సగటు సాలుసరి ఆదాయం దాదాపు 80వేలు (రు.79,559/-). ఈ లెక్కన వారి తలసరి, దినసరి ఆదాయం 55 రూపాయలు అవుతుంది. ఇది 2013 నాటి లెక్కైనా, ఇది చాలా తక్కువే. ఈ డబ్బుతో హైదరాబాద్‌లో 5టీలు కూడా రావు. వారు తిండి, బట్ట, ఇల్లు, వైద్యం, పిల్లల చదువు అన్నీ రోజూ సగటున ఈ 55 రూపాయలతోనే సర్దుకోవాలి. ఇది ఒక డాలరు కంటే తక్కువ. కాని తలసరి, దినసరి ఆదాయం కనీసం రెండు డాలర్లు ఉండాలంటున్నారు. ఆ మాత్రం ఆదాయం లేనివారిని, వారి లెక్క ప్రకారం దరిద్రులు అనాలి. రెండు డాలర్ల కంటే తక్కువ తలసరి, దినసరి ఆదాయం కలవారు దరిద్రులైతే, ఒక డాలరుకంటే తక్కువ, అంటే రు.55/-లు మాత్రమే తలసరి, దినసరి ఆదాయం కలవారు యేమౌతారు? వారిని నిష్ఠ దరిద్రులు అనాలి. అంత హీనమైన ఆర్థిక పరిస్థితిలో మన వ్యవసాయ కార్మికులు ఉన్నారు. వ్యవసాయ కార్మికుల సాలుసరి ఆదాయాలే కాదు, వారికున్న భూములు, వారికున్న మొత్తం ఆస్థిపాస్తులను భూస్వాములకున్న వాటితో పోల్చి చూద్దాము. ఆంధ్రప్రదేశ్‌లో భూస్వాములు, వ్యవసాయ కూలీలు : వారికున్న స్వంత భూములు, మొత్తం ఆస్థులు, శాతాల్లో...

**(శాతాల్లో)**

| తరగతి | కుటుంబాలు | స్వంతభూమి | ఆస్థి |
|---|---|---|---|
| భూస్వాములు (భూస్వాములు+ సాగులోలేని భూస్వాములు) | 6.59 | 49.67 | 53.87 |
| వ్యవసాయ కూలీలు | 26.25 | 1.88 | 3.8 |
| మిగిలిన తరగతులు | 67.16 | 48.45 | 42.3 |

భూస్వాముల కుటుంబాలు మొత్తం 6.59 శాతం మాత్రమే ఉన్నాయి. అంటే నూటికి ఏడు కుటుంబాల కూడా లేవు. అయినా మొత్తం భూమిలో వారి భూమి దాదాపు సగం ఉంది. అంటే మొత్తం భూమిలో వారి వాటా 49.67శాతం. మరొక ధృవంగా వ్యవసాయ కార్మికులున్నారు. వారి భూములు, వారి ఆస్తిపాస్తులను పరిశీలించండి. మొత్తం కుటుంబాలలో భూస్వాముల కుటుంబాలు 6.59 శాతం కాగా, వ్యవసాయ కార్మిక కుటుంబాలు 26.25శాతం అంటే, భూస్వాముల కుటుంబాలకంటే 4 రెట్లు ఎక్కువగా ఉన్నాయి. అయినా వారికున్న భూమి మొత్తం భూమిలో 1.88 శాతం మాత్రమే. దీని అర్థం మొత్తం భూమి 100 ఎకరాలు అనుకుంటే అందులో 7గురు భూస్వాములకు 50 ఎకరాలు ఉంటే 26 కుటుంబాలుగల వ్యవసాయ కూలీలందరికి కలిసి రెండు ఎకరాలు మాత్రమే ఉంటుందని అర్థం. మిగిలిన 48 ఎకరాలు, మిగిలిన తరగతులు, అంటే ధనిక రైతులు, మధ్య తరగతి, చిన్నకారు, సన్నకారు రైతులు, వృత్తిదారులు మొదలగు కుటుంబాలకు చెందుతుంది. దీనిని బట్టి వ్యవసాయ కూలీల వద్ద దాదాపు భూమిలేదనే చెప్పాలి. భూమిలేదు కాబట్టి బ్రతికి బట్ట కట్టాలంటే వారు భూస్వాములు, ధనిక రైతుల లాంటి వారిచ్చే పనుల మీద ఆధారపడి బ్రతకాలి. ఆధారపడి బ్రతకటమంటే దోపిడీకి తలవొగ్గినట్లే. అందుకని దోపిడీకి గురి కాకుండా ఉండాలంటే వారికీ బ్రతకటానికి అవసరమైనంత భూమి కావాలి. ప్రభుత్వాలు తలుచుకుంటే వీరికి తగినంత భూములు, వాటికి సాగునీరు ఇవ్వటం అసాధ్యమేమీ కాదు.

ఆస్థుల పరంగా చూస్తే భూస్వాముల వాటా ఇంకా ఎక్కువగా ఉంది. మొత్తం ఆస్థిలో భూస్వాముల ఆస్థి 53.87 శాతమైతే, వ్యవసాయ కూలీల భాగం 3.8 శాతం మాత్రమే. అంటే వీరికి భూములేకాదు, ఇతర ఆస్థులు, అంటే ఇళ్లు, వాహనాలు, నగలు,నట్రా కూడా దాదాపు లేవనే చెప్పాలి. (3.8%మాత్రమే.)

**వ్యవసాయ కార్మిక కుటుంబ వార్షికఆదాయాలు:**

| గ్రామం | వ్యవసాయ కార్మిక కుటుంబ వార్షిక ఆదాయం |
|---|---|
| జగ్గన్నపేట | 90693 |
| కట్టావారిపాలెం | 56880 |
| జయపురం | 91355 |
| బొబ్బనపల్లి | 98633 |
| కె.మార్కాపురం | 23871 |
| పట్టుపురం | 123352 |
| రేణుమాకులపల్లి | 45478 |
| కొలభీమునిపాడు | 67202 |
| **సగటు** | **79559** |

పై పట్టికను పరిశీలిస్తే వ్యవసాయ కార్మిక కుటుంబ సగటు ఆదాయం రు.79559/-లు అయినా, సగటు ఆదాయంకంటే తక్కువ వచ్చే గ్రామాలు చాలా వుంటాయి. పై గ్రామాల్లోనే సగం గ్రామాలలో వార్షికాదాయం చాలా తక్కువగా వుండటం గమనించవచ్చు. కర్నూలు జిల్లాలోని కె.మార్కాపురం గ్రామంలో వ్యవసాయ కార్మికుల వార్షికాదాయం రు.23871లు మాత్రమే.

**పోషకాహార లోపంతో తగ్గిపోతున్న వ్యవసాయ కార్మికుల ఆయుర్దాయం :**

వీరికి భూములు, ఇతర ఆస్థులు దాదాపు లేవని చూశాము. వారి సాలుసరి ఆదాయాలు కూడా బాగా తక్కువే. అవి సంవత్సరానికి 80వేలు మాత్రమే ఉన్నాయి. ఈ ఆదాయంతో వారు భూస్వాములు, ధనిక రైతుల లాగా పోషకాహారాన్ని తీసుకోగలుగుతున్నారా? చూద్దాము. ఇది ఆయా వర్గాల సాలుసరి ఆదాయాల మీద ఆధారపడి ఉంటుంది. భూస్వాముల సాలుసరి సగటు ఆదాయం రు.5,02,654లు ఉంటే వ్యవసాయ కార్మికులకు అది రు.79,559లు మాత్రమే ఉంది. అంటే భూస్వాముల ఆదాయంలో వ్యవసాయ కార్మికుల ఆదాయం 6వవంతు కంటే తక్కువ. ఇక్కడ మొత్తం ఆహారం కాకుండా, ఆహారంలో అత్యంత ప్రధానమైన భాగం ప్రోటీన్లు ఎవరెంత తీసుకుంటున్నారో చూద్దాము. కుటుంబానికి, నెలకు ప్రోటీన్ ఆహారం కొరకు చేసే ఖర్చు భూస్వాములకు రు.847/-లు, ధనిక రైతులకు రు.466/-లు ఉండగా, అది మధ్య తరగతి రైతులకు రు.257/-లు, సన్నకారు రైతులకు రు.294/

> **"70శాతంగా ఉన్న వ్యవసాయ కార్మికులు, సన్నకారు, చిన్నకారు, మధ్యతరగతి, కౌలురైతులలో 85శాతానికి పైగా సామాజికంగా వెనకబడ్డ యస్‌సి, యస్‌టి, బిసి తరగతులవారే ఉన్నారు. మిగిలినవారు పై కులాలకు సంబంధించినవారు. ఈ పోరాటాల్లో కులాలకతీతంగా ఎగువ కులాలతో పాటు అన్ని కులాలను ఏకం చేయవచ్చు. ఆ ఐక్యత కులవివక్షను, ఆధిపత్య కులాల దాడులను, వారి అణచివేతను ఇతరులతో కలిసి ఎదిరించి పోరాడే విశ్వాసాన్ని అణగారిన తరగతులకు ఇస్తుంది."**

-లుగా ఉంది. కాని వ్యవసాయ కార్మికులకు అది అందరికంటే తక్కువగా రు.236/-లు మాత్రమే ఉంది. అంటే వీరు భూస్వాములు తీసుకుంటున్న ప్రోటీన్ ఆహారంలో మూడవ వంతు మాత్రమే తీసుకుంటున్నారని అర్థం. అంటే వీరికి అందే పోషకాలు భూస్వాములకందే వాటిలో సగం కూడా లేవని అర్థమౌతుంది. కాబట్టే వీరి సగటు ఆయుర్ధాయం భూస్వాములు, ధనిక రైతులకంటే తక్కువగా ఉందని లెక్క తేలింది.

**ఈ మార్పులు మన ఉద్యమానికి ఉపయోగపడతాయా?**

వ్యవసాయ కార్మికుల ఆదాయంలో కూలిభాగం గణనీయంగా తగ్గిందని చూశాము. చిన్నకారు, సన్నకారు, కౌలురైతులే గాక మధ్య తరగతి రైతులకు కూడా వ్యవసాయంలో రాబడితగ్గి వారు కూడా కూలి పనుల మీద పెద్దగా ఆధారపడుతున్నారని, ఈ రైతులందరికి వారి వార్షికాదాయాల్లో కూలిభాగం దాదాపు సగం, సగానికి పైగా ఉందని చూశాము. కాబట్టి వ్యవసాయ కార్మికులతో పాటు ఈ పేద రైతులందరికి కూలి ఆదాయమే ప్రధాన జీవనాధారంగా తయారైంది. కూలిరేట్లు పెరగటం వీరందరికి ప్రయోజనకరమే. కాబట్టి కూలి సమస్యపై వీరందరిని ఏకం చేయవచ్చు. వీరంతా గ్రామాల్లో 70శాతానికి పైగా ఉన్నారు. ప్రాంతాలను బట్టి ఈ శాతంలో హెచ్చుతగ్గులు కూడా పెద్దగా లేవు. ఎందుకంటే దక్షిణ కోస్తాలో వ్యవసాయ కార్మికులు ఎక్కువ సంఖ్యలో ఉంటే ఉత్తరాంధ్రలో పేదరైతులు, వ్యవసాయేతర కార్మికులు (వ్యవసాయేతర కార్మిక కుటుంబాల నుండి స్త్రీలు, కుటుంబంలోని మిగిలిన సభ్యులు వ్యవసాయ రంగంలోనే కూలి పనులు చేస్తున్నారు.) ఎక్కువ సంఖ్యలోను, రాయలసీమలో పేదరైతులు ఉత్తరాంధ్రలో కంటే కూడా ఎక్కువగాను ఉన్నారు. ఈ 70శాతం కుటుంబాలను కూలిరేట్ల సమస్యపై కదిలించగలిగితే కూలి పోరాటాలను జయప్రదంగా నడపవచ్చు. 70 శాతం కుటుంబాలను కదిలించగలిగితే, ఊరంతా కదిలినట్లుగానే ఉంటుంది. వారికి విశ్వాసం ఏర్పడుతుంది. గతంలో వారిలో ఉన్న ఊగిసలాటలు తొలగిపోతాయి.

ఈ తరగతులను సామాజికంగా పరిశీలిస్తే కూలి పనులు చేసే 70శాతంగా ఉన్న వ్యవసాయ కార్మికులు, సన్నకారు, చిన్నకారు, మధ్యతరగతి, కౌలురైతులలో 85శాతానికి పైగా సామాజికంగా వెనకబడ్డ యస్‌సి, యస్‌టి, బిసి తరగతులవారే ఉన్నారు. మిగిలినవారు పై కులాలకు సంబంధించినవారు. ఈ పోరాటాల్లో కులాలకతీతంగా ఎగువ కులాలతో పాటు అన్ని కులాలను ఏకం చేయవచ్చు. ఆ ఐక్యత కులవివక్షను, ఆధిపత్య కులాల దాడులను, వారి అణచివేతను ఇతరులతో కలిసి ఎదిరించి పోరాడే విశ్వాసాన్ని అణగారిన తరగతులకు ఇస్తుంది. ఆర్థిక పోరాటాలతో సామాజిక పోరాటాలను అనుసంధానం చేయటానికి ఇది మంచి అవకాశాన్ని ఇస్తుంది.

పేదరైతులు కూడా పని వత్తిడి కాలంలో కూలీలను పెట్టుకొంటున్నారు. కూలిరేట్లు పెంచితే వారికి నష్టం రాదా అనే వాదన ఉంది. కూలిరేటు పెంచటం వలన పేదరైతులు, కౌలురైతులకు లాభమేగాని, నష్టం రాదు. ఎందుకంటే, పేదరైతులు కూలీలను పెట్టుకోవటమే కాదు, అంతకంటే ఎక్కువగా వారు ఇతరులకు కూలికి పోతున్నారు కూడా. ఎవరికైతే కూలికి పెట్టుకునే పని దినాలకంటే, కూలికిపోయే పని దినాలు ఎక్కువగా ఉంటాయో వారంతా కూలిరేట్లు పెరిగితే లాభపడతారు. ఇప్పుడున్న పరిస్థితులను పరిశీలిస్తే వీరు పెట్టుకునే పనిదినాలకంటే, వీరు కూలికిపోయే పని దినాలే చాలా ఎక్కువగా ఉన్నాయి. కాబట్టి కూలిరేట్ల పెరుగుదల వల్ల పేదరైతులు, కౌలురైతులు నష్టపోయే అవకాశమే లేదు.

**వర్గపోరాటమే ఆయుధంగా ముందుకు సాగాలి :** కూలిరేట్ల పెంపుదల కోసం చేసే ఆందోళనతో పేదల చుట్టూ ఉద్యమాన్ని నిర్మించాలనే మన కర్తవ్యం కూడా నెరవేరుతుంది. ఎందుకంటే కౌలురైతులతో సహా పేదరైతులంతా ఈ 70శాతంలోనే ఉన్నారు. అంతేకాదు, వ్యవసాయక విప్లవాన్ని జయప్రదం చేయాల్సిన వర్గాలన్నీ ఇందులోనే ఉన్నాయి. జనతా ప్రజాతంత్ర విప్లవానికి వీరి ఐక్యత ప్రధానమన్న విషయం మనమంతా ఎరిగినదే. కూలిరేట్లు పెరగాలనే కూలీలు, పేదరైతులూ వీరిలోనే ఉన్నారు. కౌలురేట్లు తగ్గించాలి, వ్రాతపూర్వక కౌల్లు కావాలి, పేద రైతులతో పాటు ప్రభుత్వ రాయితీలన్నీ మాకూ వర్తింపచేయాలి అని కోరే కౌలురైతులంతా ఈ 70శాతంలోనే ఉన్నారు. కాబట్టి కూలిరేట్లతో పాటు కౌలురైతుల డిమాండ్లు, సన్నకారు, చిన్నకారు, మధ్యతరగతి రైతుల డిమాండ్ల పై ఐక్యపోరాటాలు చేయవచ్చు. ఈ పోరాటాలను అంతిమంగా భూములు పంచాలి అనే స్థాయికి తీసుకపోవచ్చు. కాబట్టి గ్రామీణ పేదలందరిని కులాలకు, మతాలకు అతీతంగా ఆర్థిక, సామాజిక పోరాటాల్లో ఐక్యం చేయటం గ్రామాల్లో మనం తిరిగి కాలుమోపటానికి అవకాశాన్ని కల్పిస్తుంది. వర్గపోరాటమే ఆయుధంగా మనం ముందుకు పోవచ్చు. ❋


## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం,**

**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

మహిళా సమస్యలు

# గృహశ్రమ నుండి మహిళ విముక్తి కావాలి



రచయిత కెనడాకు చెందిన ఫెమినిస్టు, కార్మిక సమస్యలపై పనిచేసే కార్యకర్త

**మార్గరెట్ బెన్‌స్టీన్**

**(మార్గరెట్ బెన్‌స్టైన్ రాసిన ఈ వ్యాసం మంత్లీరివ్యూ 1969 సెప్టెంబరు సంచికలో ప్రచురించారు. తిరిగి 2019 సెప్టెంబరు సంచికలో పునర్ముద్రించారు)**

"మనం నివసిస్తున్న సంక్లిష్టమైన సమాజంలో మిగిలిన అన్ని విషయాలలోలాగే మహిళల స్థానం కూడా ఆర్థిక పునాది పై ఆధారపడి ఉంటుంది." – ఎలీనార్ మార్క్స్, ఎడ్వర్డ్ ఎవెలింగ్.

సమాజ వర్గ నిర్మాణాన్ని విశ్లేషించే క్రమంలో 'మహిళల సమస్య' సర్వసాధారణంగా మరుగున పడిపోతుంటుంది. ఎందుకంటే ఒక వైపు ఉత్పత్తి సాధనాలతో ఉన్న సంబంధం ద్వారా వర్గం నిర్ణయించబడుతుందని నిర్ధారిస్తాం. మరో వైపు మహిళలకు ఉత్పత్తి సాధనాలతో ప్రత్యేక సంబంధం లేదని భావిస్తుంటాం. మహిళలు అన్ని వర్గాలలోనూ ఉంటారని –శ్రామిక మహిళలు . మధ్యతరగతి మహిళలు వగైరా– అర్థం. మహిళల స్థానం పురుషుని కంటే తక్కువన్నది సుస్పష్టం. అయితే ఈ అసమానత్వ సమస్య సాధారణంగా సామాజికీకరణ, మనస్తత్వ శాస్త్రం, మానవ సంబంధాలు, వివాహ వ్యవస్థలో మహిళల పాత్ర వగైరా విశ్లేషణల చర్చలలో కలిసిపోతుంది. అయితే ఇవే ప్రధానాంశాలా? ఇవి ప్రధానమే అయినా మహిళ సమాజంలో రెండో స్థానంలో ఉండడానికి ఆర్థిక అంశాలే మౌలికం. మహిళలు ఒక సమూహంగా ఉత్పత్తి సాధనాలతో నిర్దిష్ట సంబంధం కలిగి ఉన్నారు. దీనిని రుజువు చేయవచ్చు. పురుషునికి ఉత్పత్తి సాధనాలతో ఉన్న సంబంధం కన్నా ఇది భిన్నమైనది. ఉత్పత్తి సాధనాలతో ఉన్న ఈ సంబంధం తరువాతే మహిళ వ్యక్తిగత, మానసిక సంబంధాల విషయాలు వస్తాయి. మొదటి విషయంలో మార్పులు తేడానికి రెండో విషయంలో మార్పులు అవసరం (అవే సరిపోవు). మహిళలకి ఉత్పత్తి సాధనాలతో నిర్దిష్టమైన సంబంధాలు ఉన్నాయని అంగీకరించినట్లయితే సహజంగానే మహిళల పరిస్థితి విశ్లేషణ సమాజంలోని వర్గ విశ్లేషణలో భాగమవుతుంది.

పెట్టుబడిదారీ సమాజంలో ఉత్పత్తి సాధనాలు కలిగిన వారికీ, కేవలం తమ శ్రమని అమ్ముకునే వారికీ మధ్య ఉన్న సంబంధమే ఈ చర్చకు పునాది. ఎర్నెస్ట్ మండెల్ ఈ విధంగా చెప్పాడు "సంక్షిప్తంగా చెప్పుకోవాలంటే ఉత్పత్తి సాధనాలు కార్మికులకు అందుబాటులో లేకపోవడం, లేదా సరుకుల తయారీ సర్వసాధారణమైన సమాజంలో తన జీవనానికి కార్మికుడు శ్రమశక్తిని అమ్ముకొనే పరిస్థితి ఉంటుంది. తన శ్రమశక్తికి బదులుగా కార్మికుడు వేతనాన్ని పొందుతాడు. ఇది అతనికి, అతని కుటుంబ అవసరాలకు కావలసిన వినిమయ వస్తువులు కొనుక్కొనే అవకాశం కల్పిస్తుంది.

ఇది వేతన కార్మికునికి నిర్వచనం. ఈ విశ్లేషణతో కార్మికుడికి అతని పనితో, ఆ పని వలన జరిగిన ఉత్పత్తితో, అలాగే సమాజంలోని పరిస్థితి అంతటితోనూ సంబంధముందని చెప్పవచ్చు. దీనినే సూక్ష్మంగా పరాయీకరణ అని అంటుంటాము. అయితే ఈ నిర్మాణాత్మక నిర్వచనంతో అతని అవసరాలెంత లేదా అతని అవసరాలలో ఎంతవరకు అతను పొందగలుగుతున్నాడు వగైరా వినిమయ స్థాయిని నిర్ధారించలేము.

మహిళల విషయానికి వచ్చేసరికి ఇటువంటి నిర్వచనమేదీలేదు. అయితే మహిళకు సమాజంలో రెండో తరగతి పౌరుల స్థాయి ఎందుకున్నదని మొదట మనం విశ్లేషించడం కంటే, పెట్టుబడిదారీ సమాజంలో సామూహికంగా మహిళల పరిస్థితి ఎలా ఉందనేది చర్చించటం అవసరం. ఎందుకంటే ఈ భౌతిక పరిస్థితుల మీదేఉపరితల నిర్మాణం ఉంటుంది. మండేల్ వ్రాసిన ఒక పేరాలో ఆసక్తిదాయకమైన నిర్వచనం ఉంది:

సరుకు... ప్రత్యక్షంగా ఉపయోగించడానికి కాక మార్కెట్లో అమ్మడానికే ఉత్పత్తి చేయబడింది, ప్రతి సరుకుకు ఉపయోగపు విలువ, మారకపు విలువ రెండూ ఉండాలి.

సరుకుకు ఉపయోగపు విలువ లేకపోతే దానిని ఎవరూ కొనరు. అందువలన ఉపయోగం లేని సరుకు అమ్మకం కాదు. అదొక నిరుపయోగమైన ఉత్పత్తిగా మిగిలి పోతుంది. ఉపయోగపు విలువ లేకపోవడం వల్లనే దానికి మారకం విలువ కూడా ఉండదు.

అదే సమయంలో ఉపయోగపు విలువ ఉన్న ప్రతి సరుకుకు తప్పనిసరిగా మారకపు విలువ ఉండాలని లేదు. సరుకు ఉత్పత్తి అయిన సమాజంలో సరుకుల మారకం సర్వసాధారణంగా జరుగుతున్నపుడే సరుకుకు మారకపు విలువ ఉంటుంది.

పెట్టుబడిదారీ సమాజంలో సరుకు ఉత్పత్తిలో గణనీయమైన అభివఅద్ధి జరిగింది. మానవ చరిత్రలోనే మొదటిసారిగా ఇప్పటి సమాజంలో ఉత్పత్తిలో అధిక భాగం సరుకులుగా మారాయి. అయితే పెట్టుబడిదారీ సమాజంలో కూడా అన్ని సరుకులు మారకం సరుకులన్నది నిజం కాదు. సాధారణ ఉపయోగ విలువ ఉన్న సరుకులు ఇప్పటికీ రెండు రకాలుగా ఉన్నాయి. మొదటి రకంలో రైతులు తమ స్వంత వినిమయానికి ఉత్పత్తి చేసిన చోటే ప్రత్యక్షంగా ఉపయోగించే సరుకులన్నీ ఉన్నాయి. రెండో రకంలో కొన్ని సరుకులు కానివి, సాధారణ ఉపయోగపు విలువగలవి –ఇళ్లలో తయారు చేసిన వస్తువులు. మానవశ్రమ చెప్పుకోదగ్గ స్థాయిలోనే ఈ తరహా గఅహాలలో జరిగే ఉత్పత్తికి వినియోగించబడుతున్నదన్నది వాస్తవం. అయినప్పటికీ దానిని వినిమయ వస్తూత్పత్తిగానే పరిగణిస్తున్నారు గాని సరుకుగా పరిగణించడం లేదు. ఒక సూప్ తయారు

చేసినా, ఒక జుబ్బాకి గుండీ కుట్టినా అది ఉత్పత్తిలో భాగమే. అయితే ఈ ఉత్పత్తి అయిన సరుకు మారకం కోసం మార్కెట్‌కు రాదు.

జరిగిన ఉత్పత్తి సరుకు స్వరూపం తీసుకోవడం, ఆ తరువాత క్రమబద్ధీకరించబడటం, సాధారణీకరించబడటం, పురుషులు శ్రమచేసే విధానాన్ని, సమాజ నిర్మాణాన్ని తీవ్రంగా మార్చివేసింది.

చివరి పేరాలో చెప్పినది ఖచ్చితంగా సరైనదన్న అంశాన్ని మండేల్ కూడా గమనించలేదు. సరుకు ఉత్పత్తి ఆరంభం కాగానే పురుషులు శ్రమ చేసే విధానం మారిపోయింది. పెట్టుబడిదారీ సమాజంలో (ఆ మాటకొస్తే ఇప్పటి సోషలిస్టు సమాజాలలో కూడా) ఇళ్లలో చేసే శ్రమలో అత్యధిక భాగం ఇప్పటికీ మార్కెట్ వ్యవస్థకి ముందున్న స్థాయిలోనే ఉంది. ఈ పనే మహిళలకి కేటాయించబడింది. ఈ వాస్తవం నుండే మనం 'మహిళ' నిర్వచనానికి మూలాలు వెతక గలం.

సమాజానికి అవసరమైన ఉత్పత్తిలో ఇంట్లో శ్రమ, పిల్లల పెంపకాన్ని కలుపుకుంటే ఈ శ్రమ పరిమాణం చాల ఎక్కువ ఉంటుంది. అయినప్పటికీ సమాజం సరుకుల ఉత్పత్తి ఆధారంగా ఉన్నందువలన, వాణిజ్య క్రమంలోకి గాని, మార్కెట్ వరకు గాని ఈ ఉత్పత్తి రానందువలన, ఈ శ్రమ సాధారణంగా 'నిజమైన' శ్రమగా గుర్తించబడటం లేదు. ఇది పెట్టుబడిదారీ సమాజానికి ముందున్న స్థితి. ఇంటిపని 'ఆడవారి' పని అని ప్రత్యేకంగా అప్పచెప్పడం అంటే ఈ సమూహం అంతా ఉత్పత్తితో 'పురుషులకి' ఉన్న సంబంధానికి భిన్నమైన సంబంధం కలిగి ఉన్నదన్న మాట. అందువలన మహిళలను గృహానికి, కుటుంబానికి అవసరమైన సాధారణ ఉపయోగ విలువగల సరుకులను తయారు చేసేవారిగా తాత్కాలికంగా నిర్వచించుకుందాం.

ఈ పనులు చేసే బాధ్యత మగవారు తీసుకోరు కాబట్టి ఈ తేడాలోనే రెండు సమూహాల మధ్య బేధం ఉంది. మహిళలు సరుకుల ఉత్పత్తి నుండి మినహాయించబడలేదన్నది గమనించండి. వేతన శ్రమలో వారుకూడా భాగస్వాములే. కానీ నిర్మాణ పరంగా ఈ భాగంలో వారికి ఏ బాధ్యతా లేదు. వారిందులో చేసే శ్రమ అస్థిరమైనది.

> **"మగవారు ఉత్పత్తికి బాధ్యులు. వారు సూత్రప్రాయంగా ఇంటిపనిలో బాధ్యులు కారు. ఉదాహరణకు వారు ఇంటి పనిలో భాగస్వాములు కావటం అవమానంగాను, మగతనానికి భంగంగాను, ఆరోగ్యానికి హాని కలిగించేదిగాను ప్రత్యేకంగా చెప్పబడుతుంది. (1969 జనవరిలో వాంకోర్ సన్ పత్రికలో మొదటి పేజీలో బ్రిటన్‌లోని పురుషులు తమ ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడవేసుకోడానికి కారణం వారు అత్యధిక కాలం ఇంటిపని చేయవలసిరావడం అనే ఒక కథనం వెలువడింది)"**

కానీ మగవారు ఉత్పత్తికి బాధ్యులు. వారు సూత్రప్రాయంగా ఇంటిపనిలో బాధ్యులు కారు. ఉదాహరణకు వారు ఇంటి పనిలో భాగస్వాములు కావటం అవమానంగాను, మగతనానికి భంగంగాను, ఆరోగ్యానికి హాని కలిగించేదిగాను ప్రత్యేకంగా చెప్పబడుతుంది. (1969 జనవరిలో వాంకోర్ సన్ పత్రికలో మొదటి పేజీలో బ్రిటన్‌లోని పురుషులు తమ ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడవేసుకోడానికి కారణం వారు అత్యధిక కాలం ఇంటిపని చేయువలసిరావడం అనే ఒక కథనం వెలువడింది.)

మహిళను నిర్వచించే ఈ భౌతిక మూలాలలోనే మహిళను చులకనగా చూడడానికి కారణం ఇమిడి ఉంది. డబ్బే విలువలను నిర్ధారించే సమాజంలో మహిళలు డబ్బుతో సంబంధం లేని ఆర్థిక చట్రంలో పనిచేస్తున్నారు. వారి పనికి డబ్బులు రావు. కాబట్టి వారి పనికి విలువ లేదు. డబ్బురాదు కాబట్టి నిజానికది నిజమైన పని కానే కాదు. విలువలేని పనిచేసే మహిళలు, విలువగల డబ్బులకు పనిచేసే పురుషులతో సమానంగా చూడబడతారని అనుకోలేము. విధానపరంగా చూస్తే మహిళల స్థితి సరుకుల ఉత్పత్తికి ముందున్న బానిసలూ, రైతుల పరిస్థితే.

"ఆధునిక పారిశ్రామిక సమాజంలో మహిళలు చేసే పని మొత్తం ఆర్థిక వ్యవస్థలో చాలా తక్కువ. మనిషి తన పనిద్వారా సహజమైన పరిస్థితులను మారుస్తాడు. కొత్త సమాజాన్ని నిర్మిస్తాడు. ఉత్పత్తిలో విప్లవం వచ్చేవరకు పురుష ప్రపంచ చట్రంలోనే మహిళల శ్రమస్థితి నిర్ణయించబడుతుంది" అని జూలియట్ మైకేల్ ఈ మధ్యే వ్రాసిన ఒక పరిశోధనా గ్రంథంలో పేర్కొన్నాడు. మహిళలు ఆర్థిక వ్యవస్థలో తక్కువ పని చేస్తారని ప్రకటన చేయడం అంటే విషయాన్ని ఏమాత్రం విశ్లేషణ చేయకపోవడమే. మహిళల పనికి పురుషుల పనికి తేడా ఉన్నది. మహిళల పని తక్కువకాదు. కానీ ఆ పనికి వేతనం లేదు. అందువలన ఆ పని లెక్కలోకి రావడం లేదు. అందులోనే ఆమె మరోచోట "గృహ శ్రమ ఈ రోజుకీ ఉత్పాదక శ్రమపరిమాణంలో చూస్తే చాల ఎక్కువ." అన్నారు. దీనిని నిరూపించడానికి కొన్ని గణాంకాలను కూడా ఇచ్చారు. స్వీడన్‌లో మహిళలు ఏడాదికి 234 కోట్ల గంటలు ఇళ్లలో పనిచేస్తే పరిశ్రమలలో129 కోట్ల గంటలు పనిచేస్తారు. ఛేజ్ మన్ హట్టన్ బ్యాంకు ఒక మహిళ వారంలో 99.6 గంటల పనిచేస్తుందని అంచనా వేసింది.

అయితే మైఖేల్ మౌలికమైన ఆర్థిక కారణాలకు పెద్దగా ప్రాధాన్యతను ఇవ్వలేదు (నిజానికి మార్క్సిస్టులను అనవసరమయిన ఆర్థికశాస్త్రవేత్తలంటూ ఎద్దేవా చేశారు). వెంటనే ఉపరితల కారణాల విశ్లేషణకి వెళ్ళిపోయారు. ''పారిశ్రామిక అభివృద్ధి జరిగినా అది మహిళలకు స్వేచ్ఛను ఇవ్వలేదు'' అని గుర్తించారు. "ఆమె గమనించని విషయం, ఇప్పటి వరకు ఇంటిపని పారిశ్రామికీకరించ బడలేదు. ఫ్రెడరిక్ ఏంగెల్స్ సూచించినట్టు" మహిళలకు స్వేచ్ఛ రావాలంటే మొదటిగా మహిళలు చేసే వంటపని సమాజ పరిశ్రమగా (సామూహిక వంటశాలలు) మారాలి. ఇది ఆధునిక పారిశ్రామికీకరణలో సాధ్యపడదు. ఎందుకంటే ఈ విధానంలో బడా పరిశ్రమలే ఉంటాయి. ఇందులో పెద్ద ఎత్తునే ఉత్పత్తి సాధ్యపడుతుంది. కానీ పెద్ద పరిశ్రమలలో కుటుంబాలకు అవసరమైన ప్రత్యేకతలు గల ఉత్పత్తి సాధ్యపడదు. దానితో మహిళలకు తాము చేసే పని నుండి విముక్తి రాదు. మహిళలకు స్వేచ్ఛ రావాలంటే చిన్న చిన్న పరిశ్రమలుండాలి. వాటి ఉత్పత్తిలో మహిళలు ఎక్కువ సంఖ్యలో భాగస్వాములు కాగలగాలి. ఇవి వ్యక్తిగత ఇంటి

> **“ నయా ఉదారవాద విధానంలో మహిళలకి ఇంటిపని బాగా తగ్గిపోయిందన్న వాదన ఉంది. అది నిజమే అయినా వ్యవస్థా గతంగా అప్రస్తుతం. పనిమనుషులను పెట్టుకోగల స్తోమత ఉన్న ధనికులకు తప్ప మిగిలిన మహిళలకు ఇంటి పని, పిల్లల పెంపకం, భర్త ఆలనా పాలనా చూడడంలో ఏమాత్రం శ్రమ తగ్గటం లేదు. పిల్లలు లేని ఒక వివాహిత మహిళ బహుశా వారానికి 15 నుంచి 20 గంటలు ఇంటిపని చేస్తుంది. అదే చిన్న పిల్లలున్న మహిళయితే డెబ్బై నుండి ఎనబై గంటలు ఇంటిపని చేస్తుంది. ”**

పనిని సమాజ పరిశ్రమలుగా మార్చగలవు. ఆ తరువాతి పేరా లోనే “మహిళ సమాజ ఉత్పత్తి క్రమం నుండి దూరంగా ఉంది. ఇంటి పనికి పరిమితమైనంత కాలం వారు స్వేచ్ఛను సాధించలేరు. పురుషులతో సమానం కాలేరు” అని రాశారు. మైఖేల్ పరిగణన లోనికి తీసుకోని అంశం ఏమిటంటే, మహిళలు ఉన్న పరిశ్రమలలో చేరకపోవడం అన్నది ప్రధానమైన సమస్య కాదు. సమస్య అంతకంటే సంక్లిష్టమైనది. ఇళ్లలో జరిగే వ్యక్తిగత ఉత్పత్తిని సామూహిక ఉత్పత్తిలో భాగంగా పరిగణించక పోవడం.

ఉత్తర అమెరికాలో చాలా మందికి ఇంటి పనిని “ప్రజా ఉత్పత్తికేంద్రాలు” గా గుర్తించడం అంటే ‘సాహసోపేతమైన, కొత్త ప్రపంచం’ నవల (బ్రేవ్ న్యూవరల్డ్ –ఒక ఊహాజనిత ప్రపంచం) లోని చిత్రాలు గుర్తుకొస్తుంటాయి. ఒక పెద్ద సంస్థ, ఒక అనాథ శరణాలయం, ఒక సైనిక శిబిరం – లాంటి వాటిగా మన ఇల్లు మారిపోయి, వాటిలో మనం బలవంతంగా ఉంచబడతామనిపిస్తుంటుంది. అందువలన రేఖామాత్రంగా సూక్ష్మంగా, ఇంటి పనినిక్రమ పద్ధతిలో ఎలా పారిశ్రామిక్రణ చేయవచ్చో వివరించ దలిచాను.

పారిశ్రామికరణకు ముందు ఉత్పత్తి చిన్న పరిశ్రమలలో జరిగేది. ఎక్కువ చోట్ల జరిగేది. సాధారణం ఈ పరిశ్రమలన్నీ బంధువుల పరిధి లోనే జరిగేవి. అవి కూడా బహుళార్ధ సాధకాలుగా ఉండేవి. ఆయా మతపర, మానసిక వికాస, విద్యాపర, లైంగిక కార్యక్రమాలు ఆర్థికాంశాలతో మిళితమై ఉండేవి. ఆ పరిస్థితులలో కేవలం ఆర్థిక అంశాలే కాకుండా వ్యక్తికి నచ్చిన గుణాలుగలవి, వ్యక్తుల గౌరవం పెంచేవి తయారు చేయడం సాధ్యపడేది. ఉదాహరణకి బంధువర్గం పట్ల సరైన నడత కలిగి ఉండడం, బాధ్యతలను నిర్వర్తించడం వగైరా. ఈ ఉత్పత్తులు సహజంగానే మారకానికి పనికిరావు.

సరుకు మారకం మాత్రమే ప్రధానమైన అంశం అయినప్పుడు, సరుకు ఉత్పత్తి సమర్ధతను పెంచుకోవాలి. ఆ సమర్ధత ఉత్పత్తి పారిశ్రామికీకరించబడడంతో మాత్రమే సాధ్య పడుతుంది. అంటే బంధువర్గాన్ని మాత్రమే ఆధారం చేసుకుని ఉత్పత్తి చేయడం ఇక్కడ సాధ్యపడదు. ఒక పెద్ద ఉత్పత్తి యూనిట్, పదే పదే ఒకే పని తిరిగి చెయ్యాల్సిన అవసరం లేనిది, దాని స్థానాన్ని ఆక్రమించింది. ఆర్థికం ఒక్కటే దాని పని. ఆర్థిక నైపుణ్యం ద్వారా మాత్రమే ఇక్కడ గౌరవం, గుర్తింపు దొరుకుతుంది. ఉత్పత్తి వ్యవస్థీకఅతం, మరింత సమర్ధవంతం చేయబడింది. మరింతగా ప్రజలకి అందుబాటులో ఉండే విధంగా మార్చబడింది –సామాజిక అవసరాలలో అంతర్భాగం చేయబడింది. మనిషి ఉత్పాదక సామర్ధ్యం అత్యధిక స్థాయిలో పెంచబడింది. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఇటువంటి సామాజిక ఉత్పత్తిశక్తులను కేవలం వ్యక్తిగత లాభాలకు వినియోగించడం జరుగుతున్నది.

పై అంశాన్ని మనం ఇంటి పనికి, పిల్లల పెంపకానికి అన్వయించుకుంటే, పారిశ్రామికీరణకి ముందున్నట్టు రైతుల ఇళ్ళలోలాగా, కుటీర పరిశ్రమలలో లాగా, ప్రతి కుటుంబం, ప్రతి ఇల్లూ ఒక ఉత్పత్తి యూనిట్‌గా గుర్తించబడాలి. ముఖ్యమైన స్వరూపం స్పష్టం. పదే పదే ఒకే పని చేయగలగడం, బంధువులు కీలకంగా ఉండడం, పని ప్రైవేటు స్వభావం కలిగి ఉండడం అన్నిటికన్నా ముఖ్యం. ( మిగిలిన స్వభావాలు కూడా పరిశీలించడం ఆసక్తిదాయకంగా ఉంటుంది: కుటుంబ అవసరాలకు తగట్టు బహుళార్ధకంగా ఉండడం, ఆర్థిక సంపాదనా నైపుణ్యమే మహిళలకి ఉండాల్సిన ప్రధానమైన లక్షణం కాకపోవడం వగైరా). ఉత్పత్తులు భారీస్థాయిలో జరగడం అన్నది ఈ విభాగంలో ఇంకా వ్యవస్థీకఅతం కాలేదు.

పారిశ్రామికీకరణ జరగడం మానవులకు ప్రయోజనకరం. దోపిడీ, అమానుషత్వం పెట్టుబడిదారీ వ్యవస్థతోనే ముడిపడి ఉంటాయి కాని పారిశ్రామికీకరణతో కాదు. వ్యక్తిగత గఅహశ్రమను సామాజిక పరిశ్రమగా మార్చాలని పెట్టుబడిదారీ సమాజంలో కోరడానికి, సోషలిస్టు సమాజంలో కోరడానికి బేధం ఉంది. సోషలిస్టు సమాజంలో ఉత్పత్తి శక్తులు మానవ సంక్షేమం కోసం పని చేస్తాయి. ఫలితంగా స్వేచ్ఛ వస్తుంది. అప్పుడు మనం ఉత్పత్తి సమాజపరం కావాలని కోరవచ్చు.

ఈ నిర్వచనాలు సాంకేతికత కోసం కాదు. పారిశ్రామికీకరణలో రెండు ముఖ్యమైన పార్శ్వాలు ఉన్నాయని, వాటి మధ్య తేడాలు ఉన్నాయని చెప్పడానికే. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఇంటి పనిని పారిశ్రామికీకరించడం అంటే బారక్స్ (సైనికులు కలిసివుండే శిబిరాలు)లలో ఉండినట్టు ఉండవలసి వస్తుందని భయపడటం సహజమే. కానీ ఉత్పత్తి సామాజికీకరించబడి లాభాపేక్ష, దాని అనుంగు పరిచారకుడు పరాయీకరణ చెందిన శ్రమని తొలగిస్తే, పారిశ్రామిక సమాజంలో ఇంటిపనిని పారిశ్రామికీకరించడం వలన ఉత్పత్తిలో మంచి ఫలితాలు వస్తాయన్న విషయంలో సందేహం అవసరం లేదు. అంటే ఇప్పటి చిన్న కుటుంబాలలో లభ్యమయే దానికన్నా మంచి తిండి, మెరుగైన పరిసరాలు, మరింత తెలివైన, ప్రేమతో కూడిన పిల్లల పెంపకం వగైరాలను అందించటం జరుగుతుంది.

నయా ఉదారవాద విధానంలో మహిళలకి ఇంటిపని బాగా తగ్గిపోయిందన్న వాదన ఉంది. అది నిజమే అయినా వ్యవస్థాగతంగా అప్రస్తుతం. పనిమనుషులను పెట్టుకోగల స్తోమత ఉన్న ధనికులకు తప్ప మిగిలిన మహిళలకు ఇంటి పని, పిల్లల పెంపకం, భర్త ఆలనా పాలనా చూడడంలో ఏమాత్రం శ్రమ తగ్గటం లేదు. పిల్లలు లేని ఒక వివాహిత మహిళ బహుశా వారానికి 15 నుంచి 20 గంటలు ఇంటిపని చేస్తుంది. అదే చిన్న పిల్లలున్న మహిళయితే డెబ్బై నుండి ఎనభై గంటలు ఇంటిపని చేస్తుంది. (పిల్లల పెంపకం ఒక వఅత్తి అని అనడానికి కొంత వ్యతిరేకత ఉంది. శ్రమ అంతర్గతంగా ఉంటే మారకం జరిగే

సమయంలో ఉత్పత్తిలోని ఉపయోగపు విలువ స్పష్టంగా కనపడుతుంది. పిల్లలను చూసుకునే వారు తీసుకునే వేతనాలు, నర్సులు తీసుకునే వేతనాలు, పిల్లల సంరక్షణ కేంద్రాలు చేసే వసూళ్ళు, లేదా ఉపాధ్యాయులు పాఠాలు చెప్పేందుకు తీసుకునే ఫీజులు వగైరా. ఒక ఆర్థికవేత్త హాస్యానికన్నట్టు ఒక పురుషుడు కనక తన పనిమనిషిని పెళ్లి చేసుకుంటే అతను జాతి ఆదాయాన్ని తగ్గించినవాడవుతాడు. ఎందుకంటే పనిమనిషికి జీతం ఇవ్వడం వలన జాతీయ ఆదాయంలో ఆ మొత్తం చేరుతుంది. అదే భార్యకి జీతం ఇవ్వడు కాబట్టి ఆ మేరకు జాతీయ ఆదాయం తగ్గుతుంది.) ఇంటి పని కనీస వేతనానికి కుదించినా చాల ఖరీదు అవుతుంది. తక్కువ ఆదాయంకల కుటుంబాలకి మరింత శ్రమ అవసరమవుతుంది. ఏమయినప్పటికీ ఇంటిపని వ్యవస్థాగతంగా ఎటువంటి మార్పుకులోను కాదు –వ్యక్తుల అధీనంలోనే ఉంటుంది.

కుటుంబం యొక్క ముఖ్యమైన ప్రయోజనం, చిన్నతనం నుండి మనకి చెప్పినది, ప్రజలంతా అంగీకరించేది, కూడా భావావేశాలను సంతఅప్తి పరచడం: దగ్గరి బంధాలు, జాతి పరమైన, సురక్షితమైన సంబంధాలు. సమాజంలో ఇటువంటి సంబంధాలు ఇతరత్రా కూడా లభ్యమవుతాయి. కానీ ఇతర అన్ని బంధాలకంటే కుటుంబబంధం గొప్పది. మానసిక ప్రశాంతతని కలగచేయుటంలో కుటుంబానిదే ప్రధానపాత్ర. రెండో ప్రధానమైన బాధ్యత, పైన చర్చించినది, పూర్తిగా ఆర్థిక కర్తవ్యాలు నెరవేర్చడానికి కుటుంబానికి అవసరమైన స్థిరత్వాన్ని కలగజేయడం. వేతనం తెచ్చుకునే జీతగాడు తనని తాను పోషించుకోవడమే కాక తన శ్రమతో అమ్మని, భార్యని, పిల్లలను కూడా పోషిస్తాడు. ఒక మనిషి జీతం ఇద్దరి శ్రమని కొంటుంది. ఈ కీలకాంశం ప్రాధాన్యత కుటుంబం విడాకులతో విచ్ఛిన్నం అయినప్పుడు స్పష్టంగా కనపడుతుంది. పిల్లలు ఉన్నప్పుడు కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకోవడం ప్రధానమైన అంశంగా మారుతుంది. పురుషుడు, స్త్రీ శ్రమకి కూడా చెల్లించవలసి వస్తుంది. అతని వేతనం రెండు కుటుంబాల పోషణకు సరిపోదు. అతని మొదటి కుటుంబ పోషణ చెయ్యాల్సిన కారణంగా భావావేశాలు సంతఅప్తి పరచుకోడాన్ని అతడు త్యాగం చేయవలసి వస్తుంది. అంటే కుటుంబం యెడల

**"ఆర్థిక వ్యవస్థలోని పారిశ్రామిక రంగంలో మహిళల చరిత్ర కేవలం పారిశ్రామిక అవసరాలపై ఆధారపడి ఉంది. మహిళలు అవసరానికి ఉపయోగించుకొనే పెద్ద సైన్యంగా పనికి వస్తారు. శ్రామికులు తక్కువగా ఉన్నప్పుడు (పారిశ్రామికీకరణ జరిగిన తొలిరోజుల్లో, ప్రపంచ యుద్ధ కాలంలో) మహిళలు శ్రమశక్తిలో ప్రధాన భాగం అవుతారు. శ్రామిక శక్తి అదనంగా ఉన్నప్పుడు 'ఇంటికి దీపం ఇల్లాలు' అనడం మళ్ళీ మొదలవుతుంది."**

ఆర్థిక బాధ్యతలకు భావావేశాలకు వైరుధ్యం ఏర్పడినప్పుడు ఆర్థిక బాధ్యతలకు ప్రాధాన్యత ఇవ్వవలసి ఉంటుంది. భావావేశాలు తీర్చడం ప్రధాన బాధ్యత అని చెప్పే సమాజంలో ఇదీ కుటుంబం నిర్వహించేది.

పెట్టుబడిదారీ సమాజంలో ఒక ఆర్థిక యూనిట్‌గా చిన్న కుటుంబం స్థిరీకరించే గొప్ప శక్తి గలది. ఇంటిలో ఉత్పత్తి చేసిన దానికి భర్త లేదా తండ్రి సంపాదన నుండి ఆలంబన లభిస్తుంది గాబట్టి పురుషుడు పనిని ఆపడానికి ఉండే అవకాశాలు తక్కువ అవుతాయి. అతను పనులు మారే అవకాశాలు కూడా తగ్గుతాయి. మహిళలకు మార్కెట్‌లో క్రియాశీలంగా పనిచేసే అవకాశం ఉండదు. తన జీవితాన్ని నియంత్రించే పరిస్థితులపై అదుపు ఉండదు. ఆమె ఆర్థికంగా ఆధారపడడం వలన మానసికంగా కూడా ఆధారపడుతుంది, ఉదాసీనంగా ఉండడం, ఇతర సాధారణ 'స్త్రీ' ల లక్షణాలు కలిగి ఉంటుంది. మితవాద భావాలు కలిగి ఉండడం, భయస్తురాలిగా ఉండాడం, ఉన్నసమాజం ప్రస్తుతం ఉన్నట్టుగానే ఉండాలని సమర్ధించడం జరుగుతుంటుంది.

పైగా ఇప్పుడున్న కుటుంబ యూనిట్ వినిమయ యూనిట్‌గా కూడా ఆదర్శవంతమైనది. ఈ విషయం మహిళా స్వేచ్ఛ కోరుకునే సాహిత్యంలో ఎక్కువగా చర్చించబడుతుంది. అంతమాత్రాన అదే అసలైన వ్యవహారం అని అనుకోవలసిన అవసరం లేదు. పై విశ్లేషణ సరైనదయితే కుటుంబం ఇంటిపనిని ఒక ప్రాథమిక ఉత్పత్తి యూనిట్‌గా, పిల్లల పెంపకం కేంద్రంగా పరిగణించబడాలి. ఒక పెట్టుబడిదారీ సమాజంలో కూడా ఒక కుటుంబ నిర్మాణం వినిమయాన్ని ప్రోత్సహించే కేంద్రంగా చూడబడుతుంది. ముఖ్యంగా మహిళలు మంచి వినిమయదారులు. ఇది వారికి వారి ఇంటి బాధ్యతల వలన వస్తుంది. అలాగే మహిళగా వారి స్థాయి తక్కువగా ఉండడం వలన కూడా వస్తుంది. సాధారణ విలువల గురించిన దఅఢమైన అవగాహన కొరవడడం, గుర్తింపు సమస్య కూడా వారు మరింత దోపిడీకి గురి అయ్యేలా చేస్తాయి. అందువలనే మంచి వినిమయదారులవుతారు.

ఆర్థిక వ్యవస్థలోని పారిశ్రామిక రంగంలో మహిళల చరిత్ర కేవలం పారిశ్రామిక అవసరాలపై ఆధారపడి ఉంది. మహిళలు అవసరానికి ఉపయోగించుకొనే పెద్ద సైన్యంగా పనికి వస్తారు. శ్రామికులు తక్కువగా ఉన్నప్పుడు (పారిశ్రామికీకరణ జరిగిన తొలిరోజుల్లో, ప్రపంచ యుద్ధ కాలంలో) మహిళలు శ్రమశక్తిలో ప్రధాన భాగం అవుతారు. శ్రామిక శక్తి అదనంగా ఉన్నప్పుడు 'ఇంటికి దీపం ఇల్లాలు' అనడం మళ్ళీ మొదలవుతుంది. అది మార్కెట్ నుండి మహిళలను బయటికి పంపడానికి ఉపయోగపడుతుంది. సాపేక్షంగా ఇది సులువు. ఎందుకంటే మహిళలుగాని, మగవారుగాని మహిళల పనిని ప్రధానమైనదిగా తీసుకోరు. మహిళ అసలైన పని ఇంటిదగ్గర అని మనకు బాగా నూరి పోస్తుంటారు. ఆమెకి పెళ్లయినా కాకపోయినా ఇది వర్తిస్తుంది. ఇంటి పెత్తనం అంతా తానే తీసుకున్నప్పుడు కూడా వర్తిస్తుంది.

ఇంటిపని ఎప్పటికీ మహిళ బాధ్యతే. ఇంటిబయట పనిచేసేటప్పుడుకూడా ఇంటిపని బయటి పనికూడా చక్కబెట్టుకోవలసిన బాధ్యత మహిళదే. (ఇంటి పని చేయడానికి వేరొకరిని పెట్టుకున్నా వారిని పర్యవేక్షించాల్సిన బాధ్యత) బయట పనిచేసే మహిళలు ముఖ్యంగా పిల్లలున్నవారు చేసేవి నిజంగానే రెండు పనులు. ఇంట్లో వారు సక్రమంగా తమ విధులు నిర్వర్తించగలిగితేనే వారిని బయటకు వెళ్ళనిస్తారు. మహిళలు ఎక్కువగా బయటికి వెళ్లి పనిచేస్తున్నప్పటికీ ఆ మోతాదులో వారికి స్వేచ్ఛ ఉండదని రష్యా, తదితర ఉత్తర యూరప్

> “ మహిళలకు స్వేచ్ఛ ఉండాలంటే ఈ రోజు మహిళల బాధ్యతయిన వ్యక్తిగత ఉత్పత్తి సామాజిక ఉత్పత్తిలో భాగంగా పరిగణించబడాలి. స్పష్టంగా చెప్పాలంటే, పిల్లల పెంపకం కేవలం తల్లిదండ్రుల బాధ్యత మాత్రమే కాకూడదు. సమాజం కూడా పిల్లల పెంపకానికి బాధ్యత వహించడం ప్రారంభించాలి. స్త్రీలు, పిల్లలు ఆర్థికంగా భర్త, తండ్రిపై ఆధారపడటం నుండి విముక్తి కలిగించాలి. మిగిలిన ఇంటి పనులలో సహితం మార్పులు రావాలి -అంటే ఉమ్మడి వంటశాలలు, బట్టలుతకడం వగైరాలు ఏర్పాటు చేయాలి. ”

దేశాలలోని పరిస్థితి చూస్తే అర్థం అవుతుంది. ఇంటిపని వ్యక్తిగత పరిధిలో ఉన్నంతవరకు బయట చేసే పనులలో సమానావకాశాలు కల్పించినంత మాత్రాన మహిళలు సమానత్వం సాధించలేరు. ఇంటిపని మహిళల పనే అవుతుంది. వారు రెండు బాధ్యతలు నిర్వర్తించవలసి వస్తుంది.

పై విశ్లేషణ నుంచి మహిళలకు స్వేచ్ఛ ఉండాలంటే ఈ రోజు మహిళల బాధ్యతయిన వ్యక్తిగత ఉత్పత్తి సామాజిక ఉత్పత్తిలో భాగంగా పరిగణించబడాలి. స్పష్టంగా చెప్పాలంటే, పిల్లల పెంపకం కేవలం తల్లిదండ్రుల బాధ్యత మాత్రమే కాకూడదు. సమాజం కూడా పిల్లల పెంపకానికి బాధ్యత వహించడం ప్రారంభించాలి. స్త్రీలు, పిల్లలు ఆర్థికంగా భర్త, తండ్రిపై ఆధారపడటం నుండి విముక్తి కలిగించాలి. మిగిలిన ఇంటి పనులలో సహితం మార్పులు రావాలి –అంటే ఉమ్మడి వంటశాలలు, బట్టలుతకడం వగైరాలు ఏర్పాటు చేయాలి. అప్పుడు మాత్రమే మహిళపట్ల వివక్ష చూపే భౌతిక పరిస్థితులు ఉండవు.

ఇవన్నీ ముందస్తు చర్యలు మాత్రమే. మహిళ తక్కువనే భావన సమాజంలో బలంగా నాటుకు పోయింది. దానిని పూర్తిగా తొలగించడానికి కొంత సమయం పడుతుంది. అయితే ఆ భావనకు మూలమైన పునాదిని కదిలిస్తే, ఆ తరువాత కొంత కాలానికైనా అది మారుతుంది. ఇది సాధ్యమే. ఉదాహరణకి ఇప్పుడు ఇళ్లలో వంటలు చేసే మహిళలే సామూహిక వంటశాలలో పనిచేస్తారు. ఇది కొంత పురోగతి. ముఖ్యంగా ఏ విధమైన దోపిడీ లేని సోషలిస్టు సమాజంలో. ఒకసారి మహిళలను వంటగది నుండి బయటకు తెస్తే ఆ తరువాత లింగ బేధం లేని సమాజం నిర్మించడానికి ఎక్కువ కాలం పట్టదు. ఇంటిపనిని వదిలించుకోకుండా మహిళలకు స్వేచ్ఛ కలగడం అసాధ్యం. ఈ రెండిటికి సంబంధం ఉందని పై ఉదాహరణలు తెలియ చేస్తున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థలో కేవలం సైద్ధాంతికంగా మాత్రమే మహిళను వంటింటికి దూరం చేయడం జరుగుతుంది.

అదేసమయంలో మహిళలు ఇంటిపని మానేయక పోతే ఇంటిపని పారిశ్రామికీకరణ జరగడం సాధ్యం కాదు. మహిళా ఉద్యమాల మూలంగా ఈ రోజు పెట్టుబడిదారీ సమాజంలో కూడా ప్రత్యామ్నాయ విధానాలు అందుబాటులో ఉన్నాయి. ఉదాహరణకి, ఇళ్లల్లో వండిన వంటలు ఇతరులకి కూడా అందుబాటులోకి వస్తున్నాయి. (గఅహిణులు ఇళ్లలో వంటలు చేసి అమ్మకాలు చేస్తున్నారు.) పిల్లలను చూసుకునేందుకు డే కేర్ కేంద్రాలు వస్తున్నాయి. అవిప్పుడు అందరికి అందుబాటులో లేకపోవచ్చు. ఖరీదు ఎక్కువగా ఉండవచ్చు. కానీ ఇంటికే వంటకాలు తెచ్చిపెట్టే సౌకర్యాలు, బయటికి వెళ్ళి తినగల వసతులు ఎక్కువగానే ఉన్నాయి. బట్టలుతికే వారు, ఇల్లు శుభ్రం చేసేవారు ఉన్నారు. అయితే వాటి ధరలే అందుబాటులో ఉండవు. అవే ఆ సేవలు వినియోగించుకోడానికి పెద్ద అడ్డంకి అవుతాయి. పైగా ఈ సేవలు అన్ని ప్రాంతాలలో కూడా అందుబాటులో ఉండవు. ఉదాహరణకి ఉత్తర అమెరికాలో ఉండవు. అందువలన ఈ సౌకర్యాలను పుర్తిస్థాయిలో ఉన్న అవకాశాలుగా చూడలేం. కేవలం పిండదశలో ఉన్నట్టుగానే భావించవలసి ఉంటుంది. ఏమయినప్పటికీ ప్రత్యామ్నాయాలుగా ఇవి ఉన్నాయి. ముఖ్యంగా ఉత్తర అమెరికాలో 'సేవా పరిశ్రమ' ప్రముఖంగా ఎదుగుతున్నది. మహిళను ఉత్పత్తి రంగంలో పెట్టడానికి, ఇంటికే పరిమితం చేయడానికి మధ్య వైరుధ్యం ఏర్పడుతుంది.

మహిళను ఇంటికే పరిమితం చేయడానికి ప్రస్తుత విధానంలోని రెండు అంశాలు ప్రధానమైనవి. మొదటిది జీతం బత్తెం లేని మహిళలు చేసే పని ఎక్కువగా ఉండడం. ఈ ఉత్పత్తి సాధనాలను కలిగిఉన్నవారు బాగా లాభపడగలగడం. మహిళల పనికి ఎంత తక్కువ గానైనా చెల్లింపులు చేయవలసి వస్తే సంపద పంపకంలో పెద్ద మార్పు వస్తుంది. కుటుంబాన్ని అంతటిని పోషించవలసి రావడం జీతానికి పనిచేసేవారిపై పడిన కనిపించని పన్ను, అతని జీతం ఇద్దరి శ్రమశక్తిని కొంటున్నది. రెండోది, సాధారణ స్థాయిలో శ్రామిక శక్తిని ఉపయోగించే విధంగా, అందరు మహిళలను పనిలో పెట్టగల మేరకు ఆర్థిక వ్యవస్థ విస్తఅతమవగలదా అన్నది మరో సమస్య. యుద్ధకాలం నాటి ఆర్థికవ్యవస్థ మహిళలను ఆర్థికరంగంలోకి తేగలిగింది. కానీ అందులో చాలామందిని నిలుపుకోలేకపోయింది. ఇంటిపనిని పారిశ్రామికీకరించడం ద్వారా అవసరమైన ఉద్యోగాలు కల్పించవచ్చని వాదిస్తే అందుకు బదులుగా రెండు ప్రతివాదనలు చేయవచ్చు. 1. ఇప్పుడున్న స్థితిని యధాతథంగా ఉంచడానికి, గృహశ్రమను సామాజికీకరించటానికి వ్యతిరేకంతగా బలమైన ఆర్థికశక్తులు పనిచేస్తున్నాయి. 2. ఈ శక్తులను కొంతమేరకు ఎదుర్కోగలిగిన సేవారంగ పరిశ్రమలు శ్రామికశక్తి పెరిగినంతగా పెరగటం లేదు. మహిళలకు నూతనమైన పనులను సఅష్టించడం కన్నా, కేవలం ఇళ్లలో “అండర్ ఎంప్లాయ్‌మెంట్'' (చేయగల పనికన్నా తక్కువపనిని మాత్రమే చూయించటం)ని మాత్రమే సఅష్టించేటట్టు ప్రస్తుత సేవారంగంలోని పరిస్థితులు ఉన్నాయి. ఈ పరిస్థితి కొనసాగిన్నన్ని రోజులు మహిళలు అవసరమైనపుడు మాత్రమే వినియోగపడే పారిశ్రామిక నిరుద్యోగ సైన్యంగా మిగిలిపోతారు. కార్మిక శక్తిలో సమాన భాగస్వాములుగా ఇముడ్చుకోబడితేనే, ఇంటిపని సామాజికీకరించబడటంపై వత్తిడి పెరుగుతుంది. అప్పుడే నయాఉదారవాదం కేవలం యుద్ధసమయాలలోనే విస్తఅతపరచినట్టుగా ఆర్థికవ్యవస్థను సాధారణ సమయాల్లోనూ విస్తఅతపరచటం సాధ్యమవుతుంది.

అయితే ఇటువంటి విధానపరమైన మార్పులు చిన్న కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తాయి. కుటుంబ వినిమయాన్ని స్థిరంగా ఉంచడం, మహిళలకు గృహంతో ఉన్న అనుబంధం వారిని శ్రామికమార్కెట్ నుంచి

**“ మహిళకు ఇంటి పని అంటగట్టి ఉన్నందువలన అన్ని హక్కులు ఉన్నా ఆమె ఇంకా అణచి వేయబడుతూనే ఉంటుందన్న విషయం మనకు తెలుసు. చాల సందర్భాలలో ఇంటిపని అనుత్పాదకమైనది. అత్యంత క్రూరమయినది. కష్టమైనది. “అదెంత క్షుద్రమైనదంటే మహిళాభ్యుదయానికి అందులో లేశమంతకూడా అవకాశాలు లేవు ”**

దూరంగా ఉంచడం నయాఉదారవాద పెట్టుబడిదారీ విధానానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అందువలన ఈ విధానంలో మార్పులను అది కోరుకోదు. పశ్చిమ దేశాలలోని సమాజాలలో ఇప్పటికే జరిగిన మార్పులతో మానసిక ఒంటరితనాన్ని భరించవలసిన పరిస్థితులు ఏర్పడినాయనే అనుమానాలు కలిగిస్తున్నాయి. మహిళల విమోచనోద్యమానికి ఇటువంటి భయాలే అడ్డంకిగా నిలుస్తాయి. అదే నిజమైతే అందుకు ప్రత్యామ్నాయం – సహకార రంగం, కిబట్స్ (వ్యవసాయం కొందరు కలిసి చేసుకోవడం, పిల్లల బాధ్యతను వారందరు కలిసి పంచుకోవడం – కిబట్స్‌అంటే హిబ్రులో కూటమి )–. ఇక్కడ మనుషులకు అవసరమైన మానసిక ఓదార్పు, ప్రేమ లభ్యమవుతాయి. చిన్న కుటుంబాలలోకన్నా సంతఅప్తిగా ఉంటారు. పెట్టుబడిదారీ విధానంలో పురుషులకి దొరికినట్టే మహిళలకు పాక్షిక స్వేచ్ఛ దొరుకుతుంది. అంటే దీనర్థం మహిళలు వివక్ష నుండి విముక్తి కోసం ఎదురుచూడాలని కాదు. మహిళల భౌతిక స్థితికి ఒక మూలం ఉందని తెలియచేయడమే. మనం కేవలం వివక్షకు మాత్రమే కాక, దోపిడీకి కూడా గురవుతున్నాము. ప్రస్తుత పరిస్థితులలో మొత్తం వ్యవస్థ నడవాలంటే మన జీతం బత్యం లేని పని చాలా అవసరం. మహిళలు తమ స్థితిని గనక సవాలు చేస్తే ఆ మేరకు దోపిడీ ప్రభావం తగ్గుతుంది. అంతేకాక అలా తాము కుటుంబంలో చేస్తున్న పనిని సవాలు చేయడం వలన కుటుంబ పనితీరు కుంటుపడుతుంది. మహిళను శ్రామిక శక్తికి దూరంగా ఉంచే అవకాశాలు తగ్గుతాయి. అవన్నీ కలిపి సమాజం మొత్తంగా మారే అవకాశాలను పెంచవచ్చు. ఫలితంగా ఉత్పత్తి విధానంలో కూడా మార్పులు జరగవచ్చు. అయితే సమూల మార్పులు జరగాలంటే విప్లవం రావలసిందే. అందులో నాకెటువంటి సందేహం లేదు. సమాజాన్ని పరిపూర్ణంగా మార్చే విప్లవం కోసం పనిచేయడం మన ప్రధాన కర్తవ్యం. సమాజంలో విప్లవాత్మక మార్పులతోనే మహిళలపై జరుగుతున్న దోపిడీ అంతమవుతుంది.

**అనుబంధం**: మహిళా విముక్తిపై వి ఐ లెనిన్ ఉటంకింపు: దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చి యాంత్రీకరించబడిన బడా పరిశ్రమలలో కేంద్రీకరించబడిన కార్మిక సమూహాలు వ్యక్తిగతంగా ఆధారపడడాన్ని, పితఅస్వామ్య భావజాలాన్ని సహించవు. “గత కాలపు వైఖరిని సమూలంగా తిరస్కరిస్తాయి”. పాతబడిన ఈ సంప్రదాయాలను తిరస్కరిస్తేనే వ్యక్తిగత ఉత్పత్తిని నియంత్రిచగలిగే అవసరం, అవకాశం కలుగుతుంది. ముఖ్యంగా మహిళలను, పిల్లలను ఉత్పత్తిరంగంలోకి తీసుకుని రావడం పురోగతే. పెట్టుబడిదారీ పరిశ్రమ ఈ శ్రామిక జనాభాను అత్యంత దుర్భర పరిస్థితులలో ఉంచుతుందనడం నిస్సందేహం. కానీ వీరిని ఉత్పత్తి విధానానికి దూరంగా ఉంచుతుంది. లేదా పితఅస్వామ్య భావజాలంతో ఈ పని చేయనీయకుండా నిలువరిస్తుంది. ఇది పూర్తి మితవాదం, ఉహాజనితం కూడా. ఎప్పుడూ బయటకు రాని, ఇంటి చుట్టూనే గుడుగు డు గుంచంలా తిరిగే కుటుంబ పరిధి నుండి వీరు బయటికి వచ్చి ఉత్పత్తిలో పాల్గనాలి. వీరిని ప్రత్యక్షంగా ఉత్పత్తిలో భాగస్వాములను చేసి, వీరిపై ఉన్న పితఅస్వామ్య వెలివేతను దూరం చేయాలి. పరిశ్రమే వారి అభివఅద్ధికి దోహద పడుతుంది. స్వతంత్రతను పెంపొందిస్తుంది.

ఎన్ని చట్టాలున్నా, ఇప్పటికీ మహిళ గఅహ బానిసే. క్షుద్రమైన ఇంటిపని ఆమెను గిడసబారుస్తుంది. ఊపిరాడకుండా చేస్తుంది. అవమాన పరుస్తుంది. వంటింటికి, సేవలకు ఆమెను పరిమితం చేస్తుంది. ఆమె తన శ్రమని అనుత్పాదకంగా వినియోగించి వఅథా చేస్తుంది. మహిళకు నిజమైన విముక్తి నిజమైన కమ్యూనిజం (కార్మికుల అధీనంలో రాజ్యాధికారం) లోనే సాధ్యం. ఇక్కడే క్షుద్రమైన ఇంటిని శుభ్రం చేసే పనికి వ్యతిరేకంగా, సమూలమైన మార్పు సాధ్యపడుతుంది పెద్ద ఎత్తున సోషలిస్టు ఆర్థికవ్యవస్థ ప్రారంభమవుతుంది.

ఏ కమ్యూనిస్టు అయినా విబేధించని ఈ అంశంపై మనం తగినంత దృష్టి పెట్టామా? లేదు. ఈ పార్శ్వంలో ఇప్పటికే ఉన్న మొలకలను సంరక్షించడానికి తగిన చర్యలు తీసుకున్నామా? మళ్ళీ లేదనే సమాధానం. జన సామాన్యం నిర్వహించే వంటశాలలు, సేవా కార్యక్రమాలు, కిండర్ గార్టెన్‌లే ఈ మొలకలు. ఇందులో ఎటువంటి డాబు దర్పం లేదు. సంబరాలు లేవు. ఇవి మహిళలను విముక్తి చేయగలవు. సామాజిక ఉత్పత్తిలోనూ, ప్రజా జీవితంలోను ఆమె భాగస్వామ్యం పెంచగలవు. ఇవేవి కొత్త విధానాలు కూడా కావు. వీటిని (సోషలిజానికి ముందు ఉండవలసిన భౌతిక పరిస్థితులు) బడా పెట్టుబడిదారీ వ్యవస్థే సిద్ధం చేసి పెట్టింది. అయితే పెట్టుబడిదారీ వ్యవస్థలో అవి అరుదుగా ఉన్నాయి. ఉత్తమ కార్మికులు న్యాయంగా అసహ్యించుకునే అన్ని భ్రష్టాచారాలు – లాభాపేక్ష, సట్టా వ్యాపారం, వంచన, మోసం, “బూర్జువా వర్గం యొక్క దాతఅత్వం” వంటి వన్నీ–అందులో ఇమిడిఉన్నాయి.

మహిళకు ఇంటి పని అంటగట్టి ఉన్నందువలన అన్ని హక్కులు ఉన్నా ఆమె ఇంకా అణచి వేయబడుతూనే ఉంటుందన్న విషయం మనకు తెలుసు. చాల సందర్భాలలో ఇంటిపని అనుత్పాదకమైనది. అత్యంత క్రూరమయినది. కష్టమైనది. ‘‘అదెంత క్షుద్రమైనదంటే మహిళాభ్యుదయానికి అందులో లేశమంతకూడా అవకాశాలు లేవు”

బి ఏమిలీవుడ్.

మనం నమూనా సంస్థలు – సామూహిక ఆహారశాలలు, సేవాసంస్థలు– స్థాపిస్తున్నాం. అవి మహిళను ఇంటిపని నుండి విముక్తి చేస్థాయి.

కార్మికులే తమను తాము విముక్తి చేసుకోగలుగుతారు. అలాగే శ్రామిక మహిళలే తమను తాము విముక్తి చేసుకోగలుగుతారు. శ్రామిక మహిళలే ఇటువంటి సంస్థలు వచ్చేటట్టు కఅషి చేయాలి. అవి వారి జీవితాలలో పాత పెట్టుబడిదారీ సమాజం తేలేని మార్పులను తెస్తాయి.

**(అనువాదం: కె ఉషారాణి)**

# భారత కమ్యూనిస్టు పార్టీ అవిర్భావం

(2వ పేజీ తరువాయి)

దీని ఆధారంగా మొత్తం చరిత్రను పునర్నిర్మించే పని ఆర్‌ఎస్‌ఎస్, అనుబంధ సంస్థలు పెద్దఎత్తున నిర్వహిస్తు న్నాయి. "ముస్లింలు రాకముసుపు అంటరాని తనం లేదని, వారితోనే అంటరాని తనం మొదలయ్యిందని పచ్చి అబద్ధాలు చెప్పిచెప్పి, ఇప్పుడు బలపడే కొద్ది స్వాతంత్రోద్య మంలో కీలక పాత్రధారులైన గాంధీజీ, నెహ్రు వంటి వారి మీదే అబద్ధపు ప్రచారం ప్రారంభిం చారు. కానీ భారత స్వాతంత్ర్యోద్యమంలో వీరికి ఇసుమంత పాత్రకూడా లేదు. హిందుమతా భిమానంతో ఆర్‌ఎస్‌ఎస్‌ని ఒకటి రెండుసార్లు ప్రశంసించిన సర్దార్‌వల్లభాయి పటేల్‌ని పట్టుకుని స్వాతంత్రో ద్యమ వారసత్వాన్ని స్వంతం చేసుకోవాలని ఆర్‌ఎస్‌ఎస్ కూటమి ప్రయత్ని స్తున్నది. అందువలన పాలకుల ఈ ప్రయత్నా లను ఓడించాలంటే అనివార్యంగా విప్లవశక్తులు వాస్తవ చరిత్రని ఆయుధంగా మల్చుకోకతప్పదు.

**సంవత్సరాల కంపెనీ పాలన**

నాడు కోటి జనాభా మించని ఒక చిన్నదేశమైన ఇంగ్లాండ్‌కు చెందిన ఈస్టిండియా కంపెనీ 8000 కిలోమీటర్లు సముద్రమార్గంలో వచ్చి ఇంత పెద్ద దేశాన్ని 190 సంవత్సరాలు (1757–1947) పరిపాలించడం నిజంగానే ఆశ్చర్యం కలిగిస్తుంది. కాని వలస విధానమంటే ఇదే మరి. ఆ రోజైనా ఈ రోజైనా వ్యాపారం అంటే లాభాలు, మార్కెట్లపై ఆధిపత్యాన్నే కాదు ప్రభుత్వాధిపత్యాన్నే కోరుకుంటాయి. ఈ రోజు మనం ఎదుర్కొం టున్న నయా ఉదారవాద విధానాల సారంశం ఇదే కదా.

కంపెనీ పాలన జనం, ముఖ్యంగా రైతాంగ మూలుగలు పీల్చేసింది. చేతివృత్తులను ధ్వంసం చేసింది. "వాణిజ్య చరిత్రలోనే బ్రిటిష్ దారుణాలకు పోటీలేదు" అని 1835–36" సంవత్సరాల రిపోర్టులో గవర్నర్ జనరల్ పేర్కొన్నాడు. "చేనేత పనివారల ఎముకలు పిండిచేసి భారత భూభాగానికి రంగులద్దారని" ఆయనే రాశాడు. ఈ విషయాన్నే మార్క్స్ మహాశయుడు "భారతీయుల కన్నీటి పునాదులపై తమ క్రూరమైన ప్రయోజనాలు నెరవేర్చుకోవ డానికి, రాజ్యవిస్తరణకు బ్రిటన్ ధనస్వామ్యం మాటలకందని దుర్మార్గపు పద్ధతులు అనుసరించిందని" కరుకుగా ప్రకటించారు. మొగల్ చక్రవర్తుల చివరి సంవత్సర పాలన (1764–65) భూమిశిస్తు వసుళ్ల 8,18,000 పౌండ్లు. కంపెనీ మొదటి సంవత్సర పాలనలో అది ఒక్కసారిగా 14,70,000 పౌండ్లకు మరో సంవత్సరానికి 30,91,000 పౌండ్లు,. ఒక్కమాటలో చెప్పాలంటే మనదేశాన్ని ప్రజల్ని దోచుకోవడం ద్వారానే (ఆదిమ సంచయం) బ్రిటన్ ప్రపంచాధిపత్యాన్ని సంపాదించింది. ఈ అసాధారణ ఆర్థిక దోపిడి దేశాన్ని తీవ్రమైన కరువు కాటకాల్లోకి నెట్టింది. అతిదారుణమైన ఈ దోపిడి పాలనని ప్రజలు మూగజీవుల్లా భరించలేదు. దేశవ్యాపితంగా వందలాది సాయుధ తిరుగుబాట్లు జరిగాయని బ్రిటిష్



**1857 భారత తొలి స్వాతంత్ర సంగ్రామం**

ప్రభుత్వ రికార్డులు చెబుతున్నాయి. కంపెనీ పాలన ఆరంభం అయిన నాటినుండి ఈ సాయుధ తిరుగుబాట్లు విస్తారంగా, ఉధృతంగా జరిగాయి. వీటన్నింటి పరాకాష్టగా 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం ఎగిసిపడింది. 1857–58లో జరిగిన ఈ తిరుగుబాటును అణచివేసిన తరువాత కూడా అనేక ప్రాంతాల్లో సాయుధ తిరుగుబాట్లు జరిగాయి. అయితే ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి దారితీసిన పరిస్థితులు, ఆ పోరాటాన్ని అణచివేసిన తర్వాత జరిగిన పరిణామాలు, వాటి పర్యవసానాలు నేటికీ ఎన్నో గుణపాఠాలనందిస్తున్నాయి.

1857లో జరిగిన ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం దేశవ్యాప్తంగా జరుగుతున్న అనేక సాయుధ తిరుగుబాట్లకు పరాకాష్ట. అంతేకాదు 1764లో జీతాలు పెంచనందుకు సైన్యంలో జరిగిన తిరుగుబాటుకు కూడా పరాకాష్ట అని కూడా చెప్పొచ్చు. 1764లో తిరుగుబాటు చేసిన సైనిక నాయకులు 30 మందిని కంపెనీ అధికారులు కాల్చి చంపినా సైన్యంలో తిరుగుబాట్లు జరుగుతూనే వచ్చాయి. ఈ తిరుగుబాట్లకు ప్రజల సాయుధ తిరుగుబాట్లు తోడవడంతో అవి 1857లో ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ రూపం తీసుకున్నాయి. మరో పక్క కారల్‌మార్క్స్ వర్ణించినట్లు 'ఈస్టిండియా కంపెనీ భారతదేశ సంపదను కొల్లగొట్టి బ్రిటన్‌కి తరలించే వాహనంగా పని చేసింది. భారతీయుల రక్తాన్ని, చెమటనీ డబ్బుగా మార్చి ఇంగ్లండ్‌లో పెట్టుబడి అభివృద్ధికి ఆదిమ సంచయంగా ఉపయోగించింది. 1757 – 1815 (55 సం॥లు) మధ్య తక్కువ చేసి చూపించిన గణాంకాల లోనే బ్రిటీష్ వలస పాలకులు భారతదేశం నుండి తరలించుకుపోయిన సొమ్ము విలువ 10,00,00,000 పౌండ్లు'. ఈ దోపిడీ నిరాఘాటంగా పెరుగుతూవచ్చింది. 1850లలో రైల్వేల ప్రారంభంతో ఈ దోపిడీ అవధులు దాటింది. రైలు మార్గం ద్వారా 'ప్రెసిడెన్సీ నగరాలను (మద్రాసు, బొంబాయి, కలకత్తా) ఢిల్లీకి కలపడం ద్వారా గొప్ప సాంఘిక, ఆర్థిక, రాజకీయ లబ్ధి పొందగలిగాము.' అని 1853లో వైశ్రాయ్ డల్హౌసి సరిగానే చెప్పాడు. రైల్వేలతో పాటు బొగ్గుగనులు – కంపెనీలు రంగం మీదకు (1843లో బెంగాల్ బొగ్గు కంపెనీ) వచ్చాయి. 1839లో మొదటి అస్సాం టీ కంపెనీ ఏర్పాటయింది. 1854లో మొదటి జనపనార కంపెనీ కలకత్తా దగ్గరలోని రీషా – ఆక్లాండ్‌లో ఏర్పడింది. నూలు మిల్లులు పుట్టుకొచ్చాయి. ఈ మిల్లుల్లోనూ, టీ తోటల్లోనూ కార్మికుల స్థితిగతులు దయనీయంగా ఉండేవి. ఈ పరిణామాల పర్యవసానంగా ఎంతో అభివృద్ధి చెందిన చేతివృత్తులు ధ్వంసం అయ్యాయి. 'బ్రిటీష్ దోపిడీ దారుడు భారత మగ్గాన్ని విరగ్గొట్టాడు, రాట్నాలను ధ్వంసం చేశాడు... చివరకు పత్తికి తల్లైన భారతదేశాన్ని నూలు దుస్తులతో ముంచేశాడు.' అన్నారు మార్క్స్. బ్రిటీష్ పాలన అనేక వైరుధ్యాలకు తెరలేపింది. ఈ వైరుధ్యాల ప్రభావం ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం మీద

పడింది. (వాస్తవానికి ఈ వైరుధ్యాలను అర్థం చేసుకుంటేగాని నేడు కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించడం సాధ్యం కాదు) వంద సంవత్సరాల కంపెనీ పాలనకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి వ్యతిరేకంగా, సైన్యానికి మద్దతుగా రంగంలోకి దిగిన బ్రిటీష్ ప్రభుత్వం చుట్టుపక్కల ప్రాంతాల నుండి పంజాబీ, మరాఠీ, నేపాలీ రెజిమెంట్లను సమీకరించింది. ఈస్టిండియా కంపెనీ పాలనకు వ్యతిరేకంగా జరిగిన ఈ సాయుధ తిరుగుబాటును అణచివేసింది. భారతీయులను అనైక్యంగా ఉంచుతున్న వర్ణాలు, కులాలు, తరతరాలుగా వాటి మధ్య వైరుధ్యాలు కొనసాగుతున్నాయి. కొత్తగా ఆవిర్భవించిన మధ్యతరగతి మేధావులు బ్రిటీష్ అనుకూల వైఖరి తీసుకున్నారు. బ్రిటీషువారిది అభివృద్ధి చెందిన ఆధునిక వర్గమని, మన సమాజాన్ని పీడిస్తున్న సతీసహగమనం లాంటి మూఢా చారాలను వారి సహకారంతో పారద్రోలవచ్చని ఈ మధ్యతరగతి మేధావులు బలంగా నమ్మటం దీనికి ప్రధాన కారణం. ఇటువంటి పరిణామాల వలన ఆ తిరుగు బాటును బ్రిటీషువారు అణచివేయగలిగారు. బ్రిటీష్ ప్రభుత్వం కంపెనీ పాలనను రద్దు చేసి, భారతదేశ పరిపాలనను తన ఆధీనంలోకి తీసుకుంది. మేధావులు ఆశించిన దానికి భిన్నంగా ఈ దేశంలోని సాంప్రదాయాలలో జోక్యం చేసుకోబోమని బ్రిటిష్ ప్రభుత్వం తరపున రాణీగారు చేసిన ప్రకటనలో తేల్చి చెప్పారు. కంపెనీకి వ్యతిరేకంగా పోరాడిన సామంత రాజులు, జమిందారులకు వారి హక్కులను ఇస్తామని చెప్పడంతో ఆ వర్గాలు బ్రిటీష్ పాలనకు అనుకూలురుగా మారగా, మధ్యతరగతి మేధావులు బ్రిటీష్ పాలనను వ్యతిరేకించటం ప్రారంభించారు. ఈ సందర్భంగా మరో ప్రధాన సమస్య తలెత్తింది. హిందూ మతోద్ధరణ పేరుతో వికృతమైన జాతీయవాదం లేవనెత్తబడింది. ఐరోపా ఖండంలో పెట్టుబడిదారీ వ్యవస్థ ఆవిర్భావాన్ని సుగమం చేస్తూ జరిగిన సాంస్కృతిక పునరుజ్జీవనో ద్యమానికి, మన దేశంలో జరిగిన దానికీ ఇదే తేడా. అక్కడ ఆధునికత వైపు, శాస్త్రీయ దృక్పథం వైపు పునరుజ్జీవనోద్యమం నడవగా, ఇక్కడ పురాతన యుగాలవైపు నడిచింది. రాజారామ్మోహన్ రాయ్, స్వామి వివేకానంద, రామకృష్ణ పరమహంస, దయానంద సరస్వతి వంటి వారి తాత్విక ధోరణిలో ఈ అంశం ప్రధానమని ఇఎంఎస్ నంబూద్రిపాద్ తన 'భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్ర' గ్రంథంలో రాశారు. ఇటువంటి పరిణామాల నేపథ్యంలో బ్రిటీష్




**1917 అక్టోబర్‌లో మాస్కోలోని నికోల్‌స్కయా వీధిలో కదం తొక్కుతున్న రష్యన్ విప్లవ సేన**

పాలకులు ఆశించిన దానికి భిన్నంగా భారత స్వాతంత్ర్యోద్యమం రూపుదిద్దుకుంది. మరలా పోరాటాలు విస్తరించనారంభించాయి. ఇటువంటి పరిస్థితులలో 1885లో అఖిల భారత కాంగ్రెస్ స్థాపించబడింది. క్రూరమైన వలస పాలనకు వ్యతిరేకంగా ప్రజాప్రతిఘటన పెరుగుతున్న నేపథ్యంలో ఏ మార్గంలో ముందుకు సాగాలో తేల్చుకోలేకపోయిన కాంగ్రెస్ పార్టీ అతివాదులు, మితవాదులుగా నిట్టనిలువునా చీలిపోయింది.

ఈ సమయంలోనే అంతర్జాతీయ రంగంలో పెను మార్పులు ప్రారంభమయ్యాయి. మన స్వాతంత్ర్యోద్యమాన్ని, దేశ ప్రజానీకాన్ని ఈ పరిణామాలు ప్రభావితం చేశాయి. ముడిసరుకుల కోసం, పారిశ్రామిక వస్తువులను స్వేచ్ఛగా అమ్ముకోవడం కోసం పెట్టుబడిదారీ దేశాల మధ్య ఎడతెరిపిలేని యుద్ధాలు జరుగుతున్నాయి. ఈ యుద్ధాల మధ్య సోషలిస్టు విప్లవాల దశ' ప్రారంభమైంది. ఐరోపా ఖండంలో ప్రధానంగా విస్తరించి ఉన్న కమ్యూనిస్టు మేధావులు, పార్టీలు సామ్రాజ్యవాదాన్ని అర్థం చేసుకోవడానికి చర్చోపచర్చలు జరుపుతున్నారు. మార్క్స్ అనంతరం కామ్రేడ్ ఏంగిల్స్ ప్రారంభించిన రెండవ ఇంటర్నేషనల్ ఈ సైద్ధాంతిక పోరాటానికి వేదిక అయింది. రష్యాలో 1905లో గొప్ప విప్లవ వెల్లువ వచ్చింది. దీనిని జార్ చక్రవర్తి దారుణంగా అణచివేశారు. కమ్యూనిస్టు పార్టీపై తీవ్ర నిర్బంధం అమలు జరిగింది. నాయకులు ప్రవాసంలోకి వెళ్ళిపోయారు. 1871 తొలి కార్మిక రాజ్యం- పారిస్ కమ్యూన్‌ను రక్తపుటేరుల్లో ముంచిన తరువాత ఇక కార్మికవర్గ విప్లవాలు తలెత్తవని, మార్క్సిజానికి కాలం చెల్లిందని చంకలు గుద్దుకుంటున్న పాలకవర్గాలు రష్యా పరిణామాలతో ఉలిక్కిపడ్డాయి. తమ తమ దేశాల్లో కార్మికోద్యమం, కమ్యూనిస్టు పార్టీల మీద విరుచుకుపడ్డాయి.

సామ్రాజ్యవాదుల మధ్య విభేదాలు తీవ్రం కావటంతో రెండు సామ్రాజ్యవాద కూటముల మధ్య 1914లో మొదటి ప్రపంచయుద్ధం ప్రారంభమైంది. రెండవ ఇంటర్నేషనల్ నాయకులు కార్మికవర్గ అంతర్జాతీయతను విస్మరించారు. కమ్యూనిస్టు పార్టీల నాయకులు పచ్చి జాతి ఉన్మాదంతో వ్యవహరించారు. యుద్ధంలో ఉన్న తమతమ దేశాల పాలకవర్గాలను బలపరచాలని వాదించారు. ఈ మార్క్సిస్టు వ్యతిరేక వాదనను చిత్తు చేస్తూ శ్రామికవర్గ అంతర్జాతీయతను అనుసరించాలని కామ్రేడ్ లెనిన్ వాదించాడు. అనుకూల పరిస్థితులను అవగాహన చేసుకున్న లెనిన్ రష్యాలో విప్లవ సన్నాహాలు చేశాడు. 1917 నవంబర్ 7న కార్మికవర్గ మహావిప్లవం జయప్రదం అయింది. తొలి సోషలిస్టు రాజ్యస్థాపన జరిగింది. అవకాశవాదుల నాయకత్వాన ఉన్న రెండో ఇంటర్నేషనల్ రద్దు చేయబడింది. 1919లో లెనిన్ నాయకత్వాన మూడో ఇంటర్నేషనల్ లేక కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ఏర్పడింది.

తొలి సోషలిస్టు రాజ్యం, కార్మికవర్గ ప్రభుత్వం (కార్మిక, కర్షక సైన్యం, సోవియట్ నాయకత్వాన) ప్రపంచ యుద్ధం నుండి వైదొలిగింది. పెట్టుబడిదారీ దేశాల్లో పోరాడుతున్న కార్మిక వర్గానికే కాక, వలస దేశాల్లో జరుగుతున్న స్వాతంత్ర్యోద్యమాలకు, జాతీయ విముక్తి పోరాటాలకు ఆ విప్లవ విజయాలు నూతనోత్తేజం కలిగించాయి. అనేక దేశాల్లో కమ్యూనిస్టు పార్టీలు ఆవిర్భవించాయి. 1920లో మన దేశంలో కూడా కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది.

❋

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-10-2019 (36 pages) Postal Regd. No D/VJ/172/2018-20

# దోపిడీ వర్గాలమీదనే కాదు వారుపెంచి పోషించిన దుర్లక్షణాలమీద కూడా పోరాడాలి!



**– లీ షావ్‌చీ**

..కమ్యూనిస్టు పార్టీ– కార్మిక వర్గం మీదా, దోపిడీకి పీడనకు గురియవుతున్న ప్రజలమీదా ఆధారపడి, మార్క్సిజం లెనినిజం సిద్ధాంత మార్గదర్శకత్వంలో ప్రజావిప్లవాన్ని నడిపించి తుది విజయం సాధించి తీరుతుంది. అలాగే సమాజాన్ని తదుపరి లక్ష్యమైన కమ్యూనిజం వైపు నడిపించి తీరుతుంది. ఎందుకంటే మానవ సమాజం కమ్యూనిజం వైపు పయనించడం అనివార్యమని చారిత్రక సూత్రాలు చెబుతున్నాయి. కార్మికవర్గంలోనూ ఇతర పీడిత తాడిత ప్రజానీకంలోనూ అత్యంత గొప్ప విప్లవ శక్తి దాగుందనీ, ఈ శక్తిని సమీకరించి, ఐక్యపరిచి, సంఘటితం చేస్తే దోపిడీవర్గాలకు చెందిన సమస్త అభివృద్ధి నిరోధక శక్తులపైనా, సామ్రాజ్యవాదంపైనా విజయం సాధించగలమని ఈ సూత్రాలు చెబుతున్నాయి. కమ్యూనిస్టు పార్టీ, కార్మికవర్గం కొత్త శక్తులనీ, అభివృద్ధి చెందుతున్న శక్తులనీ, కొత్తవీ, అభివృద్ధి చెందేవీ ఏవైనా అజేయంగా ఉంటాయని ఈ సూత్రాలు చెబుతున్నాయి. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రా, చైనా కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రా ఈ విషయాన్నే నిరూపించాయి.....అయితే, అంతర్జాతీయ అభివృద్ధి నిరోధక శక్తులూ, దోపిడీ వర్గాలూ మనకన్నా బలంగా ఉన్నారన్న విషయాన్ని మనం మరిచిపోకూడదు. అంతేకాదు వారు అనేక రంగాల్లో తాత్కాలికంగా మనకన్నా ఆధిక్యంలో ఉన్నారన్న విషయాన్నీ మనం మరిచిపోరాదు. సుదీర్ఘమైన, కఠినాతి కఠినమైన, బాధాకరమైన పోరాటం ద్వారా మాత్రమే మనం వారిని ఓడించగలం.

ఉత్పత్తి సాధనాలపై వేలాది సంవత్సరాల పాటు ప్రయివేటు యాజమాన్యంగల సమాజంలో దోపిడీ వర్గాలు తమ అధికారం ద్వారా అన్ని రంగాల్లోనూ శక్తివంతంగా తయారయ్యాయి. అన్ని సదుపాయాలూ సమకూర్చుకున్నాయి. సమాజంలో తరతరాలుగా కొనసాగుతూ వచ్చిన వెనుకబాటుతనం, అజ్ఞానం, స్వార్థం, పరస్పర అపనమ్మకం, మోసం, పరస్పర కలహాలు, హత్యలు మొదలైనవి ఈ దోపిడీ వర్గాల సుదీర్ఘ పాలనలో మరింతగా పెంపొందాయి. ఇది దోపిడీకి గురయ్యే ప్రజానీకం మీద, సమాజంలోని ఇతరుల మీద కూడా దుష్ట ప్రభావాన్ని కలిగించింది. దోపిడీ వర్గాలు తమ వర్గ ప్రయోజనాలనూ, వర్గ పాలననూ కాపాడుకునే ప్రయత్నంలో ఈ దుర్లక్షణాలన్నీ అనివార్యంగా పెంపొందుతాయి. తాము దోపిడీ చేస్తున్న ప్రజలు వెనుకబాటుతనంలోనూ, అసంఘటితంగానూ, వేరువేరుగానూ ఉండకపోతే వారు వాళ్లను పరిపాలించలేరు కదా! అందువల్ల మనం విజయం సాధించాలంటే దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా తీవ్రమైన పోరాటం చేయడమే కాదు, ప్రజల్లో దీర్ఘకాలంగా ఉంటూ వస్తున్న వారి ప్రభావానికి వ్యతిరేకంగా కూడా పోరాడాలి. ప్రజల్లో కనిపించే వెనుకబాటు భావాలకూ, ఇతర వెనుకబాటు లక్షణాలకూ వ్యతిరేకంగా పోరాడాలి. అప్పుడు మాత్రమే మనం ప్రజల రాజకీయ చైతన్యాన్ని పెంచగలం. దోపిడీ వర్గాలను ఓడించేందుకు వారిని ఐక్య పరచగలం. ఇక్కడే కమ్యూనిజం సాధించడంలో కష్టం దాగి ఉంది. కామ్రేడ్స్! ప్రజలంతా రాజకీయంగా చైతన్యవంతులై ఉండాలనీ, ఐక్యంగా, దోపిడీ వర్గాల ప్రభావాలనుండి దూరంగా, వెనుకబాటు తనానికీ దూరంగా ఉండాలని కొందరు భావిస్తారు. కాని ప్రజలంతా అలా ఉంటే ఇంక విప్లవం సాధించడంలో కష్టమేముంటుంది?

**(లీ షావ్‌చీ 1936లో రచించిన 'మంచి కమ్యూనిస్టు ఎలా ఉండాలి?' గ్రంథం నుండి)**

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Prajasakti Printers & Publishers private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 9490098977, 9494101091.
Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.14, No.4. Published on October 1, 2019